మిర్చి ధరలు పతనం

• గుంటూరు యార్డుకు పోటెత్తిన టిక్కీలు

3

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupati, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 197 | విజయవాడ, గురువారం 22 ఫిబ్రవరి 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 22 February 2024 | Rs



మహిళల ఫుట్‌బాల్ జట్టు సంచలనం

• యూరోపియన్ జట్టుపై తొలి విజయం

8

రైతులపై ఘాతుకం

- 21 ఏళ్ల యువ రైతు బలి • మరో 25 మందికి రబ్బర్ బులెట్ గాయాలు
- హర్యానాలో బిజెపి ప్రభుత్వ దాష్టీకం • హర్యానా-పంజాబ్ సరిహద్దుల్లో పరిస్థితి ఉద్రిక్తం
- ఐదో దఫా చర్చలకు కేంద్రం పిలుపు
- పోలీసు చర్యలను ఖండించిన ఎఐకెఎస్, ఎస్‌కెఎం, ఎఐఎడబ్ల్యుయు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

హర్యానాలో బిజెపి ప్రభుత్వ క్రూరత్వానికి శుభకరణ్ సింగ్ అనే 21 ఏళ్ల యువ రైతు బలయ్యాడు. మరో 25 మంది గాయపడ్డారు. తాము పండించిన పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కావాలని కోరడమే నేరమన్నట్లు హర్యానా ప్రభుత్వం రైతు ఉద్యమంపై ఉక్కుపాదం మోపింది. రైతులు బుధవారం పునరుద్ధరించిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని రక్తసిక్తం చేసింది. రైతులను శత్రువుల్లా చూసి, వారిని అడ్డుకోవడానికి అడుగడుగునా సిమెంటు బారికేడ్లు, ఇనుప ముళ్ల కంచెలు పెట్టింది. చావో రేవో తేల్చుకుంటామని, కనీస మద్దతు ధర చట్టం తెచ్చేవరకు పోరాటం సాగిస్తామంటూ రైతులు ఈ బారికేడ్లను, కంచెలను తోసుకుని ముందుకు వెళ్లేందుకు యత్నించగా హర్యానా పోలీసులు రబ్బర్ బులెట్లు, టియర్‌గ్యాస్ ఫిరంగులతో తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. హర్యానా పోలీసుల రబ్బర్ బులెట్ తలకు తగలడంతో పంజాబ్‌లోని భటిండా జిల్లా బాలోక్ గ్రామానికి చెందిన యువ రైతు శుభ కరణ్ సింగ్ చనిపోయాడు. రబ్బర్ బులెట్లతో తీవ్రంగా గాయపడిన రైతులను ఆసుపత్రికి తరలించారు హర్యానా- పంజాబ్ సరిహద్దుల్లోని ఖనౌరి వద్ద ఈ ఘాతుకం జరిగింది. హర్యానా ప్రభుత్వ దాష్టీకానికి ఇంతకు ముందు ఇద్దరు రైతులు గుండె ఆగి చనిపోయారు.

ఈనెల 18నకేంద్ర మంత్రులతో జరిపిన చర్చలు విఫలం కావడంతో రైతులు బుధవారం చలో ఢిల్లీ కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించారు. హర్యానా-పంజాబ్ సరిహద్దులు శంభు, ఖానౌరీ నుంచి ఢిల్లీ



శంభు సరిహద్దులో రైతులపై బాష్పవాయువులతో విరుచుకుపడిన పోలీసులు (ఇన్‌సెట్‌లో) శుభకరణ్ సింగ్

వైపుగా కదంతొక్కారు. దారికి అడ్డంగా ఉన్న బారికేడ్లను, ఇనుప చువ్వలను, కాంక్రీటు గోడలను తొలగించేందుకు రైతులు హైడ్రాలిక్ క్రేజలు, జెసిబిలు, ప్రొక్లెయినర్స్‌తో పక్కకు తొలగించి ముందుకు సాగారు. ఈ క్రమంలో రైతులను అడ్డుకునేందుకు పోలీసులు యత్నించడంతో పోలీసులు దాడి చేసి ఓ రైతు నిండు ప్రాణాన్ని బలిగొన్నారు. రైతులపై హర్యానా ప్రభుత్వ దాష్టీకాన్ని ఆలిండియా కిసాన్ సభ (ఎఐకెఎస్), సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) తీవ్రంగా ఖండించాయి. రైతుల పట్ల మోడీ ప్రభుత్వ దుర్మార్గానికి ఇదొక నిదర్శనమని వ్యాఖ్యానించాయి. పంజాబ్ నుంచి ఢిల్లీ వైపు వెళ్తున్న రైతులను శత్రు సైనికుల్లా చూడడం హర్యానాలో బిజెపి ప్రభుత్వానికే చెల్లిందని అవి ఘాటుగా విమర్శించాయి. యువ రైతు మరణానికి అవి సంతాపం తెలిపాయి.

జెసిబి, ప్రొక్లెయినర్స్ యజమానులకు బెదిరింపులు

రైతులకు అద్దెకిచ్చిన జెసిబి, ప్రొక్లెయినర్స్ యజమానులపై హర్యానా పోలీసులు బెదిరింపులకు దిగారు. రైతుల వద్ద నుంచి జెసిబి, ప్రొక్లెయినర్స్ వెనక్కి తీసుకోవాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆందోళన ప్రదేశాల నుంచి తమ జెసిబిలు, ప్రొక్లెయినర్స్, మిగతా 7లో



న్యాయ కోవిదుడు ఫాలి నారిమన్ కన్నుమూత

- ప్రధాని,సిజెఐ, ఇతర ప్రముఖుల సంతాపం

న్యూఢిల్లీ : సుప్రసిద్ధ న్యాయ కోవిదుడు, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఫాలి శామ్ నారిమన్ బుధవారం న్యూఢిల్లీలో కన్నుమూశారు. ఆయన వయసు 95 సంవత్సరాలు. 1991లో పద్మభూషణ్, 2007లో పద్మ విభూషణ్ పురస్కారాలు అందుకున్న నారిమన్ 70 సంవత్సరాలకు పైగా న్యాయవాద వృత్తిలో కొనసాగారు. 1950లో బాంబే హైకోర్టులో న్యాయవాదిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన నారిమన్ 1961 నాటికి సీనియర్ న్యాయవాది హోదా పొందారు. 1972లో ఆయన భారత అదనపు సొలిసిటర్ జనరల్‌గా నియమితులయ్యారు. అయితే అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో అత్యవసర పరిస్థితి విధించడాన్ని వ్యతిరేకిస్తూ 1975లో పదవికి రాజీనామా చేశారు.

1999లో రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ అయిన నారిమన్ 2005 వరకూ ఆ పదవిలో కొనసాగారు. 1991 నుంచి 2010 వరకూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వర్తించారు. 1989 నుంచి 2005 వరకూ పారిస్‌లోని ఇంటర్నేషనల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కోర్టుకు వైస్ ఛైర్‌పర్సన్‌గా పనిచేశారు. నారిమన్ అనేక న్యాయ శాస్త్ర గ్రంథాలు రచించారు. గాడ్ సేవ్ ది ఆనరబుల్ సుప్రీంకోర్టు, బిఫోర్ మెమరీ మిగతా 7లో

ఎస్‌జిటి పోస్టులకు బిఇడి అభ్యర్థులు అనర్హులు

- ప్రభుత్వ నిబంధనలకు హైకోర్టు స్టే
- టెట్ నిర్వహణకు అడ్డంకి కాదని వెల్లడి



ప్రజాశక్తి-అమరావతి

స్పెషల్ గ్రేడ్ టీచర్ల (ఎస్‌జిటి) పోస్టుల భర్తీకి బిఇడి అభ్యర్థులు అనర్హులని హైకోర్టు పేర్కొంది. బిఇడి చేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం వీలు కల్పించడాన్ని తప్పుపట్టింది. ప్రభుత్వ నిబంధనల అమలును నిలిపేస్తూ స్టే విధించింది. ఉపాధ్యాయుల అర్హత పరీక్ష (టెట్) నిర్వహణ కోసం ప్రభుత్వం జారీ చేసిన జిఓ 4కు అనుగుణంగా ఎంపిక ప్రక్రియ కొనసాగించవచ్చునని చెప్పింది. ప్రతివాదులైన పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనరు, జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్‌సిటిఇ) సభ్య కార్యదర్శి కౌంటర్లు దాఖలు చేయాలంది. విచారణను ఏప్రిల్ 29కి వాయిదా వేసింది. చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం మధ్యంతర స్టే విధించింది.తొలుత ప్రభుత్వం తరపున ఎజి ఎస్ శ్రీరామ్ వాదిస్తూ.. బిఇడి అభ్యర్థులకు అనుమతినివ్వడంపై ప్రభుత్వం పునరాలోచన చేస్తోందని, ఈ వ్యవహారంపై స్టే ఇస్తే అభ్యంతరం లేదని చెప్పారు. ఎస్‌జిటి పోస్టుల భర్తీ నిమిత్తం ఈ నెల 12న జారీ చేసిన జిఓ 11లో ఎస్‌జిటి పోస్టులకు బిఇడి అభ్యర్థులను కూడా అర్హులుగా పేర్కొన్న నిబంధన 5(2) వరకు మాత్రమే స్టే విధించవచ్చునని చెప్పారు. పిటిషనర్లు సుప్రీంకోర్టు ఉత్తర్వులకు విరుద్ధమని చెబుతున్న ఆ పార్టు వరకు స్టే ఇవ్వొచ్చునని చెప్పారు. వాదనల తర్వాత హైకోర్టు.. స్టే ఉత్తర్వుల వల్ల డిఎస్‌సి నిర్వహణ యథాతథంగా కొనసాగించవచ్చునని చెప్పింది. స్టే అడ్డంకి కాబోదని తెలిపింది.

డిఎస్‌సి దరఖాస్తు గడువు పొడిగింపు

డిఎస్‌సి-2024 ఫీజు, దరఖాస్తు తేదీల గడువును పాఠశాల విద్యాశాఖ పొడిగించింది. బుధవారంతో ముగిసిన ఫీజు గడువును, గురువారంతో ముగుస్తున్న దరఖాస్తు గడువును ఈ నెల 25వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు పొడిగిస్తున్నట్లు కమిషనరు ఎస్ సురేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థుల సౌకర్యార్థం హెల్ప్‌డెస్క్ సమయాలను ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పొడిగించినట్లు వెల్లడించారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వారి దరఖాస్తుల్లో తప్పులుంటే సవరించుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థి పేరు, సెలెక్ట్ చేసుకున్న పోస్ట్, జిల్లా మినహా మిగిలిన అంశాల్లో మార్పులు చేసుకోవచ్చునని తెలిపారు. అభ్యర్థి పేరులో తప్పులుంటే పరీక్షా కేంద్రంలో నామినల్ రోల్స్‌పై సంతకం చేసే సమయంలో సరిచేసుకోవచ్చునని వెల్లడించారు. ఫీజు చెల్లించి జనరల్ నెంబర్ రాని వారికి ఐదు రోజుల్లో అభ్యర్థి నగదును వారి బ్యాంకు ఖాతాలకు జమచేస్తామని పేర్కొన్నారు. కేంద్ర టెట్ మార్కులు కాకుండా ఎపి టెట్ అర్హత కలిగిన అభ్యర్థులు వారి హాల్ టిక్కెట్ నెంబర్లను నమోదు చేస్తే సరిపోతుందని వివరించారు. ఇప్పటి వరకు టెట్‌కు 3,17,950 మంది, డిఎస్‌సికి 3,19,176 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు.

ఇసుక అక్రమ తవ్వకాలు నిజమే

- ఎన్‌జిటికి పర్యావరణ మంత్రిత్వశాఖ నివేదిక
- సుప్రీంలో నివేదించాలని ఆదేశం



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో


రాష్ట్రంలో పెద్దఎత్తున ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్న విషయం నిజమేనని కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ పేర్కొంది. ఈ మేరకు రూపొందించిన నివేదికను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి)కు అందచేసింది. ఇదే అంశంపై సుప్రీంకోర్టులో కూడా విచారణ జరుగుతున్నందున నివేదికను అక్కడ కూడా సమర్పించాలని కేంద్ర మంత్రిత్వశాఖను ఎన్‌జిటి ఆదేశించింది. రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలపై ఎన్‌జిటి బుధవారం నిర్వహించిన విచారణ సందర్భంగా బుధవారం ఈ పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రంలో అక్రమ మైనింగ్‌పై ఎన్‌జిటిలో సామాజిక కార్యకర్త దండా నాగేంద్ర పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దానిమీద విచారణ జరిపిన ఎన్‌జిటి తవ్వకాలను ఆపేయాలని, తవ్వకాలకు సంబంధించి పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని పర్యావరణ అటవీమంత్రిత్వశాఖను గతంలో ఆదేశించింది. ఈ మేరకు ఏర్పాటైన అటవీ మంత్రిత్వ శాఖ కమిటీ ఇచ్చిన నివేదికలో రాష్ట్రంలో ఇసుక తవ్వకాలకు సంబంధించిన పలు అక్రమాలను వివరించింది. పర్యావరణ అనుమతులు లేకుండా రాష్ట్రంలో ఇంకా భారీగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు నివేదికలో కేంద్ర కమిటీ నిర్ధారించింది. ఫొటోలతో పాటు ఇతర సాక్ష్యాధారాలతో నివేదికను ఎన్‌జిటికి కేంద్ర కమిటీ అందజేసింది. గుంటూరు, కృష్ణా జిల్లాల్లో యంత్రాలతో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని పేర్కొంది. ఎలాంటి అనుమతులు లేకుండా 24 గంటలూ తవ్వకాలు చేపడుతున్నారని, ఒక్కో రీచ్‌లో రోజుకు రెండు వేల టన్నుల మేర తవ్వకాలు కొనసాగుతున్నాయని వెల్లడించింది. శాటిలైట్ చిత్రాల ద్వారా తవ్వకాల ఆధారాలు సేకరించామని వివరించింది. ఎలాంటి ఇసిలు లేకుండా తవ్వకాలు చేస్తున్నారని తెలిపింది. గతంలో ఎన్‌జిటి ఇచ్చిన ఆదేశాలు అమలు కావట్లేదని పేర్కొంది.కేంద్ర కమిటీ నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించాలని కేంద్ర పర్యావరణ అటవీశాఖకు ఎన్‌జిటి ఆదేశాలు జారీ చేసింది.ఈ అంశంలో కలెక్టర్ల నివేదిక, కేంద్ర మంత్రిత్వశాఖ నివేదిక పూర్తి భిన్నంగా ఉన్నాయని పేర్కొంది. సుప్రీంకోర్టులో ఈ కేసు విచారణ జరుగుతోందని, ఏం చేయాలనేది న్యాయస్థానమే తేలుస్తుందని స్పష్టం చేసింది. తాము కూడా నివేదికను సర్వోన్నత న్యాయస్థానానికి అందజేస్తామని తెలిపింది.

53.35 లక్షల చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు

- ఎమ్‌టి కృష్ణబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా 53,35,519 మంది 0-5 ఏళ్ల మధ్య వయసు గల చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసేందుకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు తెలిపారు. సచివాలయంలో బుధ వారం ఆయన అధ్యక్షతన పల్స్ పోలియో-2024పై స్టేట్ టాస్క్‌ఫోర్స్ సమావేశం జరిగింది. అంగన్‌వాడీ వర్కర్లు, గ్రామ సచివాలయాల వలంటీర్లతో ఎఎన్‌ఎమ్‌లు సమన్వయం చేసుకోవాలన్నారు. పల్స్ పోలియోపై అవగాహన కల్పించాలన్నారు. మార్చి 3న పోలియో చుక్కలు వేయించుకోలేకపోయిన పిల్లల వివరాల్ని తీసుకుని మార్చి 4న ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయాలని సూచించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనరు జె నివాస్, సెకండరీ హెల్త్ డైరెక్టరు వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



నీలం నోట్‌బుక్ ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

స్వీయ అధ్యయనాన్ని పెంచుకోవాలి

- రెడ్‌బుక్స్ డేలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు
- నీలం నోట్‌బుక్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కమ్యూనిస్టులకు స్వీయ అధ్యయనం ప్రధాన ఎజెండాగా ఉండాలని, వర్గ పోరాటం ద్వారా సమాజాన్ని మార్చాలనే భావనను ప్రజల్లోకి తీసుకెళ్లాలంటే అధ్యయనం అవసరమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. ఫిబ్రవరి 21 రెడ్‌బుక్స్ డే సందర్భంగా బాలోత్సవ భవన్లో జరిగిన కార్యక్రమంలో లెనిన్ పెట్రోగ్రాడ్‌లో జరిపిన అజ్ఞాత జీవితానికి సంబంధించిన రచన 'నీలం నోట్‌బుక్'ను శ్రీనివాసరావు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి రమాదేవి, కె ప్రభాకరరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. సోవియట్ రచయిత కజకెవిచ్ చేసిన ఈ రచనను నిడమర్తి ఉమారాజేశ్వరరావు తెలుగులోకి అనువదించారు. ఆవిష్కరణ అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. 1848 ఫిబ్రవరి 21వ తేదీన వచ్చిన కమ్యూనిస్టు ప్రణాళిక ప్రపంచాన్ని కుదిపేసిందని, దాన్ని చారిత్రాత్మక దినంగా భావించి నాలుగేళ్లుగా ప్రపంచ వ్యాప్తంగా రెడ్‌బుక్స్‌డే నిర్వహిస్తున్నామని తెలిపారు. కమ్యూనిస్టులు అధ్యయనాన్ని అలవర్చుకోవాలని, ప్రతికూలతలను అనుకూలతలుగా మార్చుకోవడంలో అధ్యయనం కీలకంగా ఉంటుందని, అలా మార్చుకోగలిగిన వారే కమ్యూనిస్టులని పేర్కొన్నారు. కమ్యూనిస్టు ఉద్యమం ప్రతికూలతను ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో కార్యకర్తలను, ఉద్యమాలను బలోపేతం చేసుకోవడానికి అధ్యయనం ఆయుధంగా ఉంటుందని వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు, విప్లవ సాహిత్యానికి ఇప్పుడు ప్రశస్తి పెరిగిందని మిగతా 2లో

డిఒపిగా సుదర్శన్‌రెడ్డి నియామకం చెల్లదు


- హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ (డిఒపి)గా జె సుదర్శన్‌రెడ్డి నియామకం చెల్లదని హైకోర్టు తీర్పు చెప్పింది. ఆయన నియామకం చట్ట నిబంధనలకు విరుద్ధమని వెల్లడించింది. ప్రాసిక్యూషన్స్ నుంచి వచ్చిన వ్యక్తినే డిఒపిగా నియమించాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నట్లు తెలిపింది. హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను సంప్రదించి 4 మాసాల్లో కొత్త డిఒపిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ జస్టిస్ రవినాథ్ తిల్హరీ, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం తీర్పు చెప్పింది. డిఒపిగా సుదర్శన్‌రెడ్డిని నియమిస్తూ 2023 మే 22న వెలువరించిన జిఓ 522ను రద్దు చేయాలంటూ అదనపు డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బి రామకోటేశ్వరరావు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు తీర్పు చెప్పింది. ప్రభుత్వ వాదనను తోసిపుచ్చింది.

భారత్‌లో 250 ఉద్యోగులపై నోకియా వేటు 3

సబ్సిడీ దాణా నిలిపివేత



గడ్డి మేస్తున్న పశువులు

- పాడి రైతులకు ప్రభుత్వం ఝలక్
- బహిరంగ మార్కెట్లో అధిక ధరకు కొనుగోలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

పాడి రైతులకు సబ్సిడీపై ఇస్తున్న దాణాను గత ఆరు నెలలుగా ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో, బహిరంగ మార్కెట్లో అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. పాడి సంపద వృద్ధి, రైతులకు భారం తగ్గించేందుకు ప్రభుత్వం ఏటా సమీకృత మిశ్రమ రేషన్ (టిఎంఆర్) పేరుతో పాడి పశువుల పెంపకందార్లకు సబ్సిడీపై దాణాను అందిస్తూ వచ్చేది. డెయిరీ నిర్వహిస్తున్న రైతులతోపాటు సాధారణ రైతులకు 25, 50 కేజీల బ్యాగుల్లో పంపిణీ చేసేది. ఒక్కో బాగులో పచ్చగడ్డి, ఎండుగడ్డి, మొలాసిస్, సాల్ట్, మినరల్ మిశ్రమం, వేరుశనగ చెక్క, పత్తి చెక్క, మినరల్ సప్లిమెంట్ తదితర పదార్థాలు ఉండేవి. కేజీ రూ.16 కాగా, 60 శాతం రాయితీతో రూ.6.40కి అందించేది. ఈ రకమైన దాణా మార్కెట్లో ఎక్కడా దొరక్కపోవడం, ఈ దాణాతో పాల దిగుబడి బాగా ఉండడంతో రైతుల్లో దీనికి మంచి డిమాండ్ ఉంది. అయితే, జిల్లాకు లక్ష్యాలను నిర్దేశించినా ఆ మేరకు సరఫరా చేసేది కాదు. రైతులకు 200 కేజీల వరకే సబ్సిడీని పరిమితం చేసింది. శ్రీకాకుళం జిల్లాలో 4.56 లక్షల ఆవులు, 40 వేలకుపైగా గేదెలు ఉన్నాయి. వీటికి మేత కోసం సుమారు 2,500 మెట్రిక్ టన్నులకుపైగా పశువుల దాణా అవసరం. ప్రభుత్వం 1,200 మెట్రిక్ టన్నులు మాత్రమే అందించాలని లక్ష్యంగా నిర్ణయించింది. 1,080 టన్నులను సరఫరా చేసి 2023 ఆగస్టు తర్వాత నుంచి సబ్సిడీ దాణాను నిలిపివేసింది. దీంతో పాడి రైతులపై భారం పడుతోంది.

బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు కొనుగోలు

దాణా సరఫరాను ప్రభుత్వం ఆపేయడంతో గత్యంతరం లేక రైతులు బహిరంగ మార్కెట్‌లో మేత కొనుగోలు చేస్తున్నారు. డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని వ్యాపారులు ధరలను పెంచేశారు. పశువుల మేతగా వినియోగిస్తున్న గోధుమ పొట్టు 50 కేజీల బస్తాను ప్రస్తుతం రూ.1,300కు అమ్ముతున్నారు. ఏడాది కిందట ఇది రూ.1,050 ఉంది. పాలిష్ తవుడు కేజీ రూ.28 ఉండగా, గతంలో రూ.25కు అమ్మేవారు. బఠానీ పొట్టు 45 కేజీల బస్తా గతంలో రూ.వెయ్యి ఉండగా, ప్రస్తుతం రూ.1150కు అమ్ముతున్నారు. ఆగస్టు వరకు 60 శాతం సబ్సిడీతో దొరకే దాణా ఇప్పుడు 120 శాతం, అంతకంటే ఎక్కువ ధరకు కొనుక్కోవాల్సి వస్తోంది. పోషక విలువల విషయంలోనూ అవి సమానం కాదు.

కరువు కాలంలో పాడి రైతులకు కష్టం

వరి కోతలను యంత్రాలతో చేపట్టడంతో గడ్డికి కొరత ఉంది. దీంతోపాటు ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా కరువు పరిస్థితులు నెలకొనడంతో లక్షలాది ఎకరాల్లో వరి సాగు చేయలేకపోయారు. పచ్చిగడ్డి కూడా పెద్దగా దొరకడం లేదు. ఈ సమయంలో సబ్సిడీపై దాణాను అందించాల్సిన ప్రభుత్వం ఆపేయడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.



వైసిపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మహిళా సంఘాల నాయకులు

మేనిఫెస్టోల్లో మహిళా సాధికారతను అజెండాగా చేర్చండి

- రాజకీయ పక్షాలకు మహిళా సంఘాల ఐక్యవేదిక వినతులు

లోపలి పేజీలో..

'సెకీ' ఒప్పందంపై బహిరంగ విచారణ జరపండి

- ఎపిఇఆర్‌సికి సిపిఎం లేఖ

వైసిపికి 'వేమిరెడ్డి' రాజీనామా

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

ఎన్నికలు సమీపిస్తున్న వేళ వైసిపికి నెల్లూరు జిల్లాలో మరో ఎదురుదెబ్బ తాకింది. రాజ్యసభ సభ్యులు, వైసిపి నెల్లూరు జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేశారు. రాజ్యసభ సభ్యత్వానికి కూడా రాజీనామా లేఖ పంపారు. టిటిడి బోర్డు సభ్యులుగా ఉన్న ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతి కూడా ఆ పదవితో పాటు వైసిపికి రాజీనామా చేశారు. బుధవారం మధ్యాహ్నం నెల్లూరులోని తన నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని ఆయన ప్రకటించారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వం, జిల్లా అధ్యక్షత పదవి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి లేఖను పంపినట్లు తెలిపారు. 'వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు ' ఆయన లేఖలో పేర్కొన్నారు. వైసిపి తరపున నెల్లూరు ఎంపి పదవికి పోటీ చేస్తున్నట్లు కూడా గతంలో ఆయన ప్రకటించారు. అనంతరం చోటుచేసుకున్న పరిణామాలతో ఆయన తాజా నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. జిల్లా అధ్యక్షుడిగా ఉన్నప్పటికీ అసెంబ్లీ స్థానాల అభ్యర్థుల విషయంలో ఆయన అభిప్రాయాన్ని వైసిపి అధిష్టానం తీసుకోలేదని సమాచారం. ఇటీవల నెల్లూరు నగర సమన్వయ కర్తగా ఎండి ఖలీల్‌ను నియమించారు. దీనికి సంబంధించి కనీస సమాచారం కూడా



వేమిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

ఇవ్వలేదని చెబుతున్నారు. దీంతో వేమిరెడ్డి తీవ్ర మనస్తాపానికి గురయ్యారని, అప్పటి నుండి పార్టీ కార్యక్రమాలకు కూడా దూరంగా ఉంటున్నారని ఆయన అనుచరులు చెబుతున్నారు. వైసిపికి రాజీనామా చేసిన వెంటనే టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆయనను టిడిపిలోకి ఆహ్వానించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కూడా వేమిరెడ్డి ఇంటికి వెళ్లి స్వాగతించారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి మాగుంట లేవుట్‌లోని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నివాసానికి ఉదయగిరి, ఆత్మకూరు, నెల్లూరు రూరల్, నగరం, సర్వేపల్లి, కోవూరుతోపాటు ఉమ్మడి నెల్లూరు జిల్లా నుంచి పెద్దఎత్తున వేమిరెడ్డి నివాసానికి అభిమానులు, టిడిపి నేతలు, కార్యకర్తలు తరలివచ్చారు. త్వరలో టిడిపి అధినేత చంద్రబాబు సమక్షంలో ఆ పార్టీలో చేరనున్నట్లు సమాచారం.

ప్యాపిలి ఎస్ఐ మృతి

- ఆయన అల్లుడు, డ్రైవర్ కూడా
- అదుపుతప్పి చెట్టుకు ఢీకొన్న కారు

ప్రజాశక్తి -ప్యాపిలి (నంద్యాల)


వెంకటరమణ(ఫైల్)

మహబూబ్ నగర్ జిల్లా భూత్పూర్ మండలం అన్నా సాగర్ వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో నంద్యాల జిల్లా ప్యాపిలి ఎస్ఐ, ఆయన అల్లుడు, డ్రైవర్ మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం.... అనంతపురం జిల్లా కేంద్రానికి చెందిన వెంకటరమణ (57) ప్యాపిలి మండలం రాచర్ల పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. తన కుమార్తె అనూషకు మచిలీపట్నంకు చెందిన పవన్‌సాయి (25)తో ఈ నెల 15న వివాహం చేశారు. హైదరాబాద్‌లో ఇంటిగృహ ప్రవేశానికి ఎస్ఐ, తన కుమార్తె, అల్లుడు మంగళవారం కారులో బయలుదేరారు. బుధవారం వారంతా అనంతపురానికి తిరుగు ప్రయాణమయ్యారు. హైదరాబాదు నుంచి అనంతపురం వస్తుండగా మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం అన్నా సాగర్ వద్ద జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి చెట్టును ఢీకొన్నది. ఎస్ఐతో సహా అల్లుడు, డ్రైవర్ చంద్ర (23) అక్కడికక్కడే మృతి చెందారు. అనూషకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను మహబూబ్ నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వలంటీర్ వేధింపులతో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా/నరసరావుపేట

వలంటీర్ వేధింపులు తాళలేక విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన పల్నాడు జిల్లా నరసరావుపేట మండలంలో బుధవారం వెలుగు చూసింది. పోలీసుల వివరాల మేరకు.. పాలపాడు గ్రామానికి చెందిన వలంటీర్ శ్రీకాంత్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన అక్కాచెల్లెళ్లను కొన్ని నెలలుగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. తల్లిదండ్రులకు విషయం తెలియడంతో వలంటీర్ నిలదీశారు. ఈ విషయమై ఇరు కుటుంబాల్లో వివాదాలు నడుస్తున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన చెల్లెళ్లు మంగళవారం రాత్రి ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబీకులు ఆమెను ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు నరసరావుపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. వలంటీర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అయితే బాధిత బాలికకు పాఠశాలలో మరో విద్యార్థితో వివాదం తలెత్తగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మందలించడంతో ఆత్మహత్యాయత్నం చేసిందనే వాదనలు వినిపిస్తున్నాయి.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

చంద్రబాబుకు రెస్ట్ ఇవ్వాలి

- వైసిపి అధికార ప్రతినిధి నారమల్లి పద్మజ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు రెస్ట్ తీసుకోవాల్సిన సమయం వచ్చిందని ఆయన భార్య భువనమ్మే చెబుతోందని చంద్రబాబు రాజకీయాలకు పనికిరాడని ఇంతకంటే నిదర్శనం ఏమి కావాలని వైసిపి అధికార ప్రతినిధి, ప్రభుత్వ సలహాదారు నారమల్లి పద్మజ అన్నారు. బుదవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 2019 మ్యానిఫెస్టోలో జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన ప్రతీ వాగ్దానాన్నీ అమలు చేసి చూపించామని మా పాలనే సాక్ష్యంగా 2024 ఎన్నికల్లో ప్రజల ముందుకెళ్ళి ఓట్లు అడుగుతామని అన్నారు. చంద్రబాబునాయుడికి పూర్తి స్థాయి విశ్రాంతి అవసరమని హైదరాబాద్‌లోని ఎఐజి హాస్పిటల్ కూడా నివేదిక ఇచ్చిందని అన్నారు.

చంద్రబాబును ప్రజలు నమ్మరు - జూపూడి ప్రభాకర్

అధికారంలో వున్నప్పుడు పేదలు గురించి ఏమాత్రం పట్టించుకోని చంద్రబాబునాయుడును రాష్ట్రంలోని ప్రజలు ఎవరూ నమ్మే పరిస్థితి లేదని రాష్ట్ర ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్‌రావు తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేద ప్రజలకు లక్షల కోట్ల రూపాయలను నేరుగా వాళ్లఖాతాల్లోకి వేసిందని తెలిపారు. సంక్షేమపథకాలు తీసుకున్న ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డి వెంట వున్నారనే రాష్ట్రంలోని ప్రతిపక్షాలన్నీ కుట్రపూరితంగా ఒక్కటవుతున్న అంశాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు.

మేనిఫెస్టోల్లో

మహిళా సాధికారతను అజెండాగా చేర్చండి

- రాజకీయ పక్షాలకు మహిళా సంఘాల ఐక్యవేదిక వినతులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


వి.శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న మహిళా సంఘాల ఐక్యవేదిక నాయకులు

మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతూ నిజమైన మహిళా సాధికారత సాధించేలా రాజకీయ పార్టీలన్నీ ఎన్నికల మేనిఫెస్టోల్లో అజెండాగా చేర్చాలని మహిళా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి, మహిళా కాంగ్రెస్ నుంచి సుంకర పద్మశ్రీ, ఎన్ఎఫ్ఐడబ్ల్యు నాయకులు పి దుర్గాభవాని, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ, పిఒడబ్ల్యు నాయకులు పి పద్మ, లీగల్ సెల్ కన్వీనర్ అరుణ, మహిళా సమాఖ్య నాయకులు వనజ, దుర్గాంబ, మహిళా సంఘం నాయకులు విమల దుర్గా, ఖైతా సల్మా, కృషద్ బేగం తదితరులు బుధవారం రాష్ట్రంలోని సిపిఎం, సిపిఐ, వైసిపి, తెలుగుదేశం, కాంగ్రెస్, జైభారత్ పార్టీల నేతలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్రంలో మహిళలకు పూర్తిగా రక్షణ కరువైందని, మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా నియంత్రించాల్సిన అవసరం వుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఈ సందర్భంగా మహిళా సంఘాల ఐక్యవేదిక నాయకులతో అన్నారు. కేంద్రంలో వున్న బిజెపి ప్రభుత్వం మనువాదాన్ని ప్రోత్సహిస్తోందని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా మద్దతు ఇస్తోందని విమర్శించారు. డ్వాక్రా సమస్యలను కూడా పట్టించుకోవడం లేదని, రానున్న ఎన్నికలకు మహిళల సమస్యలను ప్రధాన అజెండాగా చేరుస్తామని శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. 2024 ఎన్నికలకు సంపూర్ణ మద్య నిషేధంతో పోతామని చెప్పిన ప్రభుత్వం అటువైపుగా కనీసం ఆలోచించకుండా మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల సమస్యలను తమ పార్టీ మేనిఫెస్టోలో చేరుస్తామని వారికి హామీ ఇచ్చారు. మహిళా సంఘాల ఐక్యవేదిక రూపొందించిన డిమాండ్లను పరిశీలించి తమ మేనిఫెస్టోలో చేరుస్తామని ఈ సందర్భంగా వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి హామీ ఇచ్చారు. సిడబ్ల్యుసి సభ్యులు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్ మేనిఫెస్టోలో మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. మద్యపాన నిషేధం, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు వంటి అంశాలను పెడతామని అన్నారు. డ్రగ్స్‌లేని ఆంధ్రప్రదేశ్ అజెండాగా తమ మేనిఫెస్టో వుంటుందని జై భారత్ పార్టీ నాయకులు జెడి లక్ష్మీనారాయణ తెలిపారు. అలాగే టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు మాల్యాద్రికి వినతిని అందజేశారు.


విజయవాడలోని 'ఆంధ్రరత్న' భవన్‌లో నిద్రిస్తున్న షర్మిల

ఆంధ్రరత్న భవన్‌లో షర్మిల బస

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మెగా డిఎస్‌సి ప్రకటించాలంటూ పిసిసి ఆధ్వర్యాన గురువారం 'చలో సెక్రటేరియట్' నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం రాత్రి నుంచే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులను పోలీసులు హౌస్ అరెస్టులు చేశారు. ఈ నేపథ్యంలో పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిలను మాజీ రాజ్యసభ సభ్యులు కెవిపి రామచంద్రరావు నివాసంలో పోలీసులు అరెస్టు చేయాలని చూశారు. ముందస్తు అరెస్టుల నేపథ్యంలో షర్మిల విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయమైన 'ఆంధ్రరత్న భవన్'కు చేరుకొని బుధవారం రాత్రి అక్కడే నిద్రించారు. గురువారం ఉదయం 10 గంటలకు చలో సెక్రటేరియట్‌కు పార్టీ శ్రేణులతో కలిసి షర్మిల బయలుదేరనున్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులను ముందస్తుగా హౌస్ అరెస్టులు చేయడాన్ని పిసిసి తప్పుపట్టింది.

వైద్య విద్యలో కృత్రిమ మేధ

- బాలికల్లో రక్తహీనత నివారణకు చర్యలు
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైద్య విద్యలో కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ) సాంకేతికతను ప్రవేశపెట్టేందుకు అవసరమైన ప్రాథమిక కసరత్తు చేపట్టాలని వైద్యారోగ్యశాఖ అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. ఇందుకు సంబంధించిన నివేదికను త్వరితగతిన సిద్ధం చేయాలని ఆదేశించారు. సచివాలయంలో బుధవారం వైద్యారోగ్యశాఖ అధికారులతో సిఎస్ సమీక్ష నిర్వహించారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌పై తీసుకుంటున్న చర్యలు, ఆరోగ్యశ్రీ వైద్యసేవల నిర్వహణ, ఆరోగ్యశ్రీపై అవగాహన కార్యక్రమాలు, దీర్ఘకాలిక రోగులకు మందుల పంపిణీ, వైద్య విద్యలో కృత్రిమ మేధ సాంకేతికతను ప్రవేశపెట్టడం వంటి అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిచ్చి రూ.వేలకోట్ల ఖర్చుతో మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. రోబోట్ అసిస్టెంట్ సర్జరీలు, డ్రగ్ డోసేజ్ అండ్ డెలివరీ, ఎపిడమిక్ ప్రిడక్షన్ అండ్ ప్రివెన్షన్, రేర్ డిసీజ్ ఐడెంటిఫికేషన్, ఏరియా ఆఫ్ స్పెసిఫిక్ డిసీజ్ ప్యాటర్న్ ఏజ్ స్పెసిఫిక్ ప్యాటర్న్ వంటి అంశాల్లో కృత్రిమ మేధ ఎంతో దోహదపడుతుందన్నారు. ఇప్పటికే దేశంలోని ప్రముఖ వైద్య సంస్థల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ విధానాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని సిఎస్ వెల్లడించారు. ఇహెచ్ఎస్ ద్వారా మరిన్ని ప్రయోజనాలు కల్పించేందుకు తీసుకున్న చర్యలపై జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు తెలపాలని అధికారులను ఆదేశించారు. బాలికల్లో రక్తహీనతను నివారించేందుకు వీలుగా వైద్యారోగ్య, స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులు అందుకు సంబంధించిన డేటా బేస్‌ను సిద్ధం చేయాలని పేర్కొన్నారు.

ఇహెచ్ఎస్ అమలుకు సంబంధించి తీసుకున్న చర్యలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు వివరించారు. ఉద్యోగుల మెడికల్ రీ ఎంబర్స్‌మెంట్ పథకం గడువు మార్చి నెలాఖరుతో పూర్తవుతుందన్నారు. ఈ గడువును మరో ఏడాది కాలానికి పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇహెచ్ఎస్ లబ్ధిదారులకు డిస్పెన్సరీ విధానం కల్పించాలని ఉద్యోగ సంఘాలు కోరడంతో చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో వైద్యారోగ్యశాఖ కమిషనరు జె నివాస్, ఎపిఎంఎస్ఐడిసి ఎమ్‌డి మురళీధర్‌రెడ్డి, సెకండరీ హెల్త్ డైరెక్టరు ఎస్ వెంకటేశ్వరన్, డిఎంఇ నరసింహం, ఆరోగ్యశ్రీ సిఇఒ బాలాజీ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి ఎన్ గుల్జార్ పాల్గొన్నారు.

ప్రపంచ దేశాలతో విశ్వమిత్ర పాత్ర

- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)



మిలాన్ వేడుకల్లో మాట్లాడుతున్న కేంద్ర హోం శాఖ మంత్రి రాజనాథ్‌సింగ్

ప్రపంచ దేశాలతో భారతదేశం విశ్వమిత్ర పాత్రను కొనసాగిస్తోందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మల్టీలేటరల్ నేవల్ ఎక్సర్‌సైజ్ (మిలాన్)-2024 12వ ఎడిషన్‌లో భాగంగా మూడవ రోజైన బుధవారం తూర్పు నావికాదళ కమాండ్ సాముద్రిక ఆడిటోరియంలో మిలాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా రాజ్‌నాథ్ సింగ్ హాజరై వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన వివిధ దేశాల నుంచి హాజరైన ప్రతినిధులను ఉద్దేశించే మాట్లాడుతూ.. విశాఖలో ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఇక్కడ పాల్గొన్న భాగస్వామ్య దేశాలు శాంతి, శ్రేయస్సు కోసం సహకరించాలని కోరారు. సానుకూల శాంతి భావన ప్రత్యక్ష సైనిక పోరాటాన్ని మించినదని, భద్రత, న్యాయం, సహకారం వంటి భావ నలను కలిగి ఉంటుందని చెప్పారు. సాయుధ బలగాలు ఎల్లప్పుడూ ద్వంద్వ పాత్ర పోషిస్తాయని, అవి యుద్ధాలు నిర్వహించడంతో పాటు శాంతి భద్రతలను కాపాడతాయని తెలిపారు. మిలాన్-2024 జాతీయతతో సంబంధం లేకుండా అన్ని షిప్పింగ్, సరిహద్దు భద్రతను, స్నేహభావాన్ని పెంచుకునేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. నేవల్ స్టాఫ్ చీఫ్ అడ్మిరల్ ఆర్.హరికుమార్ మాట్లాడుతూ.. ఈ నెల 24న భారతీయ, విదేశీ యుద్ధనౌకలు సంయుక్తంగా నైపుణ్యాలను మెరుగుపరిచే కార్యాచరణలో పాల్గొంటాయని తెలిపారు. మరో రెండు రోజుల్లో జరిగే ఇంటర్నేషనల్ మారిటైమ్ సెమినార్ కీలకమైనదని, సముద్రంలో సవాళ్లు, అవకాశాలపై ఆలోచనలను మార్పిడి చేసుకోవడానికి సీనియర్ కమాండర్లకు వేదిక అవుతుందని పేర్కొన్నారు. అనంతరం నిషార్ కమ్యూనికేషన్ టెర్మినల్‌ను, తర్వాత ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సహకారంతో మారిటైమ్ టెక్నికల్ ఎక్స్‌పోజిషన్‌ను, మిలాన్ 2024 బహుపాక్షిక నావికాదళ వ్యాయామంలో పాల్గొనే దేశాల సంస్కృతి, సంప్రదాయం వంటకాలతో కూడిన మిలాన్ గ్రామాన్ని రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు. అనంతరం కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.

మీడియాపై దాడులకు ముఖ్యమంత్రే కారణం

- డిజిపికి చంద్రబాబు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మీడియాపై జరుగుతున్న దాడులకు ముఖ్యమంత్రే కారణమని, ఆయనపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డిజిపిని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు కోరారు. ఈ మేరకు డిజిపికి బుధవారం ఆయన లేఖ రాశారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలతో మీడియాపై సిఎం కారణమయ్యారని ఈ లేఖలో పేర్కొన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత మీడియా స్వేచ్ఛకు తీవ్ర విఘాతం కలుగుతోందని, దాడులు పెరిగిపోయాయని తెలిపారు. మీడియా సంస్థలు, జర్నలిస్టులు, ఫోటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్‌పై దాడులు నిత్యకృత్యమయ్యాయని వివరించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో కుట్రపూరితంగా వైసిపి రౌడీలు మీడియాపై దాడులను తీవ్రతరం చేశారని పేర్కొన్నారు. వారం రోజుల వ్యవధిలో నాలుగు దాడులు జరిగాయని ప్రస్తావించారు. అమరావతిలో న్యూస్‌టుడే కంట్రిబ్యూటర్ పరమేశ్వరరావు, రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణ, కర్నూలులో ఈనాడు కార్యాలయంపై, మద్దికెరలో ఆంధ్రజ్యోతి జర్నలిస్ట్ వీరశేఖర్‌పై దాడులు జరిగాయని వివరించారు. చొక్కా చేతులు మడతపెట్టండి అంటూ ముఖ్యమంత్రి హింసను ప్రేరేపించేలా వ్యాఖ్యలు చేయడమే రాష్ట్రంలో నేటి పరిస్థితికి కారణమని తెలిపారు.

రాష్ట్రం ఎటుపోతుందో ప్రజలు ఆలోచించాలి

ప్రతిపక్షాలు, మీడియాతో పాటు సామాన్య ప్రజలపైనా దాడులు నిత్యకృత్యమైన రాష్ట్రం ఎటుపోతుందో ప్రతి ఒక్కరూ ఆలోచించాలని చంద్రబాబు కోరారు. చిత్తూరులో వితంతు మహిళ కంటిచూపు కోల్పోయిన ఘటనపై చంద్రబాబు ఎక్స్(ట్విట్టర్)లో స్పందించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి జగన్ స్పందించాలని కోరారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

పత్రికా స్వేచ్ఛను హరిస్తున్న జగన్: యనమల

సిఎం జగన్ పత్రికా స్వేచ్ఛను హరించే ప్రయత్నం చేస్తున్నారని శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు విమర్శించారు. ప్రజాస్వామ్యంలో దాడులకు చోటులేదని, దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఒక ప్రకటనలో కోరారు. పత్రికలపై దాడులు చేయిస్తూ ప్రజాస్వామ్యాన్ని జగన్ చెరబట్టారని టిడిపి పొలిట్ బ్యూరోసభ్యులు వర్ల రామయ్య మరో ప్రకటనలో విమర్శించారు.

83 శాతం పోలింగ్ నమోదు లక్ష్యం

- సిఇఒ ముఖేష్‌కుమార్ మీనా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల్లో 83 శాతానికిపైగా పోలింగ్ నమోదు లక్ష్యంగా ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. ఈ కార్యక్రమాలను సమీక్షించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం 'స్వీప్' అధికారుల బృందం బుధవారం సిఇఒ ముఖేష్‌కుమార్ మీనాతో భేటీ అయ్యింది. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ.. 2019లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో సగటున 79.77 శాతం పోలింగ్ నమోదు కాగా, జాతీయ స్థాయిలో 69 శాతం పోలింగ్ నమోదైందన్నారు. రానున్న ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ భేటీలో స్వీప్ అధికారుల బృందం సభ్యులు సంతోష్‌కుమార్ (కార్యదర్శి), రాహుల్‌కుమార్, ఆర్‌కె సింగ్‌తోపాటు అదనపు సిఇఒ ఎమ్ఎన్ హరీందర్ ప్రసాద్ పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల ఓటర్లలో చైతన్యం

గిరిజన ప్రాంతాల్లోని ప్రజలు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల విద్యపై అవగాహన కల్పించాలని జిల్లా నోడల్ అధికారులను ఎంకె మీనా ఆదేశించారు. స్వీప్ నోడల్ అధికారుల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణాలు, అపార్ట్‌మెంట్లలో నివాసం ఉండేవారు, పలు కంపెనీల్లో పనిచేసే కార్మికులు, ఐటి ఉద్యోగులు, విద్యార్థులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆసక్తి చూపడం లేదని, వారికి ఓటర్ల విద్యపై అవగాహన కల్పించాలని సూచించారు. గతంలో పోలింగ్ శాతం తక్కువ నమోదైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి, వచ్చే ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

లక్షలాది జనాల నడుమ.. మేడారం గద్దెపై సారలమ్మ

హైదరాబాద్ బ్యూరో:మహా కుంభమేళాను తలపించిన మేడారం మహాజాతర ఉద్వేగభరితంగా ప్రారంభమైంది. ఆదివాసీల సంప్రదాయాలు, సంస్కృతి ప్రతిబింబించే డప్పు డోలు వాయిద్యాలతో బుధవారం మధ్యాహ్నం ప్రారంభమైన మేడారం జాతర.. సందర్శకులతో కోలాహలంగా, జనసంద్రంగా మారింది. మేడారంలో లక్షలాది మంది ఎదురు చూస్తుండగా వనదేవత సారలమ్మను వడ్డే కాక సారయ్య, ఇతర వడ్డెలు బుధవారం రాత్రి గద్దెలపై ప్రతిష్ఠించారు. ముందుగా మేడారం గ్రామానికి 3 కి.మీ దూరంలోని కన్నెపల్లిలో మధ్యాహ్నం నుండే సారలమ్మ దేవాలయం వద్ద మహిళలు ముగ్గులు వేసి అలంకరించారు. అనంతరం పూజారి కాక సారయ్య.. ఆదివాసీ ఆచార, వ్యవహారాలతో పూజలు చేయగా.. మంత్రి సీతక్క, ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు గుడి వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వడ్డెలు డోలు వాయిద్యాలు వాయిస్తూ, కొమ్ములూదుతూ ముందుకు కదలగా వడ్డే కాక సారయ్య సారలమ్మను తోడ్కొని బయలుదేరారు. జంపన్నవాగు మీదుగా లక్షలాది మంది ప్రజల నడుమ సారలమ్మ గద్దెలపై కొలువుతీరింది. మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అడిషనల్ కలెక్టర్ శ్రీజ పూజలు నిర్వహించారు.


మద్దతుగా రిలేదీక్షల్లో కూర్చొన్న చలసాని శ్రీనివాస్ తదితరులు

రాష్ట్రానికి మోడీ ప్రభుత్వం ద్రోహం : చలసాని

ప్రజాశకి - రాజమహేంద్రవరం

ఆంధ్రరాష్ట్రానికి మోడీ ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి నాయకులు చలసాని శ్రీనివాస్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద పీపుల్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ జస్టిస్, మానవ హక్కులకై పోరాడు సాధించు సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం మూడు రోజులుగా రిలే నిరాహార దీక్షలు జరుగుతున్నాయి. ఈ దీక్షా శిబిరాన్ని సిపిఎం నాయకులతో కలిసి చలసాని బుధవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన నిధులు, హక్కుల కోసం పార్టీలకతీతంగా యువత పోరాడాలని కోరారు. ఉన్నత చదువులు చదివిన యువత ఉద్యోగాలు దొరక్క రాష్ట్రం నుంచి వలసపోవాల్సి వస్తుందన్నారు. చంద్రబాబు, జగన్, పవన్ కల్యాణ్ రాష్ట్ర భవిష్యత్తును బిజెపికి తాకట్టు పెట్టారని విమర్శించారు. ఈ రిలే నిరాహార దీక్షలకే కాకుండా మొదటి నుంచి ఎపి రాష్ట్ర హక్కులు సాధించుకునేందుకు సహకరిస్తున్న వామపక్ష పార్టీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి టి అరుణ్, నాయకులు బి పవన్, రాజులోవ, డాక్టర్ చైతన్యశేఖర్, రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ టికె విశ్వేశ్వరరెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎన్ రాజా, ట్యాక్సీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు, ముస్లిం సంఘాల నాయకులు, విద్యార్థులు మద్దతు తెలిపారు.

'సెకీ' ఒప్పందంపై బహిరంగ విచారణ జరపండి

- ఎపిఇఆర్‌సికి సిపిఎం లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అదానీ సంస్థల ద్వారా సోలార్ విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై బహిరంగ విచారణ జరపాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఎపిఇఆర్‌సి)ని సిపిఎం కోరింది. ఈ మేరకు ఇఆర్‌సి కార్యదర్శికి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు బుధవారం లేఖ రాశారు. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ) ద్వారా రాజస్థాన్‌లోని అదానీ సంస్థల నుంచి 17వేల మిలియన్ యూనిట్ల(ఎంయు) సోలార్ విద్యుత్ కొనుగోలుకు అనుమతి కోరుతూ విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రతిపాదనలు పంపినట్లు లేఖలో పేర్కొన్నారు. ఈ దీర్ఘకాలిక ఒప్పందం వల్ల విద్యుత్ వినియోగదారులపై తీవ్రమైన ప్రభావం పడనుందని ఆందోళన వ్యక్తం చేశారు. అదానీ కంపెనీలతో ఒప్పందాలపై బహిరంగ విచారణ జరపాలని వివిధ బహిరంగ విచారణల్లో సిపిఎంతో పాటు పలు సంస్థలు, విద్యుత్ రంగ నిపుణులు కోరిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ ఒప్పందాల వల్ల విద్యుత్ వినియోగదారులపై భారాలు పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు ఈ దీర్ఘకాలిక ఒప్పంద ప్రతిపాదనలు ప్రజలకు, విద్యుత్ పంపిణీ సంస్థల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్నాయని వివరించారు. పారదర్శకత లేకుండా, వాస్తవాలు బహిర్గతం చేయకుండా ప్రభుత్వ ఆదేశాలతో ఇటువంటి ఒప్పందాలకు పూనుకోవడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని బహిర్గతం చేసి, బహిరంగ విచారణ జరపి హానికరమైన ఒప్పందాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మండలి ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా ప్రజలు, రాజకీయ పార్టీలు, సంస్థలు, వినియోగదారులు తమ అభ్యంతరాలను తెలియజేసే అవకాశం చట్టప్రకారం కల్పించాలని కోరారు.

పలువురు నిపుణులు కూడా ...

ఇదే అంశంపై బహిరంగ విచారణ జరపాలని కోరుతూ విద్యుత్ రంగ నిపుణులు ఎం వేణుగోపాల రావు, బి తులసీదాస్, ప్రయాస్ ఎనర్జీ గ్రూప్‌కు చెందిన ఎన్ శ్రీకుమార్, పీపుల్స్ మానిటరింగ్ గ్రూప్ ఆన్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేషన్ కన్వీనర్ ఎం తిమ్మారెడ్డి ఎపిఇఆర్‌సికి విడివిడిగా లేఖలు రాశారు.

గ్రామాలు కాలేజీల్లో 'స్వేచ్ఛ గొంతుక'

- ఎఐపై స్వేచ్ఛ ఆర్గనైజేషన్ వాయిస్ రికార్డింగ్
- భవిష్యత్ తరాలకు ఉపయోగమన్న శ్రీపత్‌రాయ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



ఫస్ట్ తెలుగు ఆపరేటింగ్ సిస్టమ్‌ను కనిపెట్టిన స్వేచ్ఛ ఆర్గనైజేషన్ ఇప్పుడు కొత్తగా అందరికీ అందుబాటులో ఉండేలా మనలా మాట్లాడే ఒక ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ని తయారు చేస్తోందని కెఎల్ యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీపత్‌రాయ్ తెలిపారు. బుధవారం పెద్దఎత్తున కళాశాలలు, గ్రామాలతోపాటు వేర్వేరు ప్రాంతాల్లో వాయిస్‌ను సేకరించే కార్యక్రమాన్ని స్వేచ్ఛ ఆర్గనైజేషన్ చేపట్టింది. ఈ సందర్భంగా శ్రీపత్‌రాయ్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌పై ఇప్పటికే పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో స్వేచ్ఛ గొంతుక అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. దీనిలో భాగంగా తెలుగు భాషలో కంప్యూటర్లు, ఫోన్లలో మనుషుల్లా మాట్లాడేలా శిక్షణ ఇస్తున్నామని వివరించారు. పదివేల గంటల వాయిస్ డేటాను సేకరించే లక్ష్యంతో ఇది చేపట్టామని, ఎవరైనా తమ వాయిస్‌ను ఇవ్వవచ్చని పేర్కొన్నారు. దీనివల్ల తెలుగులో తదుపరి తరం ఎఐకి ఊతమిచ్చినట్లు అవుతుందని అన్నారు. కెఎల్ యూనివర్శిటీ, ఎల్‌బిఆర్‌సి, విఆర్ సిద్ధార్థ, పివిపి సిద్ధార్థ, పిఎస్‌సిఎంఆర్ కాలేజ్, ఆంధ్ర లయోలా కాలేజ్, అరవింద స్కూల్స్‌తోపాటు పలు ప్రాంతాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు డ్రైవర్లు, సామాన్య ప్రజల నుండి వివిధ రకాల వాయిస్ శాంపిళ్లను రికార్డు చేశామని చెప్పారు. బుధవారం సుమారు 2500 మంది వాయిస్ ఇచ్చారని, మొత్తంగా రెండు లక్షల శాంపిల్స్ సేకరిస్తున్నట్లు స్వేచ్ఛ ఎపి ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు నిహారిక తెలిపారు. స్వేచ్ఛకు వాయిస్ ఇచ్చిన వారందరినీ ప్రోత్సహించేందుకు 24వ తేదీన కెఎల్ యూనివర్శిటీలో రామ్ మిరియాల పాటల కాన్సెప్ట్ జరుగుతోందని తెలిపారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆర్గనైజర్లు కార్తికేయశర్మ, ఖ్యాతి, తేజసాయిరెడ్డి, పవన్, భాను, సందీప్, తేజ పాల్గొన్నారు.

మీడియాపై దాడులను ఖండించాలి : సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు రోజులుగా మీడియాపై అధికార పార్టీ చేస్తున్న అమానుష దాడులను తీవ్రంగా ఖండించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ కోరారు. విజయవాడలోని దాసరి భవన్‌లో రెండు రోజులపాటు జరిగిన సిపిఐ రాష్ట్ర సమితి సమావేశాలు బుధవారం ముగిశాయి. ఈ మేరకు సిపిఐ రాష్ట్ర సమితి చేసిన తీర్మానాలపై ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో విలేకరులు, ఫొటోగ్రాఫర్లపై వైసిపి కార్యకర్తలు దాడులు చేయడంతోపాటు కార్యాలయాలపైకి దాడికి దిగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇసుక మాఫియా, మద్యం అక్రమ రవాణా, భూ కబ్జాలు, అక్రమ మైనింగులపై వార్తలు రాసినా, ఫొటోలు తీసినా వెంటాడి దాడికి పాల్పడుతున్నా, పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టు సంఘాలు చేస్తున్న ఆందోళనలకు సిపిఐ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని తెలిపారు.

స్వీయ అధ్యయనాన్ని పెంచుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. నేడు యువతపై సోషల్ మీడియా, డ్రగ్స్ ప్రభావాలు పడుతున్నాయని, వాటి నుండి యువతను సరైన మార్గంలో నడిపించడంలో సరైన పుస్తకాల అధ్యయనం ముఖ్యమని తెలిపారు. కెరీరిజం పుస్తకాలు, సినిమాల ప్రభావమూ ఎక్కువగానే ఉంటోందని, ఇటువంటి తరుణంలో కమ్యూనిస్టు సాహిత్య అధ్యయనం యొక్క ప్రాధాన్యతను వారికి వివరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రష్యా విప్లవంలోనూ, చైనా విప్లవంలోనూ ఉద్యమం వెనుకబడ్డ సమయంలో అక్కడి నాయకత్వం కార్మికవర్గాన్ని, సమాజాన్ని చైతన్యవంతం చేయడం కోసం సాహిత్యాన్ని సాధనంగా వాడుకున్నారనే విషయాన్ని మరువకూడదని తెలిపారు. ఈ నేపథ్యంలో కమ్యూనిస్టు కార్యకర్తలు, నాయకులు లెనిన్ రచనలను ప్రతినెలా కనీసం ఒకటన్నా చదవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమానికి ప్రజాశక్తి బుక్‌హౌస్ జనరల్ మేనేజర్ కె లక్ష్మయ్య స్వాగతం పలకగా, ఎంబివికె బాధ్యులు యువి రామరాజు అధ్యక్షత వహించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

మిర్చి ధరలు పతనం

గుంటూరు యార్డుకు పోటెత్తిన టిక్కీలు



యార్డులో నిల్వ ఉన్న మిర్చి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు మిర్చి యార్డులో రద్దీ కొనసాగుతోంది. గత కొంత కాలంగా రోజుకు లక్షకుపైగా టిక్కిలు వస్తున్నాయి. బుధవారం 1,39,400 టిక్కిలు యార్డుకు వచ్చాయి. పాత నిల్వలతో కలిపి 1,35,644 టిక్కిలు అమ్ముడుపోయాయి. ఇంకా 1,09,411 టిక్కిలు నిల్వ ఉన్నాయి. గత ఏడాది మిర్చి ధరలు గరిష్టంగా రూ.25 వేల నుంచి రూ.27 వేల వరకు పలికాయి. ప్రస్తుతం మేలు రకం తేజ, బాడిగ రకాలు కనిష్టంగా రూ.8 వేలు ఉండగా గరిష్టంగా రూ.21 వేలు పలికాయి. సాధారణ రకాల ధరలు కనిష్ఠంగా రూ.9 వేలు పలకగా గరిష్టంగా రూ.20 వేలు మాత్రమే పలికాయి. 334 రకం గరిష్ట ధర క్వింటాలు రూ.20,700, నెంబరు-5 రూ.19 వేలు, 273 రకం గరిష్టంగా రూ.16,500, 341 రకం రూ.20 వేలు, సూపర్-10 రూ.19 వేలు పలికాయి. గత నెల రోజుల కాలంలో సరుకు ఎక్కువ వచ్చిన రోజున ధరలు తగ్గించడం, సరుకు తక్కువగా వచ్చిన రోజున సగటు ధర స్వల్పంగా పెంచడం వ్యాపారులకు పరిపాటిగా మారింది. ఏ వెరయిటీ కూడా గరిష్టంగా రూ.21 వేలు పలకడంలేదు. ఒకేసారి సరుకు ఎక్కువగా రావడం వల్ల ధరలు తగ్గిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇళ్లల్లో నిల్వ చేసుకోలేమని, కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేసుకున్నా ప్రస్తుతం అప్పులు చెల్లించేందుకు నగదు అవసరమని, అందువల్ల అయినకాడికి అమ్ముకుంటున్నామని రైతులు చెబుతున్నారు.

నామమాత్రంగా ఇళ్ల రుణాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఇళ్లు కట్టుకోవడం అంటే మాటలు కాదు. సంపన్నులైనా కావాలి, లేదా అప్పు చేసుకునైనా కట్టుకోవాలి. ఇళ్ల నిర్మాణాలను ప్రభుత్వం తరపున బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ, ఆశించిన స్థాయిలో అందడం లేదు. ఈ ఏడాది కేవలం 21 శాతం మాత్రమే లక్ష్యాన్ని సాధించినట్లు సమాచారం. ప్రాధాన్యేతర రంగంలో బ్యాంకులు విద్య, ఇళ్లు వంటి రంగాలకు రుణాలను ఇవ్వాల్సి ఉంటుంది. దీనికోసం బ్యాంకులకు లక్ష్యాలను కూడా నిర్దేస్తారు. ఇళ్ల రంగానికి సంబంధించి ప్రభుత్వం కేటాయించే ఇళ్లకు, కేటాయించిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు రుణాలు సమకూర్చాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో భాగంగా ఈ ఏడాది 11,500 కోట్ల రూపాయలను రుణాలుగా అందించాలని లక్ష్యంగా నిర్దేశించారు. అంత భారీ లక్ష్యంలో ఇప్పటివరకు కేవలం 2,438 కోట్లు మాత్రమే ఈ ఏడాది రుణాలు ఇచ్చినట్లు లెక్కలు చెబుతున్నాయి. అంటే లక్ష్యంలో 21 శాతం మాత్రమే! ఇటీవల కాలంలో ప్రభుత్వ ఇళ్ల స్థలాల కేటాయింపుల్లో వేగం లేకపోవడంతో రుణాల కేటాయింపులు కూడా సక్రమంగా సాగడం లేదని కొంతమంది అధికారులు చెబుతున్నారు. అలాగే నేరుగా ప్రభుత్వం కేటాయించే ఇళ్ల పరిస్థితి కూడా నత్తనడక సాగుతోందని చెబుతున్నారు. అందుకే బ్యాంకర్లు కూడా లక్ష్యాన్ని సాధించలేకపోతున్నారని తెలుస్తోంది. ఇదే సమయంలో అనేక బ్యాంకులు రికవరీల సమస్య ఎక్కువగా ఉండడంతో కొత్త రుణాలు ఇవ్వడానికి వెనుకాడుతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఫొటోగ్రాఫర్‌పై దాడి కేసులో ఒకరి అరెస్టు

- ఎస్‌పి అన్బురాజన్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లా రాప్తాడులో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్న సిద్ధం సభలో మీడియా ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడి ఘటనలో ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్‌పి అన్బురాజన్ తెలిపారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ..వీడియో విజువల్స్ ఆధారంగా దాడి చేసిన వారిని గుర్తించి, పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించామన్నారు. ఇప్పటికే ఆరుగురిని గుర్తించామని, వీరిలో ఒకరైన కూడేరు మండలం మరుట్ల-2 కాలనీకి చెందిన మిద్దె ఎర్రిస్వామిని మంగళవారం అరెస్టు చేశామని తెలిపారు. ఇతనిపై హత్యాయత్నం కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడి ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు. దాడికి పాల్పడిన వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎర్రిస్వామిని కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

శిరోముండనం కేసులో ప్రధాన సాక్షి మృతి

- 28 ఏళ్లుగా న్యాయం కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి-రామచంద్రపురం(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)



రాష్ట్రంలో సంచలనం సృష్టించిన వెంకటాయపాలెం శిరోముండనం కేసులో ప్రధాన సాక్షి కోటిరాజు (58) మంగళవారం మృతి చెందారు. దీర్ఘకాలిక వ్యాధితో ఆయన మరణించారని కుటుంబ సభ్యులు తెలిపారు. శిరోముండనం కేసులో ప్రధాన బాధితుడు కోటి చినరాజుకు కోటిరాజు స్వయానా సోదరుడు. 28 ఏళ్ల క్రితం దళితుడైన చినరాజుకు శిరోముండనం చేశారు. అప్పటి నుంచి ఈ కేసు కోర్టు పరిధిలో ఉంది. ఈ కేసులో ఇప్పటికే కొందరు బాధితులు, సాక్షులు చనిపోయారు. ప్రభుత్వం, న్యాయస్థానాలు స్పందించి ఇప్పటికైనా న్యాయం చేయాలని, నిందితులను శిక్షించాలని శిరోముండనం బాధితులు, దళితులు కోరుతున్నారు.

విద్యుద్ఘాతానికి గురై గీత కార్మికుడు మృతి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి (ఏలూరు జిల్లా)

ఏలూరి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. కల్లు కోసం తాటిచెట్టు ఎక్కిన గీత కార్మికుడు విద్యుద్ఘాతానికి గురై చెట్టుపైనే మృతి చెందారు. ఈ సంఘటన ఆగిరిపల్లి మండలంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఈదర గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు పామర్తి సుబ్బారావు (70) రోజు మాదిరిగానే కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కారు. కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న విద్యుత్ వైర్లు తగిలాయి. విద్యుద్ఘాతానికి గురైన సుబ్బారావు చెట్టుపైనే ప్రాణాలు కోల్పోయి కిందకు వేలాడారు. స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చెట్టు పైనుంచి కిందకు దించారు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎస్ఐ బి.సురేంద్ర కుమార్ కేసు నమోదు చేశారు.

విశాఖలో ముఖ్యమంత్రి పర్యటన

- సిపిఎం నాయకుల గృహనిర్బంధం

ప్రజాశక్తి-పెందుర్తి (విశాఖపట్నం)

విశాఖలోని శారదా పీఠంలో జరిగే రాజశ్యామల యాగంలో పాల్గొనేందుకు బుధవారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్న నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలకు దిగారు. సిపిఎం నాయకులను గృహనిర్బంధం చేశారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్‌ను వారి ఇళ్ల వద్ద ఉదయం నుంచే నిర్బంధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి తన సొంత పనులపై వచ్చిన ప్రతిసారీ సిపిఎం కార్యకర్తలను ఇళ్ల నుంచి బయటకు రాకుండా నిర్బంధించడం ప్రజాస్వామ్యంలో చట్టాన్ని ఉల్లంఘించడమే నన్నారు. నాయకులను గృహ నిర్బంధం చేస్తే ప్రజల నిరసనలు ఆగిపోతాయా? అని ప్రశ్నించారు. నిర్బంధ చర్యలు ఆపకపోతే గత పాలకులకు పట్టినగతే ఈ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. పోలీసుల చర్యలను ఆ పార్టీ నాయకులు ఖండించారు. పోలీసులే చట్టాన్ని ఉల్లంఘి స్తున్నారని మండిపడ్డారు.



గృహ నిర్బంధంలో ఉన్న సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్



గృహ నిర్బంధంలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు



యాగంలో పాల్గొన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

వైభవోపేతంగా రాజశ్యామలయాగం

విశాఖ శారదా పీఠంలో రాజశ్యామలయాగాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. స్వయంజ్యోతి మండపంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి ప్రత్యేకపూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళలపై అత్యాచారాల్లో ఎపి నంబర్ వన్

- 'నిజం గెలవాలి' కార్యక్రమంలో నారా భువనేశ్వరి

ప్రజాశక్తి - శాంతిపురం, రామకుప్పం, పుంగనూరు (చిత్తూరు జిల్లా)



శాంతిపురంలో మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో నారా భువనేశ్వరి

మహిళలపై అత్యాచారాల్లో ఎపిని నంబర్ 1గా నిలబెట్టిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని నారా భువనేశ్వరి విమర్శించారు. 'నిజం గెలవాలి' కార్యక్రమం, కుప్పం, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల్లో బుధవారం ఆమె పర్యటించారు. శాంతిపురంలో 'ఆడబిడ్డలకు ఆర్థిక స్వేచ్ఛ' అంశంపై ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఒకప్పుడు స్త్రీ అబలగా ఉండేవారని, స్త్రీలకు గౌరవం, ధైర్యం, హక్కులు ఇచ్చి సమాజంలోకి తీసుకొచ్చిన వ్యక్తి అన్న ఎన్‌టిఆర్ అని కొనియాడారు. ఆయన 1986లో స్త్రీలకు ఆస్తిలో సమానహక్కును కల్పించి చరిత్ర సృష్టించారన్నారు. రాజకీయాల్లో రిజర్వేషన్, డ్వాక్రా సంఘాలను చంద్రబాబు తీసుకొచ్చారన్నారు. దిశ బిల్లు కాగితాలకే పరిమితమయ్యిందని విమర్శించారు. ఎపిని గంజాయి క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా మార్చారని ఆరోపించారు.

కుప్పంలో 'బాబు'కు విశ్రాంతినిద్దామా..!

సభికులతో కాసేపు భువనేశ్వరి సరదాగా మాట్లాడారు. 'చంద్రబాబును 35 ఏళ్లు గెలిపించారు.. ఈసారి నన్ను గెలిపిస్తారా..?' అంటూ ఆమె చమత్కరించారు. రాజకీయాలకు తాను దూరం అంటూ చివర్లో వ్యాఖ్యానించారు.

శాంతిపురం ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద, రామకుప్పం పోలీసు స్టేషన్ పక్కన అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించారు.

పలు కుటుంబాల పరామర్శ

పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణి మండలం కతర్లపల్లి గ్రామంలో, పుంగనూరు నియోజకవర్గం ఎన్‌ఎస్‌పేటలో, మంగళం, ఒంటిమిట్ట గ్రామాల్లో కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు.

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది

- 15 అడుగుల కాంస్య విగ్రహావిష్కరణలో ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా

ప్రజాశక్తి-కడప

ఆంధ్ర రాష్ట్ర పితామహుడు అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా అన్నారు. కడప జిల్లా గోకుల్ సర్కిల్ వద్ద 25వ డివిజన్ కార్పొరేటర్ సూర్యనారాయణరావు ఆధ్వర్యంలో బుధవారం పొట్టి శ్రీరాములు 15 అడుగుల కాంస్య విగ్రహాన్ని నగర మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ ఎం రామ చంద్రారెడ్డిలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంజాద్‌బాషా మాట్లాడుతూ కడప నగర రూపురేఖలు మార్చే అంశంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక అభివద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ నగరాన్ని రూ.2500 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

29 నుండి పొగాకు వేలం

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో 2024 కాలానికి ఎఫ్‌సివి పొగాకుపంట వేలం అమ్మకాలకు టొబాకో బోర్డు షెడ్యూలు విడుదల చేసింది. ఈ నెల 29వ తేదీ నుండి మూడు దశలుగా వేలం నిర్వహించనున్నారు. మొదటి దశలో 29న ఒంగోలు-1, కొండపిలో, మార్చి 6వ తేదీన కందుకూరు-1, 2, వెల్లంపల్లిలో, రెండో దశలో మార్చి 14వ తేదీన ఒంగోలు-2, టంగుటూరు, కలిగిరి, డిసి పల్లి, కనిగిరి, పొదిలి, దేవరపల్లి, గోపాలపురం, కొయ్యగూడెం, జంగారెడ్డి గూడెం-1, 2లలో వేలం నిర్వహించనున్నారు. ఈ మేరకు వేలం తేదీల నిర్ధారణకు బుధవారం గుంటూరు పొగాకు బోర్డు నిర్వహించిన సమావేశంలో బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పొగాకు రైతులు తమ పంటకు తగిన మార్కెటు ధర కల్పించడానికి బోర్డు అధికారులు తమ వంతు కృషి, సహాయం చేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో బోర్డు వైస్‌చైర్మన్ గుత్తా వాసుబాబు, ఒంగోలు, రాజమండ్రి రీజనల్ మేనేజర్, బోర్డు సభ్యులు, వ్యాపార సంఘాల ప్రతినిధులు, పొగాకు రైతు సంఘ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

భీమవరంలో పవన్ కల్యాణ్ సుడిగాలి పర్యటన

- టిడిపి ముఖ్య నేతలతో భేటీ

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి)



అభివాదం తెలియజేస్తున్న పవన్ కల్యాణ్

నేతల మధ్య ఉన్న విభేదాలను పక్కన పెట్టి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని టిడిపి, జనసేన నేతలకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ కోరారు. పొత్తు నేపథ్యంలో ఇరుపార్టీల మధ్య ఏవైనా సమస్యలుంటే పార్టీ అధినాయకత్వం దృష్టికి తీసుకురావాలని సూచించారు. పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల టిడిపి ఇన్‌ఛార్జీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో పవన్ భేటీ అయ్యారు. ఈ భేటీలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ, ఉండి, పాలకొల్లు ఎమ్మెల్యేలు మంతెన రామరాజు, నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్యేలు వేటుకూరి వెంకట శివరామరాజు, ఆరిమిల్లి రాధాకృష్ణ పలువురు నాయకులు పాల్గొన్నారు. సుమారు గంటకుపైగా ఇరు పార్టీల ముఖ్య నేతలతో వివిధ అంశాలపై సుదీర్ఘ చర్చలు జరిపారు. పవన్ మాట్లాడుతూ..ఎన్నికల్లో డబ్బులు ఖర్చు చేయొద్దని తాను చెప్పలేదని, ఎన్నికల్లో డబ్బు ఖర్చు చేస్తారో లేదో అది మీ నిర్ణయం అని వ్యాఖ్యానించారు. ఓట్లు కొనలేని నియోజకవర్గాలు ఉంటే సంతోషమన్నారు. జగన్ తనకు వ్యక్తిగత శత్రువు కాదని విధానాలు అత్యంత దారుణంగా ఉన్నాయని విమర్శించారు. వ్యక్తిగత లబ్ధి కోసం కులాలను విచ్చినం చేస్తు కులాలను విడగొడుతున్నారని ఆరోపించారు. అయితే పవన్ భీమవరం నుంచి పోటీ చేస్తానని అధికారికంగా ప్రకటన చేయనప్పటికీ భీమవరంలో రాజకీయ ప్రముఖులను కలుసుకోవడంతో ఇక్కడి నుంచే పోటీకి దిగుతున్నట్లు స్పష్టమైన సంకేతాలు వచ్చాయని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. రాబోయే ఎన్నికల్లో భీమవరం నుంచి పోటీ చేస్తున్నానని, తనకు అన్ని విధాలా సహకారం అందించాలని పవన్ కోరినట్లు తెలిసింది.

కోల్ ఇండియా రూ.16,500 కోట్ల పెట్టుబడులు




న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద బొగ్గు ఉత్పత్తిదారు కోల్ ఇండియా లిమిటెడ్ (సిఐఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.16,500 కోట్ల పైగా పెట్టుబడుల వ్యయం చేయనుందని బొగ్గు మంత్రిత్వ శాఖ తెలిపింది. భారత బొగ్గు ఉత్పత్తిలో కోల్ ఇండియా 80 శాతం వాటా కలిగి ఉంది. "2023-24కు గాను సిఐఎల్, ఎన్ఎల్‌సిఐఎల్ సంస్థలు మరోమారు తమ పెట్టుబడుల లక్ష్యం కంటే ఎక్కువగా వ్యయం చేస్తున్నాయి. రెండు సంస్థలు కూడా భారత వృద్ధిలో కీలక భాగస్వామ్యం అవుతున్నాయి." అని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఎన్ఎల్‌సి ఇండియా రూ.2,880 కోట్ల పెట్టుబడుల లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. కాగా మంత్రిత్వ శాఖ రూ.21,030 కోట్ల పెట్టుబడుల లక్ష్యాన్ని పెట్టుకుంది. గడిచిన కొన్ని ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వ బొగ్గు సంస్థలు అంచనాలు మించి పెట్టుబడులు చేస్తున్నాయి. 2021-22లో కోల్ ఇండియా, ఎన్ఎల్‌సిఐఎల్‌లు వరుసగా 104.88 శాతం, 123.33 శాతం చొప్పున పెట్టుబడుల లక్ష్యాన్ని చేరాయి. 2022-23లో ఇరు సంస్థలు 113 శాతం లక్ష్యాన్ని నమోదు చేశాయి.

జీలో రూ.2వేల కోట్ల నిధుల మళ్లింపు..!

- సెబీ దర్యాప్తు
- 14 శాతం పడిపోయిన షేర్ ధర



ముంబయి : జీ ఎంటర్‌టైన్‌మెంట్‌లో రూ.2,000 కోట్ల నిధుల మళ్లింపు జరిగిందని రిపోర్టులు వస్తోన్నాయి. ఆ సంస్థ ఆర్థిక అవకతవకలను సెక్యూరిటీస్ అండ్ ఎక్చేంజీ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ) ఇటీవల గుర్తించి విచారణ ప్రారంభించిందని బ్లూమ్‌బర్గ్ ఓ రిపోర్టులో పేర్కొంది. ఓ కేసులో భాగంగా జీ వ్యవస్థాపకులపై విచారణ జరుపుతున్న క్రమంలో కంపెనీ నుంచి రూ.2,000 కోట్లు (241 మిలియన్ డాలర్లు) అక్రమంగా తరలించినట్లు వెల్లడయ్యిందని సమాచారం. ఇది సెబీ తొలుత అంచనా వేసిన దాని కంటే 10 రెట్లు ఎక్కువని తెలుస్తోంది. ఈ అంశమై జీ వ్యవస్థాపకుడు సుభాష్ చంద్ర, ఆయన కుమారుడు పునీత్ గోయెంకా, బోర్డు సభ్యులను సెబీ వివరణ కోరినట్లు తెలుస్తోంది. దీనిపై జీ, సెబీ అధికారికంగా స్పందించాల్సి ఉంది. సుభాష్ చంద్ర, గోయెంకా తమ సొంత ప్రయోజనాల కోసం కంపెనీ నిధులను దారి మళ్లించారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దీనిపై సెబీ గతకొంతకాలంగా దర్యాప్తు జరుపుతోంది. తాజాగా మరింత సమాచారం బయటికి రావడంతో బుధవారం బిఎస్ఇలో జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ షేర్ ఏకంగా 14.77 శాతం పతనమై రూ.28.50కు పడిపోయింది. జీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కుదిరిన విలీన ఒప్పందాన్ని కల్వర్ మ్యాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ (సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్) రద్దు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఒప్పంద విలువ రూ.83వేల కోట్లుగా ప్రకటించాయి. 2021 డిసెంబర్ 22న ఈ ఒప్పందం కోసం సంతకాలు చేసుకోగా.. ఇటీవల సోనీ పిక్చర్స్ ఈ డీల్ రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించింది. కాగా.. దీన్ని తిరిగి పునరుద్ధరించేందుకు ఇరు సంస్థలు చర్చలు జరుపుతున్నాయని వస్తోన్న వార్తలను తాజాగా జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఖండించింది.



భారత్‌లో 250 ఉద్యోగులపై నోకియా వేటు

న్యూఢిల్లీ : నోకియా కంపెనీ భారత్‌లో 250 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలకనుంది. సంస్థ పునర్‌వ్యవస్థీకరణ ప్రణాళికలు, పొదుపు చర్యల్లో భాగంగా సిబ్బందిపై వేటు వేయాలని నిర్ణయించింది. నోకియా 5జీ టెక్నాలజీ పట్ల భారత్‌లో డిమాండ్ తగ్గడంతో కంపెనీ పలు సమస్యలు ఎదుర్కొంటోందని సమాచారం. నోకియా టెక్నాలజీపై గతంలో భారీగా వెచ్చించిన కొన్ని బడా దేశీ కంపెనీలు ప్రస్తుతం దీనిపై ఇది వరకు స్థాయిలో ఖర్చు చేసేందుకు మొగ్గు చూపకపోవడంతో సిబ్బందిని తగ్గించుకోవాలని చూస్తోందని తెలుస్తోంది.



వెలిగొండ ప్రాజెక్టును పరిశీలిస్తున్న శశి భూషన్ కుమార్

పరిహారం ఇచ్చాకే.. నీళ్లు వదులుతాం

- వెలిగొండను పరిశీలించిన శశిభూషణ్‌కుమార్

ప్రజాశక్తి-పెద్దదోర్నాల (ప్రకాశం జిల్లా)


వెలిగొండ ప్రాజెక్టు పరిధిలోని నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ప్రకారం పరిహారం చెల్లించిన తర్వాతనే ప్రాజెక్టు నుంచి నీళ్లు వదులుతామని రాష్ట్ర జలవనరుల ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ తెలిపారు. దీనిపై నిర్వాసితులు ఎలాంటి అపోహలకు గురి కావాల్సిన అవసరంలేదని చెప్పారు. సంబంధిత శాఖ అధికారులతో కలిసి ఆయన బుధవారం వెలిగొండ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా శశిభూషణ్‌కుమార్ మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు మొదటి టన్నెల్ లైనింగ్ పూర్తైందని తెలిపారు. రెండో టన్నెల్ పూర్తయ్యిందని, లైనింగ్ పనులూ శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా రైతాంగానికి సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రాజెక్టులను నిర్మించడంలోనూ, నిర్వాసితులను ఆదుకోవడంలోనూ కృతనిశ్చయంతో ఉందన్నారు. ఆయన వెంట ఇఎల్‌సి నారాయణరెడ్డి, సిఇ మురళీధర్‌రెడ్డి, ఎస్ఈ అబుద్ అలీం, డిఇ ముక్తేశ్వరరావు, రాంబాబుతో పాటు వెలుగొండ ప్రాజెక్టు సిబ్బంది ఉన్నారు.

వలంటీర్లు ఏజెంట్లుగా ఉండాలి

- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - గార, శ్రీకాకుళం రూరల్

వచ్చే ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల్లో అవసరమైతే వలంటీర్లు ఏజెంట్లుగా ఉండాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు వ్యాఖ్యానించారు. శ్రీకాకుళం జిల్లా గార మండలం అంపోలులో బుధవారం నిర్వహించిన గ్రామ, వార్డు వలంటీర్ల పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 80 ఏళ్లు దాటిన వారు పోలింగ్ కేంద్రాలకు రావాల్సిన అవసరం లేకుండా ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించిందని తెలిపారు. అలాంటి వృద్ధులకు వలంటీర్లు సాయం చేసి, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వారికి నచ్చిన పార్టీకి వేయించాలని సూచించారు. ప్రభుత్వంపై కోపంతో ఉన్న వారు పోలింగ్ కేంద్రాల్లో వేరే పార్టీ గుర్తుపై నొక్కేయడానికి చూస్తుంటారని చెప్పారు. అలా చేయడానికి వీల్లేకుండా అవసరమైతే వలంటీర్లే ఏజెంట్లుగా ఉండాలన్నారు. అందుకు ఎటువంటి అడ్డూ లేదని తెలిపారు. వలంటీర్లకు సర్వీస్ రూల్స్ లేవని, ఏ ప్రతిఫలం ఆశించకుండా స్వచ్ఛంద సేవ చేస్తున్నారన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే బడికొండ అప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్ తమీమ్ అన్సారియా, కార్పొరేషన్ల చైర్మన్లు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, డి.పి దేవ్, ఎంపిపిలు జి.రఘురాం, అంబటి నిర్మల, జెడ్‌పిటిసిలు మార్పు సుజాత, రుప్ప దివ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

నిరసన తెలిపాం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజలు, ప్రభుత్వ ఆస్తులను కబ్జా చేసినట్లు రామోజీరావు నిరూపిస్తే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని, తన ఆస్తులన్నీ రాసిస్తానని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తమ కార్యకర్తలు జర్నలిజంపై దాడి చేయలేదని, తెలుగుదేశానికి కరపత్రంగా వున్న ఈనాడు కార్యాలయం ముందు నిరసన మాత్రమే తెలిపారని అన్నారు.

గృహ రుణాల్లో పటిష్ట వృద్ధి

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ వెల్లడి

ముంబయి : ప్రయివేటు రంగ దిగ్గజం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ గృహ రుణాల జారీలో మెరుగైన వృద్ధిని కనబర్చుతున్నట్లు తెలిపింది. హెచ్‌డిఎఫ్‌సి విలీనం తర్వాత మరింత పటిష్ట పెరుగుదల చోటు చేసుకుందని పేర్కొంది. 2023 డిసెంబర్‌తో ముగిసిన చివరి రెండు త్రైమాసికాల్లో రెండంకెల వృద్ధి నమోదు చేసినట్లు పేర్కొంది. రెండు సంస్థల విలీనం తర్వాత గృహ రుణాల మార్కెట్‌లో 18 శాతం నుంచి 20 శాతం వాటాకు పెరిగినట్లు తెలిపింది. 2050 నాటికి దేశంలో 90 కోట్ల నివాసాల అవసరం ఉండొచ్చని అంచనా వేసింది. గృహ రుణాలకు డిమాండ్ పెరుగుతుందని పేర్కొంది.

లీడింగ్ బ్రాండ్‌గా కెనన్ కొనసాగింపు

Canon
Delighting You Always

న్యూఢిల్లీ : వరుసగా 21వ ఏడాదిలోనూ గ్లోబల్ కెమెరా మార్కెట్‌లో ముందంజలో ఉన్నట్లు కెనన్ పేర్కొంది. వినియోగదారుల ఆకాంక్షలకు అనుగుణంగా వినూత్న ఉత్పత్తుల ఆవిష్కరణలు, ఆఫర్లు, ఫ్రెండ్లీ మోడల్స్, ప్రొఫెషనల్ పవర్ హౌసెస్ తదితర అంశాలు కెమెరా మార్కెట్‌లో రాణించడానికి, తమ విజయానికి ప్రధాన కారణమని ఆ సంస్థ పేర్కొంది. తమ నూతన ఇఒఎస్ సిరీస్ ఉత్పత్తులు స్పీడ్, కంఫర్ట్, అధిక నాణ్యతను కలిగి ఉన్నాయని పేర్కొంది.

కేర్ హాస్పిటల్స్ చీఫ్ సేల్స్‌గా షాలాబ్ దంగ్



హైదరాబాద్ : కేర్ హాస్పిటల్స్ గ్రూప్ చీఫ్ సేల్స్, మార్కెటింగ్ ఆఫీసర్‌గా షాలాబ్ దంగ్ నియమితులయ్యారు. వివిధ రంగాల్లో ఆయనకు రెండున్నర దశాబ్దాల అనుభవం ఉందని ఆ సంస్థ తెలిపింది. కేర్ హాస్పిటల్స్‌లో చేరక ముందు ఆయన పోర్టిస్ హెల్త్‌కేర్ లిమిటెడ్‌లో ఇంటర్నేషనల్ హెడ్‌గా పని చేశారని పేర్కొంది.

సంపాదకీయం


ఆకుపచ్చని అడవి

అడవులు భూగోళపు ఊపిరితిత్తులు. అడవి చల్లగా ఉంటేనే మానవాళి భవిత భద్రంగా ఉంటుంది. కీకారణ్యమైనా, చిట్టడవియైనా, నాలుగు చెట్లు ఒకచోట ఉంటే భూగోళానికి చేసే మేలు ఇంత అంత కాదు! కానీ, అంతులేని లాభాపేక్షతో కార్పొరేట్లు అడవులను కబళించడానికి ఎప్పటికప్పుడు విరుచుకు పడుతుంటారు. తమ చెప్పుచేతల్లోని ప్రభుత్వాలతో అనుకూల చట్టాలను తయారుచేయించుకుంటారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఈ దిశలో భారత అటవీ (సంరక్షణ) చట్టం 1980ని సవరించడానికి చేసిన ప్రయత్నానికి అత్యున్నత న్యాయస్థానం బ్రేక్ వేసింది. కార్పొరేట్లకు కట్టబెట్టడమే లక్ష్యంగా గత ఏడాది అడవుల నిర్వచనాన్ని మారుస్తూ తీసుకువచ్చిన చట్ట సవరణను తాత్కాలికంగా నిలిపివేసింది. 1996లో వెలువరించిన టిఎన్ గోదావర్మన్ తిరుములపాడ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా తీర్పులో నిర్దేశించిన అటవీ నిర్వచనానికి అనుగుణంగా నడుచుకోవాలని ఆదేశిస్తూ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం ఆహ్వానించదగిన పరిణామం. నిఘంటువుల్లోని అర్థాన్ని అడవికి ప్రామాణికంగా తీసుకోవాలని ఈ తీర్పులో ధర్మాసనం పేర్కొంది. వర్గీకరణలు, యాజమాన్యాలతో సంబంధం లేకుండా సంరక్షణ చర్యలు తీసుకోవాలని నిర్దేశించింది. అడవులుగా భావించే ప్రాంతాలను (డీమ్డ్ ఫారెస్ట్స్) గుర్తించడానికి నిపుణుల కమిటీలను ఏర్పాటు చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది. ఇన్ని కీలకమైన ఆదేశాలు ఉన్నాయి కాబట్టే ఆ తీర్పును ఒక మైలురాయిగా భావిస్తారు.

కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం 1951 నుండి 75 వరకు దేశ వ్యాప్తంగా 40 లక్షల హెక్టార్ల అటవీ భూమి ఆక్రమణకు గురైంది. ఆ నేపథ్యంలోనే భారత అటవీ (సంరక్షణ) చట్టాన్ని రూపొందించి 1980లో ఆమోదించారు. ఈ చట్టం అమలులోకి వచ్చిన తరువాత ఇతర అవసరాలకు అటవీ భూమిని మళ్లించడం గణనీయంగా అదుపులోకి వచ్చింది. గతంతో పోలిస్తే 1981 నుండి 2022 వరకు అటవీ భూముల నిర్మూలన పదిశాతం తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అయినప్పటికీ, చట్టంలోని లొసుగులను అవకాశంగా తీసుకుని అడవుల నరికవేత కొనసాగింది. ఈ నేపథ్యంలోనే తమిళనాడులోని గూడలూరులో చోటుచేసుకున్న కలప అక్రమ నరికివేతకు సంబంధించి దాఖలైన టిఎన్ గోదావర్మన్ తిరుమలనపాడ్ కేసులో అటవీ ప్రాంతాల రక్షణను ప్రధానంగా చేసుకుని సుప్రీం ఇచ్చిన తీర్పులో 'అడవి'ని విస్తృతంగా నిర్వచించింది. ఇది కార్పొరేట్లకు ఆటంకంగా మారింది. ఈ నిబంధనలను మార్చాలన్న ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో వారి కనుసన్నల్లో నడిచే మోడీ ప్రభుత్వం గత ఏడాది ప్రభుత్వ రికార్డుల్లో నమోదైన భూమిని మాత్రమే అడవిగా గుర్తిస్తూ అటవీ చట్టానికి సవరణ తీసుకు వచ్చింది. ప్రస్తుతమున్న నిబంధనల ప్రకారం అడవుల పరిధిలోకి వస్తాయన్న భయంతో ప్రైవేటు వ్యక్తులు ప్లాంటేషన్లు, తోటలు పెంచడం లేదని తన చర్యను ప్రభుత్వం సమర్థించుకుంది. వాతావరణ లక్ష్యాలను అందుకోవాలంటే ప్రైవేటు ప్లాంటేషన్ల భాగస్వామ్యం అవసరమని అడ్డగోలు వాదనకు దిగింది.

ప్రభుత్వం చేసిన సవరణతో దేశ వ్యాప్తంగా 1.99 లక్షల చదరపు కి.మీల భూమి అడవుల పరిధి నుండి బయటకు వస్తుందని అంచనా. మన రాష్ట్రంలోనూ వేల ఎకరాల అటవీ భూమికి రెక్కలు వస్తాయని అంటున్నారు. ఇప్పటికే యురేనియం తవ్వకాల పేరిట ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ అడవుల విధ్వంసం ప్రారంభమైంది. పర్యాటక ప్రాంతాల్లో భూముల కేటాయింపునకు సంబంధించి ప్రభుత్వాలపై ఒత్తిడి ఎలానూ ఉంది. వీటన్నింటితో పాటు కేంద్ర సవరణ అమలులోకి వస్తే అటవీహక్కుల చట్టానికి పెద్ద ఎత్తున గండి పడే ప్రమాదం ఉంది. అత్యున్నత న్యాయస్థానంలో ఈ వాదనలన్నీ ప్రస్తావనకు వచ్చాయి. ఆశాజనకమైన ఫలితం వచ్చినప్పటికీ అది మధ్యంతర తీర్పే! ప్రభుత్వం చేసిన సవరణను న్యాయస్థానం పూర్తిగా కొట్టివేయలేదు. అడవులను గుర్తిస్తూ రికార్డులు తయారు చేయడానికి ప్రభుత్వానికి గడువిస్తూ అంతవరకు పాత నిర్వచనం అమలులో ఉంటుందని పేర్కొంది. దీనర్థం కార్పొరేట్ కత్తి వేలాడతూ ఉందనే! ఈ ప్రమాదాన్ని తిప్పికొట్టి, ఆకుపచ్చటి అడవులను పరిరక్షించుకోవడానికి ప్రజలను చైతన్యం చేయడం ఒక్కటే మార్గం.

మహనీయుల మాట



ప్రపంచం మారాలని
మనం కోరుకోవడం కాదు.
మార్పు మనతో మొదలైతే...
ప్రపంచం అదే మారుతుంది.

- లియో టాల్‌స్టాయ్,
ప్రపంచ ప్రసిద్ధ రష్యన్ రచయిత.

బిజెపిని, దాన్ని బలపరుస్తున్న పార్టీలను ఓడిద్దాం

సందర్భం

మతోన్మాద బిజెపి, దానికి మద్దతునిచ్చే టిడిపి-జనసేన కూటమి, నిరంకుశ వైసిపిలకు వ్యతిరేకంగా... సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 20న ... విజయవాడ యం.బి విజ్ఞానకేంద్రంలో జరిగిన రాష్ట్ర సదస్సు ఆమోదించిన తీర్మానం పూర్తి పాఠం.



సాధారణ ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఒకవైపు మతోన్మాద బిజెపి నేతృత్వ ఎన్‌డిఎ, దానికి వ్యతిరేకంగా మరోవైపు ఇండియా బ్లాకు పార్టీలు తలపడనున్నాయి. ఇప్పటివరకు రాష్ట్రానికి ద్రోహం చేసి ప్రజల తిరస్కారానికి గురైన మతోన్మాద బిజెపి, టిడిపి, జనసేన కూటమి తోడ్పాటుతో ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా రాష్ట్రంలో తిష్టవేయడానికి దుష్టపన్నాగం పన్నుతున్నది. రాష్ట్రంలో బిజెపిని ఓడించడమంటే దానికి కొమ్ముకాస్తున్న టిడిపి-జనసేన కూటమి, నిరంకుశ వైసిపిని ఓడించడమే. రాష్ట్రం కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం, సామాజిక న్యాయం కోసం, మత సామరస్యం కోసం వామపక్ష లౌకిక శక్తులను బలపర్చాలని ఈ సదస్సు రాష్ట్ర ప్రజానీకానికి విజ్ఞప్తి చేస్తున్నది.

గత 10 ఏళ్లలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ధ్వంసం చేస్తూ, ఇస్రో లాంటి ప్రతిష్టాత్మకమైన సంస్థలను కూడా ప్రైవేటుకు అప్పగిస్తున్నది. దీనివల్ల దేశంలో ఆర్థిక స్వావలంబన దెబ్బ తినడమేకాక సామాజిక న్యాయం పూర్తిగా దెబ్బతింటుంది. కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాల వల్ల దేశ సంపదలు అదానీ, అంబానీలకు దోచిపెట్టారు. ధరలు, పన్నులు పెంచి ప్రజలపై భారాలు మోపింది. మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని అమలుపరచకుండా నిరుద్యోగులను వీధుల పాలు చేసింది.

మతాల మధ్య, కులాల మధ్య ఘర్షణలు సృష్టించి మారణహోమం సృష్టిస్తున్నారు. మహిళలను నగ్నంగా ఊరేగించి, ఆపైన మానభంగం, హత్యలు చేసే నీచ సంస్కృతిని పునరావృతం చేయ సంకల్పించారు. మణిపూర్ ఘటన దేశ చరిత్రలో మాయని మచ్చగా మిగిలింది. జమ్ము-కాశ్మీర్‌కు రక్షణగా ఉన్న ఆర్టికల్ 370 రద్దు ద్వారా అక్కడ నిరంతర ఘర్షణలకు తెరదీశారు.

అయోధ్యలో రామమందిర నిర్మాణం, కాశీలో జ్ఞానవాపి తదితర అంశాల చుట్టూ ప్రజల మనోభావాలు మళ్లించే దుష్ట ఎత్తుగడలు, కులాలవారీగా, మతాల వారీగా ప్రజలను చీల్చి మోడీ నామస్మరణ చుట్టూ జనాన్ని, దేశ రాజకీయాల్ని తిప్పాలనుకునే కుతంత్రాలకు ఫిబ్రవరి 8న జరిగిన రైతాంగ పోరాటం, 16న సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాలు జరిపిన గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెలు మోడీ ప్రభుత్వ అంచనాలను తారుమారు చేసే సంఘటనలే.

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం బిజెపి దారిలోనే ప్రజలపై భారాలు మోపుతున్నది. నిరంకుశంగా ప్రజావ్యతిరేక పాలన చేస్తున్నది. ప్రజా ఉద్యమాలపై నిర్బంధం ప్రయోగిస్తున్నది. ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తున్నది. ఇలాంటి వైసిపికి గద్దెపై కూర్చునే హక్కు లేదు. గత టిడిపి పాలన కూడా ఇందుకు భిన్నంగా లేదు.


ఈ నేపథ్యంలో మన రాష్ట్రంలో రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన వ్యవస్థలను (ఆర్‌బిఐ, ఈసీ, ఈడి, సిబిఐ కడకు న్యాయ వ్యవస్థతో సహా) తమ ఆధీనంలోకి తెచ్చుకుని సమాఖ్య వ్యవస్థకు తూట్లు పొడుస్తున్న బిజెపిని, దానికి వంతపాడుతున్న పార్టీలను ఓడించాల్సిన అవసరం ఉంది. కేంద్రం గవర్నర్ల ద్వారా రాష్ట్రాలపై పెత్తనం చేయడం ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలుగుతుంది. ఈ నేపథ్యంలో వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక పార్టీలన్నీ ఐక్యంగా నిలబడి బిజెపితో జతకడుతున్న టిడిపి, జనసేనలను; వైసిపిని ఓడించి, లౌకిక శక్తులను బలపరచాలని విజ్ఞప్తి చేస్తున్నాం. మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాజధాని నిర్మాణం, పోలవరం నిర్మాణానికి, పునరావాసానికి నిధులు, విశాఖ రైల్వేజోన్, ఉత్తరాంధ్ర, రాయలసీమ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ, కడప స్టీల్ ప్లాంటు నిర్మాణం, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, కృష్ణపట్నం, గంగవరం పోర్టుల ప్రైవేటీకరణ ఇలా అన్నింటి విషయంలో ద్రోహం చేసిన బిజెపిని, దాన్ని బలపరుస్తున్న పార్టీలను రాబోవు ఎన్నికల్లో దూరం పెట్టాల్సిన చారిత్రక అవసరం నేడు ఉంది. వీటి సాధనలకు కృషి సల్పుతూనే రాజకీయంగా ఆ పార్టీలను ఎండగట్టాలి.

ఈ కర్తవ్య నిర్వహణలో రాష్ట్ర ప్రజలంతా భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేస్తున్నాము. ప్రజాతంత్ర, లౌకికవాదులు, సంస్థలు ముందుకొచ్చి రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడాలని కోరుతున్నాము.

బిజెపి హటావో - దేశ్ బచావో

జ్ఞానపీఠ్‌కు అన్ని విధాల అర్హుడు గుల్జార్

స్మృతి



సంభాషణల రచయితగా గుల్జార్ తన ప్రతిభను చూపెట్టారు. సినిమా దర్శకత్వంలోనూ ఆయనది ప్రత్యేక శైలి. మానవ సంబంధాలను, సామాజిక అంశాలను సున్నితంగా కళాత్మకంగా చెప్పడంలో ఆయనది అందెవేసిన చేయి. కళ కళ కోసం కాదు దానికి సామాజిక ప్రయోజనం కూడా ఉంటుందని చూపి మెప్పించిన వాడు గుల్జార్ . ఎమర్జెన్సీకి ముందు ఏర్పడిన రాజకీయ వాతావరణంలో ఆయన దర్శకత్వం వహించిన 'ఆంధీ' గొప్ప సంచలనం సృష్టించింది. అందులోని నాయిక పాత్ర ఇందిరా గాంధీ జీవితంతో పోలి ఉందని జనం భావించారు.

బహుముఖ ప్రతిభాశాలి గుల్జార్‌కు ఈ ఏడాది జ్ఞానపీఠ్ అవార్డు లభించడం సంతోషకరం. కవి, సినీ గేయ రచయిత, సంభాషణా రచయిత, కథా రచయిత, సినిమా దర్శకుడు, నిర్మాత మాత్రమే కాక ఆయన ఉర్దూ సాహితోద్యమకారుడు కూడా. ఆయనకు జ్ఞానపీఠ్ అవార్డు ఇవ్వడంలో సంఘ్ పరివారానికి రాజకీయ కారణాలు ఉన్నప్పటికీ జ్ఞానపీఠ్‌కు గుల్జార్ నూటికి నూరు శాతం అర్హుడు. సిక్కు కుటుంబంలో పుట్టిన తనకు, తల్లిదండ్రులు పెట్టిన పేరు సంపూరణ్ సింగ్ కార్లా. కాగా పేరులో కుల మతాల ఛాయలు కన్పించరాదని తన పేరును గుల్జార్‌గా మార్చుకొన్నారు.

సుప్రసిద్ధ ఉర్దూ హిందీ నవలాకారుడు మున్షి ప్రేమ్‌చంద్ అధ్యక్షతన 1936లో ఇండియన్ ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్ పిడబ్ల్యుఎ ఏర్పడింది. ఆ తర్వాత ఇండియన్ పీపుల్స్ థియేటర్ ఆర్ట్స్ ఏర్పడింది. చిన్నవయస్సులోనే గుల్జార్ ఆ సంఘాల సంబంధాల్లోకి వచ్చారు. మోటారు గ్యారేజీలో పని చేసే గుల్జార్ ఆ సంఘాల్లోని కవులు, కళాకారుల సంపర్కంతో ఇంతింతై వటుడింతై అన్నట్లు చలన చిత్ర రంగంలోనూ, ఉర్దూ సాహిత్య వినీల ఆకాశంలోనూ మిలమిల మెరిసే తారగా ఎదిగారు. ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్న జీలం జిల్లా దీనా నుండి గుల్జార్ కుటుంబం దేశ విభజన తర్వాత ముంబైకి వలస వచ్చింది.



ఎస్. వినయ కుమార్

తన కుటుంబంలో అందరూ ఉన్నత విద్యావంతులైనా గుల్జార్‌కు సాంప్రదాయ చదువులపై శ్రద్ధ లేదు. చిన్నతనం నుండే ఉర్దూ సాహిత్యంపై మక్కువ. డిగ్రీ పూర్తి చేశాక సిఏ చేయమని కుటుంబం ఒత్తిడి చేసినా తన కాలేజీ చదువు ఇంతటితో సమాప్తం అని ప్రకటించాడు. ముంబైలో బతుకు దెరువు కోసం ఒక మోటారు గ్యారేజీలో చేరాడు.

తన కవిత్వంలో చిన్ననాటి జ్ఞాపకాలే మొదట్లో ఎక్కువగా ఉండేవట. గతంలోకి ప్రయాణించడం వల్ల అసలు విషయం నుండి కాస్త దృష్టి మళ్లినా దాని వల్ల ప్రేరణ కూడా లభిస్తుందని ఆయన చెప్తారు. బడికి వెళ్లే దారిలో కన్పించే చెట్టుతో సహా తాను గమనించిన వాటినే వస్తువుగా ఎంచుకొని కవిత్వం రాసేవాడట. కవి సమ్మేళనాలకు హాజరు కావడం తప్ప ముమ్ముందు వీడెందుకూ పనికి రాడని గుల్జార్ తండ్రి ఈసడించేవాడట. మోటారు గ్యారేజీలో పని చేస్తున్న దశలోనే సాహిత్యంలో ఎంఏ చేస్తున్న తన అన్న పుస్తకాలన్నీ చదివి ఆయనతో చర్చించేవాడు. ఇప్టాలోని బాసు భట్టాచార్య, సంగీత దర్శకుడు, రచయిత సలీల్ చౌదురి దర్శకుడు దేబు సేన్, కవి శైలేంద్ర, పంజాబ్ కవి సుఖ్‌బీర్‌లతో స్నేహం ఏర్పడింది. పిడబ్ల్యుఎ, ఇప్టాల్లో సభ్యుడయ్యాడు.

గుల్జార్‌కు సినీ రంగంలోకి రావాలనే కోరిక లేదు. ఉపాధ్యాయుడిగా ఉద్యోగం లభిస్తే చాలు పుస్తకాలు చదువుకొంటూ, కవితలు రాసుకొంటూ కాలం గడపొచ్చని భావించే వాడట. 1960లో 'బందినీ' సినిమాకు సంగీతం సమకూర్చుతున్న సచిన్ దేవ్ బర్మన్‌కు గేయ రచయిత శైలేంద్రతో పొరపొచ్చాలు వచ్చాయి. శైలేంద్ర రాయాల్సిన పాటను గుల్జార్‌తో రాయించుకొన్నారు బర్మన్. తాను ఊహిస్తున్న వైష్ణవ ఆధ్యాత్మికతను కుర్రాడైన గుల్జార్ పలికించగలడా అంటూ మొదట సందేహించినా "మోరా గోరా అంగ్ లాయిలె, మోహె శ్యాం అంగ్ దాయి దే" అన్న పల్లవితో గుల్జార్ రాసిన పాట హిట్ అయింది. కానీ ఈ లోగా ఎస్‌డి బర్మన్, శైలేంద్రల మధ్య మళ్లీ సఖ్యత కుదిరింది. గుల్జార్‌కు ఒక్క పాటతోనే దారి మూసుకు పోయింది. అది గుర్తించిన ప్రఖ్యాత దర్శకుడు బిమల్ రాయ్ తనకు డైరెక్షన్‌లో గుల్జార్‌ను సహాయకుడిగా పెట్టుకొన్నారు. ఇకనేం బాల్‌రాజ్ సాహ్ని హీరోగా తాను నిర్మించిన కాబూలీ వాలా చిత్రంలో గుల్జార్ చేత గుండెను పిండే తాత్విక ధోరణి గల "గంగా ఆయే కహా సే రే... గంగా జాయే కహా రే..." అనే అద్భుత పాటను బిమల్ రాయ్ రాయించు కొన్నారు. కాబూలీవాలా నవలనంతా ఒడిసిపట్టి మూడు చరణాల్లో సారాంశాన్ని చెప్పిన గొప్ప పాట అది. ఆ తర్వాత పాటలు రాస్తూనే బిమల్ రాయ్‌తో అసిస్టెంట్ డైరెక్టర్‌గా సంభాషణా రచయితగా కొనసాగారు. ఆ తర్వాత హృషికేశ్ ముఖర్జీతో కూడా గుల్జార్ అసిస్టెంట్‌గా పని చేశారు. హిట్ పాటలెన్నింటినో గుల్జార్ రాశారు. 'స్లమ్‌డాగ్ మిలియనీర్' చిత్రం కోసం రాసిన 'జైహో' అన్న పాటకు సంగీత దర్శకుడు ఎ.ఆర్. రహ్మాన్‌తో కలిసి గుల్జార్ 2010లో ఆస్కార్ అవార్డు అందుకొన్నారు. అదే పాటకు ప్రఖ్యాత గ్రామీ అవార్డు కూడా ఆయనకు లభించింది. 2002లో కేంద్ర సాహిత్య అకాడెమి అవార్డు, 6 సార్లు నేషనల్ ఫిల్ము అవార్డులు, 22 సార్లు ఫిలింఫేర్ అవార్డులను, 2004లో పద్మభూషణ్ అవార్డును అందుకొన్నారు. 2012లో ఇందిరా గాంధీ నేషనల్ ఇంటిగ్రేషన్ అవార్డు లభించింది. 2013లో చలన చిత్ర రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన దాదా సాహెబ్ ఫాల్కె అవార్డును అందుకొన్నారు.

తన 22 ఏళ్ల వయస్సులో సినిమా రంగంలోకి పాటల రచయితగా ప్రవేశించిన ఆయన ఎస్.డి.బర్మన్, సలీల్ చౌదురి, శంకర్ జైకిషన్, హేమంత్ కుమార్, లక్ష్మీకాంత్ ప్యారేలాల్ మదన్ మోహన్, రాజేశ్ రోషన్, అనుమాలిక్, శంకర్ ఇషాన్-లాయ్, ఆర్.డి. బర్మన్, ఎ.ఆర్.రహ్మాన్, విశాల్ భరద్వాజ్‌లు సమకూర్చిన బాణీలకు పాటలు రాశారు. ఎ.ఆర్.రహ్మాన్, విశాల్ భరద్వాజ్‌ల ట్యూన్లకు రాయడంలో గుల్జార్ చాలా ప్రత్యేకత చూపినట్లు చెప్తారు.

సంభాషణల రచయితగా గుల్జార్ తన ప్రతిభను చూపెట్టారు. సినిమా దర్శకత్వంలోనూ ఆయనది ప్రత్యేక శైలి. మానవ సంబంధాలను, సామాజిక అంశాలను సున్నితంగా కళాత్మకంగా చెప్పడంలో ఆయనది అందెవేసిన చేయి. కళ కళ కోసం కాదు దానికి సామాజిక ప్రయోజనం కూడా ఉంటుందని చూపి మెప్పించిన వాడు గుల్జార్. ఎమర్జెన్సీకి ముందు ఏర్పడిన రాజకీయ వాతావరణంలో ఆయన దర్శకత్వం వహించిన 'ఆంధీ' గొప్ప సంచలనం సృష్టించింది. అందులోని నాయిక పాత్ర ఇందిరా గాంధీ జీవితంతో పోలి ఉందని జనం భావించారు. 'ఆంధీ'తో పాటు సంజీవ్ కుమార్ హీరోగా ఆయన చాలా హిట్ సినిమాలకు దర్శకత్వం వహించారు. నిర్మించారు కూడా. మూగ చెవిటి వారైన పేద జంట పాత్రల్లో సంజీవ్ కుమార్, జయ బాదురి (ఆ తర్వాత జయా బచ్చన్ అయ్యారు)తో తీసిన 'ఖామోష్' (నిశబ్దం) గుండెను పిండేసే సినిమా. షేక్స్పియర్ రాసిన "కామెడీ ఆఫ్ ఎర్రర్స్"ను భారతీకరించి నిర్మించిన 'అంగూర్' పూర్తి హాస్యభరిత చిత్రం. హాస్యం నిండిన సినిమాలు కూడా అంతే ప్రతిభావంతంగా నిర్మించగలడని గుల్జార్ రుజువు చేశారు.

రెండవ ప్రపంచ యుద్ధం నేపథ్యంలో నిర్మించిన ప్రఖ్యాత చిత్రం 'సౌండ్ ఆఫ్ మ్యూజిక్'. ఆ కథను కూడా భారతీకరించి 'పరిచయ్' పేరుతో గొప్ప సినిమా నిర్మించారు. తన మొదటి చిత్రం (మేరే అప్నే) లోనే మీనా కుమారిని ఎంచుకొన్నారు. నిరుద్యోగంతో ముసలి తల్లులను పిల్లలు పని మనుషులుగా ఎలా మార్చుతారో చెప్పే సినిమా అది. అలాగే పిల్లలను ఎలా పెంచాలో సున్నితంగా చెప్పే సినిమా 'కితాబ్' నిర్మించారు. ఉర్దూ సాహిత్యంపై ఎంతో కృషి చేశాడు కనుకే ఉర్దూ కవి మీర్జా గాలిబ్‌పై దూరదర్శన్ కోసం అద్భుత సీరియల్ నిర్మించారు. గాలిబ్‌గా నసీరుద్దీన్ నటన గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆ సీరియల్‌లో గుజ్రాల్ రాసిన ఉర్దూ సంభాషణలు, నసీరుద్దీన్ ఉర్దూ ఉచ్ఛారణ చెవులకు విందు చేస్తాయి.

గుల్జార్ పాటల్లోనూ, సినిమాల్లోనూ మనస్సును కరిగించే సున్నిత అంశాలే కాదు వాటిలో అభ్యుదయ దృక్పథం కూడా ఉంటుంది. 1973లో ఆయన నటి రాఖీని పెళ్లాడారు. వారి ఏకైక పుత్రిక మేఘ్నా గుల్జార్ కూడా దర్శకురాలు. గుల్జార్ చేసిన రచనలు రావి పార్ (రావి నదికి ఆవల), ఏ పోయం ఏ డె, త్రివేణి, మీర్జా గాలిబ్, హజార్ రాహే ముడ్ కె దేఖె...వంటివి ఉన్నాయి. రవీంద్రనాద్ టాగూర్ రాసిన చిత్ర క్షణిక, సోనార్ తరి కవితా సంపుటాల నుండి కొన్ని కవితలను ఎంపిక చేసి గుల్జార్ ఉర్దూలోకి అనువదించారు. వాటిని 'బాగ్ బాన్' పేరుతో ఒక పుస్తకంగా తెచ్చారు. ఉర్దూలో ఆయన రాసిన కథలను 'గుల్జార్ కథలు' పేరుతో సి.మృణాళిని తెలుగులోకి అనువదించారు. గజల్స్‌లో కూడా గుల్జార్‌ది అందెవేసిన చేయి. గుల్జార్‌కు జ్ఞానపీఠ్ అవార్డునివ్వడం వెనుక బిజెపికి రాజకీయ ప్రయోజనం ఉంది. దానివల్ల పంజాబీలపై ఉర్దూ సాహిత్యాభిమానులపై రాజకీయ ప్రభావం ఉంటుందని పరివార్ ఆలోచన కావచ్చు. గుల్జార్‌తో పాటు సంస్కృత పండితుడు రామభద్రాచార్యకు జ్ఞానపీఠ అవార్డును ప్రకటించారు. తద్వారా అంతగా తెలియని రామభద్రాచార్యను గుల్జార్ వంటి బహుముఖ ప్రజ్ఞాశాలి పక్కన కూర్చోబెట్టారు. దాని వెనుక ఉన్న రాజకీయం ఏమిటో సులభంగానే అర్థమవుతుంది.

/ వ్యాసకర్త 'ప్రజాశక్తి' పూర్వ సంపాదకులు/



కార్మికవర్గ పోరాటాలు, ఉద్యమాలు లేకుండా విశాఖపట్నం లేదు. ఆ పోరాట విజయాలు లేకుండా ప్రజల జీవితాల్లో ఇంత గొప్ప మార్పు లేదు. మహిళా పోరాటాలు, ఉద్యమాలు...వాటికి కార్మిక సంఘ నేతల తోడ్పాటు ఎంతో వుంది. కార్మికోద్యమానికి భుజం భుజం కలిపి నడిచిందిక్కడ మహిళా ఉద్యమం. అది సారా ఉద్యమమైనా, విశాఖ నగరంలో పేదలకు ఇళ్ల స్థలాల పోరాటమైనా మహిళ చురుకైన పాత్ర పోషిస్తూ వస్తోంది.

కార్మికోద్యమంతో మమేకమైన మహిళా ఉద్యమం



ఎస్. పుణ్యవతి

గుంటూరు జిల్లా చిలుమూరులో 1947 ఫిబ్రవరిలో జరిగిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం రాష్ట్ర ప్రథమ మహాసభలో విజయనగరానికి చెందిన డాక్టర్ లక్ష్మి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, దిగుమర్తి సువర్ణబాయి కార్యవర్గ సభ్యురాలుగా ఎన్నికయ్యారు. నెలరోజుల పాటు జరిగిన మహిళా రాజకీయ శిక్షణా తరగతుల్లో ప్రకృతి, సమాజం, ప్రపంచ రాజకీయ, చరిత్ర అంశాలతో పాటు ప్రసూతి, శిశు పోషణపై డాక్టర్ అచ్చమాంబ బోధించేవారని, అది నేర్చుకొని ఎంతోమందికి పురుడు పోసేవారమని వైదాడ ధర్మారం చెప్పారు. ధర్మారం నివశించిన గొల్లలపాలెం, క్రరి పార్వతమ్మ స్వగ్రామం తిమ్మరాజుపేటలో మహిళా సంఘ కార్యక్రమాలు జరుగుతుండేవి. ఆ ప్రాంతంలో అప్పయ్యమ్మ, వెంకటరత్నం, అనకాపల్లిలోని గవరపాలెంలో పెంటకోట చిట్టెమ్మడు పనిచేశారు. మహిళా ఉద్యమం, వామపక్ష ఉద్యమంలో అనేక ఆటుపోటులు ఎదురవడంతో ఉద్యమ పునర్నిర్మాణం కోసం 1967లో గట్టి ప్రయత్నం జరిగింది. పూర్వ గుంటూరు జిల్లా కాజలో కొద్దిమంది మహిళా కార్యకర్తలతో రాజకీయ శిక్షణ తరగతులు జరిగాయి. ఆ తరగతులకు మల్లు స్వరాజ్యం, మోటూరు ఉదయం, మానికొండ సూర్యావతి వచ్చారు. ఆనాడు విశాఖపట్నం జిల్లా మహిళా సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా ధర్మారం, క్రరి పార్వతమ్మతో కమిటీ ఏర్పాటైంది. వీరు ఉద్యమానికి బాట వేశారు. 1976 నుంచి కార్మికోద్యమంతో మమేకమైన చరిత్ర ఇక్కడ మహిళా ఉద్యమానికి వుంది. దీనికి ముందు నుంచీ పోర్టు వర్కర్సు యూనియన్ కాలం నుంచి కూడా వుంది.

విశాఖ నగరంలో కార్మికోద్యమంతో పాటు మహిళా ఉద్యమం మమేకమై, గర్వించదగ్గ పాత్ర పోషించింది. మహిళలు, మహిళా ఉద్యమం పాత్ర లేకుండా కార్మిక పోరాటాలు జరగలేదనడంలో అతిశయోక్తి లేదు. కార్మిక నాయకులు, కుటుంబాలు 'రండి మా ఇంటికి' అని తీసుకెళ్లి కుటుంబంలోని మహిళలు, దగ్గర బంధువులను పరిచయం చేసి మహిళా ఉద్యమానికి అప్పజెప్పేవారు. గ్రామీణ ప్రాంతంలోని అనకాపల్లి, మునగపాకలో రైతాంగ, కార్మిక పోరాటాల ప్రభావం ఆ కుటుంబాల మహిళల్లో వుండేది. విశాఖపట్నం కార్మికవర్గ చరిత్ర, మహిళా ఉద్యమ చరిత్ర నుంచి నేర్చుకోవాల్సింది, గుర్తించుకోవాల్సింది కుటుంబ సంబంధాలు. ఈ కుటుంబ సంబంధాలకు ఎవరిది ఏ ప్రాంతం, ఏ కులం, ఏ మతం అని లేదు. కష్టసుఖాల్లో ఇతర కుటుంబాలు దన్నుగా నిలబడ్డ ఘనమైన ఉద్యమ చరిత్ర విశాఖలో ఉంది.

ధర్మారం ఇంట్లో నేనున్నప్పుడు జీవితాలను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడింది. హిందూస్తాన్ షిప్ యార్డులో ఆఫ్‌లోడ్ సమస్య ముందుకొచ్చినప్పుడు మహిళా సంఘం విశాఖ జిల్లా కమిటీ చొరవ తీసుకొని షిప్‌యార్డు కుటుంబాల్లోని మహిళలతో పోస్టుకార్డు ఉద్యమం నడిపింది. ఒక్కొక్క పోస్టు కార్డుపై పది పదకొండు సంతకాలు చేయించి, వెయ్యి కుటుంబాలను కలిసి 11 వేల సంతకాలు సేకరించి 'సేవ్ షిప్‌యార్డు' (షిప్‌యార్డును రక్షించండి) అనే నినాదంతో ప్రధానమంత్రికి ఉత్తరాలు పంపించాం. దీనికి ప్రధాన భూమిక డి.శారద పోషించారు. బిహెచ్‌పివి లాకౌట్ చేసినప్పుడు కార్మికుల నిరాహార దీక్షల్లో కార్మిక కుటుంబాల మహిళలతో నిరాహార దీక్షలో పాల్గొన్నాం. బిహెచ్‌పివిని 'ఎల్ అండ్ టి' కి ఇవ్వడానికి చేస్తున్న ప్రభుత్వ ప్రయత్నాలను అడ్డుకోవడంలో సిఐటియు, కార్మికవర్గం భీకరమైన పోరాటం చేసినప్పుడు ఆ యా కుటుంబాల మహిళలను సమీకరించి రోడ్డుకు అడ్డంపడి ఎల్ అండ్ టి వాహనాలను అడ్డుకున్నాం. ఈ పోరాటంలో పాల్గొన్న వారంతా మహిళా ఉద్యమంలో ఆరితేరిన వారు కాదు. సాధారణ కార్మిక కుటుంబాల నుంచి వచ్చిన వారే. రోడ్డుకు అడ్డం పడ్డప్పుడు శరీరం గీసుకు పోతుందా? రోడ్డుపై మట్టి వుందా? ఉమ్ములున్నాయా? అని మహిళలు ఆలోచించలేదు. ఎల్ అండ్ టి ని ప్రతిఘటించి, బిహెచ్‌పివిని రక్షించుకోవాలన్న పట్టుదలతో వీరోచితంగా పోరాడి వాహనాలను అడ్డుకున్నారు.

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడానికి ప్రధాని నరేంద్ర మోడీ పగలు, రాత్రి కలవరిస్తున్నారు. ప్లాంట్ పరిరక్షణకు కార్మికులు, కార్మిక కుటుంబాలు, మహిళలు పోరాడుతున్నారు. స్టీల్‌ప్లాంట్ నిర్మాణ కాలం నుంచి జరుగుతున్న ప్రతీ పోరాటంలోనూ మహిళల భాగస్వామ్యం వుంది. కాంట్రాక్ట్, నిర్మాణ కార్మికుల కనీస వేతనాల కోసం జరిగిన పోరాట సందర్భంగా కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వద్ద జరిగిన పోలీసు కాల్పుల్లో రక్తమోడుతున్న కార్మికులను...శారద, శేషారత్నం సహా పలువురు మహిళలను మోసుకొని వెళ్లారు. వైద్యం అందక ఒక మహిళ చనిపోవడంతో, ఆస్పత్రిలో వైద్య సదుపాయాలు మెరుగుపర్చాలని చేసిన పోరాటంలో మహిళలందరినీ పోలీసు స్టేషన్‌లో పెట్టినందుకు నిరసనగా స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి ఇంటిని ముట్టడించినప్పుడు, సిఎమ్‌డి తప్పించుకొని వెళ్లాలన్న ప్రయత్నాలపై శారద, జి.మణి ఆయన కారుకు అడ్డంపడ్డారు. మహిళల వీరోచిత పోరాటంతో కార్మికులు పెద్ద ఎత్తున కదిలారు. ట్రాలర్స్ వర్కర్ల సమ్మెలో కార్మిక కుటుంబాల మహిళలు పాల్గొనేలా మహిళా సంఘం కృషి చేసింది. తొలుత పదుల సంఖ్యలో వచ్చిన జాలారిపేట మత్స్యకార మహిళలు, కలెక్టరేట్ ప్రదర్శనకు వందలాదిగా వచ్చారు. పోలీసు లాఠీ ఛార్జిలో ఓ మహిళ చెవిపోగు తెగి రక్తం కారుతున్నా లెక్క చేయకుండా ఎంతో ధైర్యంగా పోలీసు స్టేషన్‌లో వున్న మహిళల మాటలు నేటికీ గుర్తుకొస్తున్నాయి. డిఫెన్స్ కార్మికుల సమ్మెలో ఆ కుటుంబాల మహిళలు గేటు దగ్గర బైఠాయించారు.

కార్మికవర్గ పోరాటాలు, ఉద్యమాలు లేకుండా విశాఖపట్నం లేదు. ఆ పోరాట విజయాలు లేకుండా ప్రజల జీవితాల్లో ఇంత గొప్ప మార్పు లేదు. మహిళా పోరాటాలు, ఉద్యమాలు...వాటికి కార్మిక సంఘ నేతల తోడ్పాటు ఎంతో వుంది. కార్మికోద్యమానికి భుజం భుజం కలిపి నడిచిందిక్కడ మహిళా ఉద్యమం. అది సారా ఉద్యమమైనా, విశాఖ నగరంలో పేదలకు ఇళ్ల స్థలాల పోరాటమైనా మహిళ చురుకైన పాత్ర పోషిస్తూ వస్తోంది. బూతు సినిమాలు ప్రదర్శిస్తున్న సినిమా థియేటర్లకు వెళ్లి పేడ పోసి ఆ తరహా సినిమాలు ఆపడంలో మహిళా సంఘం కార్యకర్తలు చురుగ్గా పనిచేశారు. స్త్రీల సమస్యలు, వరకట్నం, అత్యాచారాలు, వేధింపులు, హత్యలు జరిగినప్పుడు జోక్యం చేసుకొని కేసులు కట్టించి శిక్ష పడేలా పనిచేస్తోంది. హత్య చేసి ఆత్మహత్య అని చిత్రీకరించి తప్పించుకోవాలని చూసినప్పుడు న్యాయం కోసం గొంతెత్తి నినదిస్తోంది అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం. 2001 నవంబరులో జరిగిన ఐద్వా ఏడవ మహాసభకు స్టీల్‌ప్లాంట్ ఆతిథ్యమివ్వగా, రెండు దశాబ్దాల తరువాత ఈ ఫిబ్రవరి 22 నుంచి 25 వరకు జరగనున్న ఐద్వా జాతీయ కార్యవర్గ సమావేశాలకు విశాఖపట్నం వేదికైంది.

/ వ్యాసకర్త ఐద్వా జాతీయ కోశాధికారి/

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

టెట్-టిఆర్‌టి మధ్య గ్యాప్ ఉండాలి

● రిట్‌పై నేడు స్పందిస్తామన్న హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

ఎపి టెట్, ఎపి టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టిఆర్‌టి) పరీక్షల మధ్య తగిన సమయం ఉండేలా ప్రభుత్వానికి ఉత్తర్వులివ్వాలంటూ దాఖలైన పిటిషన్‌పై గురువారం ఉత్తర్వులు జారీ చేస్తామని హైకోర్టు ప్రకటించింది. టెట్, పరీక్షకు టిఆర్‌టి పరీక్షకు మధ్య కనీసం నెలరోజుల గడువుండే బాగుంటుందని హైకోర్టు అభిప్రాయపడింది. వాటి షెడ్యూల్స్ సవరణ చేసే అంశంపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోవడంతో తాము గురువారం తగిన ఉత్తర్వులిస్తామని జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ బుధవారం ప్రకటించారు. టెట్, టిఆర్‌టి మధ్య కేవలం ఒక్కరోజే సమయం ఉండటం వల్ల అభ్యర్థులకు తీరని అన్యాయం జరుగుతుందంటూ శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎం పెద్దిరాజు సహా ఐదుగురు దాఖలు చేసిన పిటిషన్ల తరుపున సీనియర్ అడ్వకేట్ బి ఆదినారాయణరావు వాదించారు. టెట్ ఫలితాలు మార్చి 14న ప్రకటిస్తారని, ఆ తర్వాత రోజునే టిఆర్‌టిని నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. దీనిపై ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ.. నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరడానికి అభ్యర్థులకు హక్కు లేదని చెప్పారు.

సమస్యలు పరిష్కారం కాక

ఆందోళనలో సచివాలయాల ఉద్యోగులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సర్వీస్ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో వారిలో ఆందోళన నెలకొంది. ఎన్నికల కోడ్ విడుదలయ్యే సమయం సమీపించడంతో ఉద్యోగుల్లో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వానికి ఎన్ని వినతులు సమర్పించినా ఫలితం కనిపించకపోవడంతో రానున్న రోజుల్లో ఉద్యమం దిశగా అడుగులు వేయక తప్పదనే అభిప్రాయం ఉద్యోగులు వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత విద్యావంతులైన ఉద్యోగులకు కేడర్‌మార్పు చేసి జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ ఇవ్వాలని, విధుల్లో చేరిన మొదటి రోజు నుండి నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ముందుస్తుగా సచివాలయాల్లో చేరిన ఉద్యోగులకు సంబంధించిన ప్రొబేషనరీ ఆలస్యంగా డిక్లేర్ చేసిన కాలానికి పేస్కేల్‌కు అనుగుణంగా అరియర్స్ ఇవ్వాలని, నాలుగు సంవత్సరాల సర్వీస్ పూర్తిచేసుకున్న అన్ని కేటగిరీల సచివాలయ ఉద్యోగులకు ఒకే విభాగంలో కాకుండా వివిధ విభాగాల్లో (మల్టిపుల్ డైరెక్షన్) విద్యార్హత ప్రామాణికంగా ప్రమోషన్లు కల్పించాలని, కనీస పే స్కేల్ సీనియర్ అసిస్టెంట్‌కు తగ్గకుండా ప్రమోషన్లు కల్పించాలని గ్రామ వార్డు సచివాలయ శాఖ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

సింగిల్ విండో రిక్రూట్‌మెంట్ సిస్టమ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల నియామకం గ్రామ వార్డు సచివాలయాల ద్వారా చేసి, ప్రతి రెండు సంవత్సరాలకు ఒక ప్రమోషన్ కల్పిస్తూ ప్రమోషన్ల ద్వారా ఉన్నత స్థాయి వరకు ఉద్యోగులకు అవకాశాలు కల్పించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన పరిపాలన అందించే అవకాశం కల్పించాలని ఉద్యోగులు కోరుతున్నారు. భేషరతుగా ఉద్యోగులకు యూనిఫామ్ నిబంధన తొలగించాలని, సచివాలయాల పర్యవేక్షణ ఒకే అధికారి నియంత్రణలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామవార్డు సచివాలయ ఉద్యోగ సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగులకు జాబ్ చార్ట్ కాకుండా ఇతరత్రా ఇతర పనులకు వినియోగించుకోకుండా జాబ్ చార్ట్ విధులకే పరిమితం చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులకు బయోమెట్రిక్ హాజరు నుండి మినహాయింపు ఇవ్వాలని కూడా కోరుతున్నారు. వీటిని పరిష్కరిస్తామంటూ హామీ ఇచ్చినప్పటికీ ఆ దిశలో చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది.

'జువారి' కాలుష్య కోరల్లో రైతులు

- దుమ్ముతో పంట పొలాలకు తీవ్ర నష్టం
- మైనింగ్ కారణంగా అడుగంటిన జలవనరులు
- దిగుబడి లేదంటూ చీనీ రైతుల ఆవేదన

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల (కడప)

పరిశ్రమలు వస్తే స్థానిక ప్రజలకు ఉద్యోగ అవకాశాలతో పాటు, చుట్టుపక్కల ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. ఆ కారణంగా జువారి సిమెంట్స్ పరిశ్రమ నిర్మాణానికి మండలంలోని తుమ్మలపల్లి, వలసపల్లి, కోడూరు, పెదనపాడు గ్రామాల రైతులు తమ భూములను త్యాగం చేశారు. పరిశ్రమ ద్వారా ఆ గ్రామాల అభివృద్ధి ఏమో కానీ... రైతులకు మాత్రం శాపంగా మారింది. జువారి పరిశ్రమలో జరుగుతున్న మైనింగ్ ద్వారా పొలాలపై పడే దుమ్ముతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. మండల పరిధిలోని వలసపల్లి తుమ్మలపల్లి గ్రామాల్లో జువారి పరిశ్రమలో సున్నపురాయి కోసం చేస్తున్న బ్లాస్టింగ్ కారణంగా చీనీ చెట్లు, వేరుశనగ, నువ్వులు, బుడ్డ శనగ, ఇతరత్రా పంట పొలాలపై తెల్లటి దుమ్ముతో పొరలాగా ఏర్పడుతోందని రైతులు పేర్కొంటున్నారు. రూ.లక్షలు ఖర్చు చేసి చీనీ పంటను పండించినప్పటికీ దిగుబడి రావడం లేదని రైతులు వాపోతున్నారు. వలసపల్లి గ్రామంలో 40 నుండి 50 ఎకరాల్లో, తుమ్మలపల్లి గ్రామంలో 70 నుండి 80 ఎకరాల్లో చీనీ పంటను రైతులు పండిస్తున్నారు. జువారి కర్మాగారంలో బ్లాస్టింగ్ ద్వారా వచ్చే దుమ్ము కారణంగా పొలాలు బీడువారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్మాగారం నుండి వెలువడే దుమ్ము చీనీ చెట్ల ఆకులపై తెల్లటి పొరలాగా ఏర్పడుతోందని, దీని కారణంగా చీనీ పూత రాలిపోతోందని రైతన్నలు వాపోతున్నారు. ఇతర గ్రామాల్లో ఎకరానికి 10 టన్నులు చీనీ పంట దిగుబడి వస్తే, రెండు గ్రామాల్లో ఎకరానికి రెండు నుండి నాలుగు టన్నులు మాత్రమే దిగుబడి వస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కర్మాగారంలోని మైనింగ్ లోతుకు తవ్వడం కారణం గా భూగర్భంలోని నీరు దిగువ భాగం వైపు ప్రవహించడంతో పొలాల్లోని బోర్లకు నీరు అందడం లేదు. ఈ కారణంగా ఒక రోజుకు 40 నుండి 50 చెట్లకు మాత్రమే నీరు అందివ్వగలుగుతున్నామని రైతులు వాపోతున్నారు. అధిక ఖర్చులు వెచ్చించి ట్యాంకర్ల ద్వారా చీనీ చెట్లకు నీటిని సరఫరా చేస్తున్నామని రైతులు చెప్పారు. ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు చేసిన దిగుబడి రాకపోవడంతో ఆర్థికంగా చితికిపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు ఇంతటి సమస్యను ఎదుర్కొంటున్న పొల్యూషన్ అధికారులు ఇటువైపు తొంగి చూడలేదని మండిపడుతున్నారు. ఈ సమస్యపై త్వరలో జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయుటకు రైతులు సిద్ధమవుతున్నారు.

రైతులకు న్యాయం చేయాలి

జువారి కర్మాగారం నుండి వెలువడే దుమ్ముతో చీనీ రైతుల భవిష్యత్తు అగమ్యగోచరంలా మారింది. పెట్టుబడి వ్యయం అధికమవుతోంది. దిగుబడి లేక రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. జువారి యాజమాన్యానికి ఎన్నిసార్లు చెప్పినా చూద్దామంటూ దాటవేస్తున్నారే తప్ప పట్టించుకోవడం లేదు. పొల్యూషన్ అధికారులు, కలెక్టర్ సమస్యపై స్పందించి రైతులకు న్యాయం చేయాలి.

- మురళీమోహన్‌రెడ్డి, రైతు, తుమ్మలపల్లి.

తగ్గిపోయిన భూగర్భజలాలు

జువారి కర్మాగారంలో మైనింగ్ లోతుగా చేయడం కారణంగా భూగర్భంలో నీరు దిగువకు ప్రవహించడంతో పొలాల్లో ఏర్పాటు చేసుకున్న బోర్లలో నీరు అందడం లేదు. భూగర్భంలో జలాలు లేకుండా పోతున్నాయి. నీరు లేక పొలాలు బీడు వారుతున్నాయి. ఉన్న నీరు కూడా కలుషితం కావడంతో చెట్లు చనిపోతున్నాయి. నీరు, దుమ్ము సమస్య కారణంగా దిగుబడి లేక రైతులు నష్టపోతున్నారు.

- వెంకటరామిరెడ్డి, రైతు, వలసపల్లి.

కృష్ణా నదిలో ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోండి

● రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి

కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం నడికుదురు, నిమ్మగడ్డ గ్రామాల పరిధిలో కృష్ణా నదిలో ఇసుక అక్రమ తవ్వకాలపై తీసుకున్న చర్యలను నివేదించాలని రాష్ట్రానికి హైకోర్టు నోటీసులిచ్చింది. అక్రమ తవ్వకాల నివారణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరును ఆదేశించింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తూ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్ రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఆదేశాలు జారీ చేసింది. కోస్టల్ రెగ్యులేషన్ జోన్ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయంటూ సామాజిక కార్యకర్త తాతానేని లీలాకృష్ణ దాఖలు చేసిన పిల్‌పై విచారణ జరిపింది. నదిలో ఇసుక తవ్వకాలు చేయడం ఇరిగేషన్‌శాఖ పరిధిలోకి వస్తుందన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలపై ఫొటోలను పరిశీలించాలని కోరారు.

మైనార్టీలకు పెద్దపీట : సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మైనార్టీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రంగాల్లో పెద్దపీట వేశారని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం వైసిపి మైనార్టీ సెల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సజ్జల మాట్లాడుతూ.. సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలా, ఇప్పటి వరకు రాష్ట్రానికి ఏమీ చేయని చంద్రబాబు కావాలా? అని ప్రజలు తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అలాగే నామినేటెడ్ పదవుల్లో మైనార్టీలకు ఎక్కువ పదవులు ఇచ్చారని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ గెలుపు కోసం సైనికుడి మాదిరి పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో శాసనమండలి ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, మైనార్టీ సెల్ నాయకులు ఫరూకీ, హంజా, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

సహకార విస్తరణపై భారత్, గ్రీస్ చర్చలు

న్యూఢిల్లీ : భారత్, గ్రీస్‌ల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యానికి ప్రత్యేక ప్రాముఖ్యత వుందని గ్రీక్ ప్రధాని కిర్యాకోస్ మిసొటకిస్ బుధవారం వ్యాఖ్యానించారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింతగా విస్తరించి, ఆర్థిక సహకారంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం గ్రీస్ ప్రధాని భారత్ వచ్చారు. ప్రధాని నరేంద్ర మోడీతో చర్చలకు ముందుగా ఆయనకు రాష్ట్రపతి భవన్ వద్ద సాదర స్వాగతం లభించింది. విదేశాంగ మంత్రి జై శంకర్ కూడా ఆయనతో భేటీ అయ్యారు. అనంతరం రాజ్‌ఘాట్‌లో మహాత్మా గాంధీకి నివాళులు అర్పించారు. గతేడాది ఆగస్టులో మోడీ గ్రీస్‌లో పర్యటించిన సమయంలో ఇరు దేశాల మధ్య సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి తీసుకెళ్ళారు. వివిధ రంగాల్లో సహకారాన్ని విస్తరించడంతో పాటూ ఆర్థిక కార్యకలాపాలను కూడా పెంచాలని ఇరువురు నేతలు భావిస్తున్నారు.

డ్వాక్రా రుణాల చెల్లింపులో గోల్‌మాల్

- చేతివాటం ప్రదర్శించిన యానిమేటర్
- కన్నీరు పెట్టుకున్న మహిళా సంఘ సభ్యులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

డ్వాక్రా రుణాలు తీసుకొని ప్రతినెలా సక్రమంగా కంతులకు సంబంధించిన డబ్బును యానిమేటర్‌కు నమ్మి ఇస్తే చేతివాటం ప్రదర్శించి లక్షల రూపాయల కాజేసిందని మహిళా సంఘాల సభ్యులు వాపోతున్నారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈఘటనకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని పత్తి కుంటపల్లిలో శ్రీ సత్యసాయి, నానావళి సంఘాల సభ్యులు బ్యాంకులో రుణం తీసుకున్నారు. ప్రతినెల కట్టే కంతులకు సంబంధించిన డబ్బులను ఆ సంఘాల సభ్యులు యానిమేటర్ పార్వతికి ఇచ్చేవారు. అయితే ఆమె బ్యాంకులో జమ చేయకుండా తన అవసరాలకు ఉపయోగించుకున్నారు. శ్రీ సత్యసాయి సంఘ సభ్యులు రెండు సంవత్సరాల క్రితం రెండు లక్షల రూపాయల రుణం తీసుకుని అన్ని కంతులు కట్టివేశారు. తర్వాత రుణం కావాలని పలుమార్లు యానిమేటరును అడిగారు. అయితే ఆమె ఈరోజు, రేపు అని చెప్పి ఆరునెలలుగా కాలయాపన చేశారు. దీంతో ఆ సంఘ సభ్యులు స్థానిక పాలసముద్రంలోని కెనరా బ్యాంకు వారిని కలిసి తాము రుణం మొత్తం కట్టేశామని తమకు కొత్త రుణం మంజూరు చేయాలని కోరారు. దీంతో బ్యాంకు అధికారులు ఆసంఘం బ్యాంకు ఖాతాను పరిశీలించారు. ఇంకా 75 వేల రూపాయలు అప్పు మిగిలి ఉందని అది కట్టివేస్తే రుణం ఇస్తామని చెప్పారు. దీంతో సంఘం సభ్యులు అవాక్కయ్యారు. సభ్యులందరూ వెళ్లి యానిమేటర్ పార్వతిని నిలదీశారు. తమకు జరిగిన అన్యాయాన్ని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆ అధికారులు గుట్టు చప్పుడు కాకుండా యానిమేటర్‌కు సర్ది చెప్పి ఆమె వాడిన మొత్తం అమౌంట్ ను బుధవారం లోపు కట్టే విధంగా సెటిల్మెంట్ చేశారు. ఈ విషయం పలు సంఘాల సభ్యులకు తెలిసింది. తమకు ఇచ్చిన రుణం ఏమైందోనని నానావళి సంఘ సభ్యులు బుధవారం పాలసముద్రం కెనరా బ్యాంక్ మేనేజర్‌ను కలిశారు. ఆసంఘం బ్యాంకు ఖాతాను చెక్ చేయించారు. నానావళి మహిళా సంఘ సభ్యులు 10 మంది ఉండగా వారు రూ. 6.60 లక్షలలు రుణం తీసుకున్నారు. ఒక్కొక్క సభ్యురాలు నెలకు మూడు వేల రూపాయలతో 30 వేల రూపాయలు వసూలు చేసి సభ్యులలో ఒకరిద్దరూ యానిమేటర్‌తో కలిసి బ్యాంకుకు వెళ్లి కంతు కట్టేవారు. అయితే సంఘ సభ్యులు నిరక్షరాస్యులు కావడంతో యానిమేటర్ వారితో డబ్బు తీసుకొని తానే బ్యాంకు స్లిప్ రాసి ఇచ్చిన అప్పులో కొంత మాత్రమే కట్టి మిగతా మొత్తాన్ని తన అవసరాలను వాడుకున్నట్లు బయట పడింది. ఫిబ్రవరి 12న సంఘ సభ్యులు అందరూ రూ.29,500 వసూలు చేసి బ్యాంకులో రుణం కంతుకట్టడానికి యానిమేటర్ తో వెళ్లగా యానిమేటర్ బ్యాంకులో కేవలం రూ. 2, 950లు మాత్రమే బ్యాంకులో కట్టి బ్యాంక్ వారిచ్చిన స్లిప్పులో మరో సున్నా చేర్చి ఆస్లిప్పును సంఘ సభ్యులకు ఇచ్చినట్లు గుర్తించారు. ఒక్కొక్క కంతుకు రూ. 30,000 వేల ప్రకారం మొత్తం 15 కంతులకు గాను కేవలం రూ. 1. 65 లక్షలు మాత్రమే బ్యాంకులో జమ చేయగా ఇంకా రూ. 5. 50 లక్షలు బాకీ ఉన్నట్లు బ్యాంకు అధికారులు స్టేట్‌మెంట్ ఇచ్చారు. దీంతో నానావళి సంఘ మహిళా సభ్యులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కూలీనాలి చేసి అప్పు కట్టామని యానిమేటర్ చేతివాటం ప్రదర్శించడంతో బ్యాంకులో అప్పు అట్లే ఉండిపోయిందని కన్నీరు పెట్టుకున్నారు. వెలుగు అధికారులు తమకు న్యాయం చేయకపోతే ఈ విషయంపై జిల్లా స్థాయి అధికారులకు విన్నవిస్తామని , పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

ఎస్ఐ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని పిల్

● ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి

ఎస్ఐ నియామకాల్లో బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీకి ఆదేశాలివ్వాలంటూ దాఖలైన పిల్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులిచ్చింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జిఎడి, హోంశాఖ ముఖ్య కార్యదర్శులు, రాష్ట్రస్థాయి పోలీసు నియామక బోర్డు ఛైర్మన్, డిజిపికి చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్ రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం నోటీసులు జారీ చేసింది. ఎస్ఐ పోస్టుల భర్తీలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మహిళలకు చెందిన 246 బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి ఉత్తర్వులివ్వాలంటూ ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ అనుముల వంశీకృష్ణ పిల్ దాఖలు చేశారు. గతంలో ఎస్ఐ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేసినప్పటికీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టలేదని పిటిషనరు వాదించారు.

వైసిపి పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులుగా దేవేంద్రరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులుగా గుర్రంపాటి దేవేంద్రరెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయం పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కమిటీని ప్రకటించింది. అధ్యక్షులుగా గుర్రంపాటి దేవేంద్రరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా పి పరంధామరెడ్డి, బి అప్పిరెడ్డితో కలిపి మొత్తం 19 మందితో వైసిపి రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కమిటీని ప్రకటించింది.

సుగర్స్... రివర్స్

- బయటపడుతున్న వైసిపి, టిడిపి వైఖరి
- భూములు వేటికి అనువుగా ఉంటాయో తెలపాలంటూ కలెక్టర్‌కు లేఖ
- ఫ్యాక్టరీ స్థలంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటూ టిడిపి కొత్త రాగం
- మరో పోరాటమే మార్గమంటున్న రైతాంగం



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఆమదాలవలస సుగర్స్ అంశంపై టిడిపి యూటర్న్ తీసుకున్నట్లు కనిపిస్తోంది. వచ్చే ఎన్నికల్లో సుగర్స్‌కు ప్రత్యామ్నాయంగా ఆ స్థలంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నది టిడిపి కొత్త అజెండాను ఎంచుకుంది. సుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో హామీనిచ్చి నేటికీ తెరిపించలేదంటూ ఆమదాలవలసలో ఈనెల 13న నిర్వహించిన శంఖారావం సభలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ ప్రస్తావించారు. శంఖారావం సభలు నిర్వహించిన ఆయా నియోజకవర్గాల్లో వైసిపి హామీనిచ్చి విస్మరించిన అంశాలను తాము అమలు చేస్తామని చెప్పిన లోకేష్, ఇక్కడ రేఖామాత్రంగానైనా చెప్పలేదు. ఫ్యాక్టరీ తెరవకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మాట తప్పి మడమ తిప్పారంటూ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కూన రవికుమార్ విమర్శిస్తూనే, సుగర్ ఫ్యాక్టరీ స్థానంలో పరిశ్రమలను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలంటూ చెప్పుకొచ్చారు. తద్వారా సుగర్ ఫ్యాక్టరీ విషయంలో టిడిపి వైఖరేమిటో తేటతెల్లమైంది.

ప్రభుత్వ వంచన

సుగర్ ఫ్యాక్టరీ విషయంలో ప్రభుత్వం ఇప్పటివరకు అనుసరించిన వైఖరిని గమనించిన టిడిపి, తనూ అదే దారిలో వెళ్తే జనం ఎవరికో ఒకరికి ఓటేయక మానరని భావిస్తున్నట్లుగా కనిపిస్తోంది. ఆమదాలవలస నియోజకవర్గానికి ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న తమ్మినేని సీతారాం సుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని 2019 ఎన్నికల్లో హామీనివ్వడంతో ఆ ప్రాంత ప్రజలు, రైతులు ఆదరించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2020, ఫిబ్రవరి రెండో తేదీన ఆ ప్రాంతాన్ని నిపుణుల కమిటీ సందర్శించి, యంత్రాల పరిశీలనతో పాటు రైతులతో కమిటీ సభ్యులు మాట్లాడారు. తామంతా చెరుకు పండించడానికి సిద్ధంగా ఉన్నట్లు వారు కమిటీ ముందు స్పష్టంగా చెప్పారు. దీంతోపాటు ఫ్యాక్టరీని తెరిపించాలంటూ లక్ష సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కమిటీ పర్యటించి నాలుగు గడిచినా దానికి అతీగతీ లేకుండా పోయింది. ఆ తర్వాత 2021 నవంబరులో అప్పటి కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు రాసిన లేఖ ప్రభుత్వం అసలు ఉద్దేశాన్ని బట్టబయలు చేసింది.

పరిశ్రమకు సంబంధించి ఏవైనా న్యాయపరమైన చిక్కులు ఉన్నాయా?, పరిశ్రమను తెరవాలంటూ నిరంతరం ఆ ప్రాంతంలో ఉద్యమాలు ఏమైనా జరుగుతున్నాయా వంటి అంశాలపై తనిఖీ చేసి నివేదిక పంపాలంటూ లేఖలో పేర్కొన్నారు. అదేవిధంగా భూముల విలువ, పారిశ్రామిక, వాణిజ్య, నివాసయోగ్యం కేటగిరీల్లో వేటికి అనువుగా ఉంటాయో సరైన సూచనలు చేయాలంటూ కోరారు. కోర్టు కేసుల వివరాలు, భూముల విలువ వంటి అంశాలతో పాటు ప్రస్తుతానికి ఆ ప్రాంతంలో ఎటువంటి ఆందోళనలు జరగడం లేదంటూ ఆ నెలలోనే కలెక్టర్ నివేదిక పంపారు. సుగర్ ఫ్యాక్టరీని తెరిపించే ఉద్దేశం లేకే ప్రభుత్వం ఈ వివరాలన్నీ అడిగిందంటూ అప్పట్లో రైతుల్లో కొంత చర్చ సాగింది.

రెండు దశాబ్దాలుగా మోసపోతున్న రైతులు

సుగర్ ఫ్యాక్టరీ విషయంలో కాంగ్రెస్ పార్టీ కూడా తక్కువేమీ తినలేదు. పాదయాత్ర సందర్భంగా 2003లో ఈ ప్రాంతానికి వచ్చిన కీ.శే వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి తాము అధికారంలోకి వస్తే సుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామంటూ హామీనిచ్చారు. కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసిన బొడ్డేపల్లి సత్యవతిని ప్రజలు ఆదరించారు. ఆ తర్వాత ఓ సందర్భంలో వైఎస్ ఆ అంశాన్ని ప్రస్తావిస్తూ, పెళ్లి చేసి అత్తారింటికి పంపేసిన తర్వాత ఆడపిల్లను తిరిగి తెచ్చుకోవడం సాధ్యమవుతుందా అంటూ నాడు చెప్పిన మాటలతో తొలిసారి రైతులు మోసపోయారు. ఇక అక్కడ నుంచి పాలక పార్టీల వంచనకు గురవుతూనే ఉన్నారు.

ఈ నేపథ్యంలో సుగర్స్‌పై మరో ఉద్యమం చేపట్టడమే రైతుల ముందు ప్రత్యామ్నాయంగా ఉంది. ఆమదాలవలస సుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ కమిటీ 2007 నుంచి 2014 మధ్య కాలంలో పాదయాత్రలు, రిలే నిరాహార దీక్షలు వంటి రూపాల్లో నిరంతరం ఆ అంశాన్ని ప్రజల మధ్య చర్చగా ఉంచింది. ప్రధాన రాజకీయ పార్టీలు సైతం దీనిపై మాట్లాడాల్సి వచ్చింది. ఇదే అంశం ఎన్నికల అజెండాగా మారింది. 2014, 2019 ఎన్నికల్లో టిడిపి, వైసిపిలు ఇదే హామీతో నెగ్గాయి. రైతులు నాటి పోరాట స్ఫూర్తితో వచ్చే ఎన్నికల్లో సుగర్స్ అంశాన్ని ప్రధాన అజెండా మార్చాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అందుకు అందరూ అన్నదాతలకు అండగా నిలవాల్సిన తరుణం ఆసన్నమైంది.

పాలకొల్లులో తెలుగులో తీర్పు

- తెలుగు భాషాప్రియుల హర్షం



ప్రజాశక్తి - పాలకొల్లు

ప్రపంచ మాతృభాషా దినోత్సవం సందర్భంగా పాలకొల్లు ప్రధాన పౌర న్యాయమూర్తి (కనిష్ట విభాగం) అకా పవన్‌కుమార్ బుధవారం తెలుగులో తీర్పును వెల్లడించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి బుధవారం మాతృభాషా దినోత్సవం సందర్భంగా వాస్తవ దావా సంఖ్య 92/2018 లో తీర్పును వెల్లడించారు. పాలకొల్లు బార్ అసోసియేషన్ సభ్యులు, తెలుగు భాష ప్రియులు తెలుగులో తీర్పు పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఆదివాసీల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం

- గురుకుల, ఏకలవ్య పాఠశాలల్లోనే ఎఎన్‌ఎంలు
- గిరిజన సంక్షేమ పాఠశాలల్లో 90 శాతం మరణాలు

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన సంక్షేమ గురుకుల, ఏకలవ్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆరోగ్య సేవలు అందించడానికి ఎఎన్‌ఎంలను నియమించారు. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు ఏవైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్య సిబ్బంది అప్రమత్తమై సకాలంలో వైద్య సేవలు అందించే ప్రయత్నం చేస్తున్నారు. అదే గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆరోగ్య సమస్య వస్తే దిక్కూ దివానా లేని పరిస్థితి కనిపిస్తోంది. ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయుడో, వార్డెనో అనారోగ్యానికి గురైన విద్యార్థులను ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యసేవలు అందేలా చూడాలి. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణపై ఇంత తేడా కనబరచడం వివాదాస్పదమవుతోంది.

మన్యం జిల్లాలో పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్‌ఎంలను నియమించలేదు. గత ప్రభుత్వం హయాంలో 'ఆదివాసీ ఆరోగ్యం' అనే కార్యక్రమం కింద అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోనూ ఆరోగ్య కార్యకర్తలను నియమించారు. పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో 55 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, 16 పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఈ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఆరోగ్య కార్యకర్తల నియామకం చేపట్టారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్‌ఎంలను నియామకానికి నీళ్లొదిలింది. ఇప్పుడున్న గురుకుల, ఏకలవ్య పాఠశాలల్లో ఎఎన్‌ఎంలను నియమించారు. ఏకలవ్య పాఠశాలల్లో అయితే ఇద్దరు చొప్పున ఎఎన్‌ఎంలు పని చేస్తున్నారు. మూడు రకాల పాఠశాలల్లో చదువుతున్నది ఆదివాసీ గిరిజన విద్యార్థులే. వారి భోజనం, వసతి సౌకర్యాలల్లో స్పష్టమైన తేడా చూపిస్తున్న ప్రభుత్వం వారి ఆరోగ్య పరిరక్షణలోనూ వివక్ష చూపడం పట్ల ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రధానంగా మన్యం జిల్లాలో జరుగుతున్న విద్యార్థుల మరణాల్లో 90 శాతం పైగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న వారివే కావడం గమనార్హం. మారుమూల గిరిజన గ్రామాలకు చెందిన విద్యార్థులే ఎక్కువగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్నారు. ఈ ఏడాదిలో పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో జరిగిన విద్యార్థుల మరణాల్లో ఎక్కువ మంది ఆశ్రమ పాఠశాలలకు చెందిన విద్యార్థులే ఉన్నారు.

మరణాలను అడ్డుకోలేరా?

గతేడాదిలో పదోతరగతి పరీక్షా ఫలితాల్లో మన్యం జిల్లా రాష్ట్ర స్థాయిలో ఎక్కువ శాతం ఉత్తీర్ణత సాధించిన జిల్లాగా ఆవిర్భవించింది. ఈ ఘనత వెనుక తమ కృషి, పట్టుదల ఉందని మన్యం జిల్లా అధికారులు గొప్పలు చెప్పుకున్నారు. ఇప్పుడు విద్యార్థుల మరణాల్లోనూ జిల్లా దూసుకుపోతున్న పరిస్థితి కనిపిస్తోంది. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో మరణాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు దృష్టి సారించిన దాఖలాలు లేవు. చేతికంది వచ్చే పిల్లలు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతూ మృత్యువాత పడుతుండడంతో వారి తల్లిదండ్రులు గర్భశోకానికి గురవుతున్నారు. విద్యార్థుల మరణాలు లేని మన్యం జిల్లాగా పేరు తేవడానికి కృషి చేయాలని గిరిజన సంఘాలు కోరుతున్నాయి.

ఆరోగ్య కార్యకర్తలను నియమించాలి

గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న ఏకలవ్య, గురుకుల పాఠశాలల్లో ఎఎన్‌ఎంలను నియమించిన ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలల్లో ఎందుకు నియమించలేదని గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాడంగి సాయిబాబు, ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ ప్రశ్నించారు. మారుమూల గిరిజన ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఎక్కువగా ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్నారని, వివిధ అనారోగ్య కారణాలతో మరణాలు అక్కడే సంభవిస్తున్నాయని చెప్పారు. గత ప్రభుత్వం హయాంలో ఆదివాసీ ఆరోగ్యం కింద ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య కార్యకర్తలను నియమించిందని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా ఆరోగ్య కార్యకర్తలను నియమించాలని కోరారు.

అగ్రిల్యాబ్‌లతో తీరనున్న రైతుల కష్టాలు

- చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం (పశ్చిమగోదావరి జిల్లా)

ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లతో రైతుల కష్టాలు తీరనున్నాయని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. అన్నదాతలు నకిలీ విత్తనాలతో మోసపోకుండా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో ఒక ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ప్రభుత్వం నిర్మిస్తుందన్నారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలోని అగ్రికల్చర్ మార్కెట్ యార్డు ఆవరణలో రూ.1.22 లక్షలు నాబార్డు నిధులతో నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ముదునూరి ప్రసాదరాజు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాసిరకం ఇన్‌పుట్స్ బారిన పడకుండా ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. విత్తనాలే కాకుండా ఎరువులు, పురుగుమందులు, చేపలు, రొయ్యల చెరువులకు సంబంధించిన అన్ని రకాల టెస్టులను రైతులు ఉచితంగా పొందవచ్చన్నారు. దీనిద్వారా భూసార పరీక్షలు కూడా ఉచితంగా పొందవచ్చని తెలిపారు. ఈ ల్యాబ్‌లను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, జెడ్‌పిటిసిలు బొక్కా రాధాకృష్ణ, తిరుమాని బాపూజీ, ఎంపిపి మైలాబత్తుల సోనీ, వైస్ ఎంపిపి ఉంగరాల రమేష్‌నాయుడు, ఆత్మ కమిటీ ఛైర్మన్ కడలి రాంబాబు, ఎంపిటిసి దాయం వెంకట్రావు, పోలీస్ గృహనిర్మాణ సంస్థ డైరెక్టర్ పోలిశెట్టి గోపీనాథ్, జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్‌వివిఎస్.ప్రసాద్, వ్యవసాయశాఖ ఎడి ఈదా అనిల్‌కుమారి, ఎఒలు రాజశేఖర్, అబ్దుల్ రహీం, ఎఫ్‌డిఒలు ఏడుకొండలు, కొల్లాటి భారతి పాల్గొన్నారు.

మార్ష్, డేవిడ్ వీరవిహారం


తొలి టి20లో కివీస్‌పై ఆసీస్ గెలుపు



వెల్లింగ్టన్: మిఛెల్ మార్ష్, టిమ్ డేవిడ్ రాణించడంతో న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టి20లో ఆస్ట్రేలియా భారీ లక్ష్యాన్ని ఛేదించింది. వెల్లింగ్టన్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో మిచెల్ మార్ష్ సారథ్యంలోని ఆస్ట్రేలియా.. కివీస్ నిర్దేశించిన 216 పరుగుల భారీ లక్ష్యాన్ని ఆఖరి బంతికి ఛేదించింది. ఆ జట్టు సారథి మిచెల్ మార్ష్ కెప్టెన్సీ ఇన్నింగ్స్ (44 బంతుల్లో 72నాటౌట్, 2ఫోర్లు, 7సిక్సర్లు)కి తోడు మిడిలార్డర్ బ్యాటర్ టిమ్ డేవిడ్.. పది బంతుల్లోనే రెండు ఫోర్లు, మూడు భారీ సిక్సర్ల సాయంతో 31 పరుగులతో రాణించాడు. దీంతో ఆసీస్ ఆరు వికెట్ల తేడాతో తొలి టి20 ఘనవిజయం సాధించింది. అంతకుముందు టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 215 పరుగులు చేసింది. రచిన్ రవీంద్ర (35 బంతుల్లో 68, 2ఫోర్లు, 6సిక్సర్లు), డెవాన్ కాన్వే (46బంతుల్లో 63, 5ఫోర్లు, 2సిక్సర్లు), ఫిన్ అలెన్ (17బంతుల్లో 32, 2ఫోర్లు, 3సిక్సర్లు) రాణించడంతో ఆ జట్టు భారీస్కోర్ చేసింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మిఛెల్ మార్ష్‌కు లభించగా.. మూడు టి20ల సిరీస్‌లో ఆస్ట్రేలియా 1-0 ఆధిక్యతలో నిలిచింది. రెండో టి20 అక్లాండ్ వేదికగా శుక్రవారం జరగనుంది.

టి.నర్సాపురానికి రైల్వే కూత..!

- మండలం మీదుగా రైల్వేలైన్‌కు ఆ శాఖ గ్రీన్‌సిగ్నల్
- మెట్ట ప్రాంతంలో జోరుగా చర్చ
- ఇప్పటికే నిర్మాణంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే
- టి.నరసాపురం కేంద్రంగా నేవీ లోడింగ్ పాయింట్
- అన్ని రకాల అభివృద్ధికి అవకాశం



ప్రజాశక్తి - టి.నరసాపురం (ఏలూరు జిల్లా)

ఏలూరు జిల్లా టి.నరసాపురం మండలంలో భవిష్యత్తులో రైలు కూత విన్పించనుంది. అటు హైదరాబాద్, ఇటు వైజాగ్ తదితర ప్రాంతాలకు రవాణా సౌకర్యం విస్తరించనుంది. మండల ప్రజలు ఎవరూ ఊహించని విధంగా జిల్లాలో కొవ్వూరు నుండి జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, అశ్వారావుపేట మీదుగా భద్రాచలం వెళ్లాల్సిన రైల్వేలైన్ కొవ్వూరు నుండి జంగారెడ్డిగూడెం మండలం పుట్లగట్లగూడెం మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే వెంబడి మండలానికి రాబోతుంది. దక్షిణమధ్య రైల్వే అధికారులు మండలం మీదుగా రైల్వేలైన్ ఏర్పాటుకు పచ్చజెండా ఊపినట్లు సమాచారం. దీనిపై జిల్లాలో, ప్రధానంగా మెట్టప్రాంతంలో ఇప్పటికే పెద్దఎత్తున చర్చ సాగుతోంది. జిల్లాలో మారుమూల ప్రాంతంగా ఉన్న టి.నరసాపురం మండలానికి రైల్వేలైన్ రావడం హర్షణీయమని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మండలం మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇదే క్రమంలో మరో సౌకర్యవంతమైన ప్రయాణ, రవాణా సౌకర్యం రైల్వేలైన్‌తో ఏర్పడుతుందని పలువురు చెబుతున్నారు.

కొవ్వూరు-భద్రాచలం రోడ్ రైల్వే లైన్ నిర్మాణానికి దక్షిణమధ్య రైల్వే పచ్చ జెండా ఊపిందని తెలుస్తోంది. ఏప్రిల్ 1న సత్తుపల్లిలో ఈ పనులకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించేందుకు రైల్వే అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే అప్పటికి ఎన్నికల కోడ్ రానుండటంతో ఈ ప్రచారంపైనా పలు అనుమానాలు నెలకొన్నాయి. అయితే దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ నేతృత్వంలో ఈ లైన్ నిర్మాణ పనులకు సాగుతున్నాయని, 2030 మార్చి నాటికి 151 కిలోమీటర్ల రైల్వేట్రాక్ నిర్మాణమే లక్ష్యంగా చర్యలు చేపట్టినట్లు చెబుతున్నారు. దీనికిగాను రూ.2154 కోట్లు ఖర్చవుతుందని అంచనా వ్యయం రూపొందించినట్లు సమాచారం. దీనికి రైల్వే మంత్రిత్వ శాఖ నుంచి అవసరమైన అనుమతులు కూడా వచ్చాయని ప్రచారం సాగుతోంది. ఇదే జరిగితే హైదరాబాద్-రాజమండ్రి మధ్య రాకపోకలు సాగించేవారికి మరింత సులభ రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఈ మార్గం అందుబాటులోకి వస్తే సుమారు 75 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని అధికారుల అంచనా. రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వర రావుతోపాటు పలువురు ఎంపీలు పలుమార్లు రైల్వే ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం రైల్వే లైన్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చిందని చెబుతున్నారు.

1960లో జీలుగుమిల్లి మండలం మీదుగా లైన్ ఏర్పాటుకు సర్వే

భద్రాచలం రోడ్-కొవ్వూరు రైల్వే లైన్ ఏర్పాటుకు 1960లోనే తొలి సర్వే జరిగింది. అప్పటి అవసరాలు, గిరిజన ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని అనేక ప్రతిపాదనలు చేశారు. కొత్తగూడెం (భద్రాచలం రోడ్) స్టేషన్ నుంచి సత్తుపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం మండలాల్లోని ఏజెన్సీ గ్రామాలతోపాటు, కొయ్యలగూడెం మండలం రాజవరం, పొంగుటూరు మీదుగా కొవ్వూరు వరకూ ఈ లైన్ నిర్మించాలని నాటి సర్వే సాగింది.

తర్వాత పలు దఫాలు సర్వేలు సాగినా అవేమీ కార్యరూపం దాల్చలేదు. అయితే 2004 తరువాత సత్తుపల్లి ప్రాంతంలో బొగ్గు తవ్వకాలు ప్రారంభం కావడంతో తెలంగాణ ప్రభుత్వం కొత్తగూడెం-సత్తుపల్లి మధ్య బొగ్గు తరలించేందుకు రైల్వేలైన్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. కాస్ట్ షేరింగ్ పద్ధతిలో సింగరేణి యాజమాన్యం రూ.706 కోట్ల ఖర్చు భరించగా, రైల్వే శాఖ రూ.85 కోట్లు వెచ్చించి ట్రాక్ ఏర్పాటు చేశారు. దీంతో సత్తుపల్లికి రైళ్ల రాకపోకలు మొదలయ్యాయి. ఇక కొవ్వూరు- సత్తుపల్లికి మధ్య రైల్వే లైన్ నిర్మాణానికి డిమాండ్ ఉండటంతో ఖమ్మం- దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే వెంబడి కొత్త రైల్వే లైన్ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. దీంతో మండలంలోని బొర్రంపాలెం, టి.నరసాపురం గ్రామాల మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే పక్కన లైన్ ఏర్పాటుకు ప్రణాళికలు చేపట్టినట్లు తెలుస్తోంది.



సిపిఎం సీనియర్ నాయకులు రాంచంద్రరావు కన్నుమూత

- నేడు అంత్యక్రియలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం సీనియర్ నాయకులు మాటూరు రాంచంద్రరావు (76) ఖమ్మం శ్రీనివాసనగర్‌లోని తన స్వగృహంలో బుధవారం తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న పలువురు ప్రముఖులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఖమ్మం మాజీ ఎమ్మెల్యే, సిపిఎం సీనియర్ నేత మంచికంటి రాంకిషన్ రావుకు రాంచంద్రరావు స్వయాన మేనల్లుడు. ఆయన స్ఫూర్తితోనే కమ్యూనిస్టు ఉద్యమంలోకి వచ్చారు. ఖమ్మం జిల్లా మధిర మండలం మాటూరు పేటలో పుట్టిన ఆయన.. పార్టీ పిలుపు మేరకు ఖమ్మం వచ్చి స్థిరపడ్డారు. 1965లో ఆయన పార్టీ సభ్యులుగా చేరారు. ఆయన తండ్రి నాగభూషణ రావు ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శిగా పనిచేశారు. స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఎస్ఎఫ్) వ్యవస్థాపక నాయకుల్లో ఒకరైన రాంచంద్రరావు.. అటు తరువాత ఎస్ఎఫ్ఐగా రూపాంతరంలోను వ్యవస్థాపక నాయకులుగా ఉంటూ 1973లో సిపిఎం పూర్తి కాలం కార్యకర్తగా చేరారు. 1976 ఎమర్జెన్సీ కాలంలో, తరువాత, జైలు జీవితం గడిపారు. ఎమర్జెన్సీ కాలంలో కేంద్ర, రాష్ట్ర నాయకత్వానికి కొరియర్‌గా పనిచేశారు. రహస్య జీవితం గడిపారు. ఆయన అంత్యక్రియలు గురువారం ఖమ్మంలో జరగనున్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఎస్ఎఫ్ఐ ఉమ్మడి రాష్ట్ర కమిటీ తొలి కార్యదర్శి, మాజీ ఎంపి పి.మధు, సిపిఎం నాయకులు ఎం. సుబ్బారావు, బాబురావు, సిఐటియు ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణ్ వెంకటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు ఎస్కె మేరా సాహెబ్ తదితరులు సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంభ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బీహార్‌లో ఘోర ప్రమాదం

- 9 మంది మృతి

పట్నా (బీహార్) : బీహార్‌లో బుధవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 9 మంది చనిపోయారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. లఖిసరాయ్ పట్టణం సమీపంలోని ఝూల్నా గ్రామం వద్ద బుధవారం తెల్లవారుజామున ఆటోరిక్షాను లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారిని పట్నాలోని సర్దార్ హాస్పిటల్‌కు తరలించామన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో ఆటోరిక్షాలో 14 మంది ఉన్నట్లు తెలిపారు. అతివేగం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధరణకు వచ్చారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహా పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు.

గెలుపు కోసం ఏదైనా చేస్తారు !

- బిజెపిపై కేజ్రీవాల్ మండిపాటు

న్యూఢిల్లీ : ఛండీగఢ్ మేయర్ ఎన్నిక ఫలితాన్ని సుప్రీం రద్దు చేయడాన్ని ప్రస్తావిస్తూ, ఎన్నికల్లో గెలవడం కోసం బిజెపి ఏదైనా చేస్తుందని ముఖ్యమంత్రి, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. ఎంఎల్ఎలను ఎర వేసి పట్టుకుని, ప్రభుత్వాలను బహిరంగంగానే కూల్చివేయడం వంటి చర్యలకు పాల్పడిందని విమర్శించారు. 'భగవంతుడు జోక్యం చేసుకుని, కాషాయ పార్టీ పాల్పడిన అధర్మానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని నిర్ణయించాడు' అని ఆయన వ్యాఖ్యానించారు. ఛండీగఢ్ మేయర్ ఎన్నికలపై సుప్రీం తీర్పును ప్రశంసిస్తూ ఆయన కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ తీర్పు దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడిందని అన్నారు. పంజాబ్, హర్యానా సరిహద్దుల్లో సాగుతున్న రైతాంగం ఆందోళనలను ప్రస్తావిస్తూ, ఢిల్లీకి రావడానికి రైతులను అనుమతించకుండా బిజెపి అడ్డుపడుతోందన్నారు. వారు పండించే పంటలకు సరైన ధర చెల్లించకపోగా, వారు చెప్పేవి వినడం కూడా లేదని విమర్శించారు.

26న విచారణకు హాజరవ్వండి

- ఢిల్లీ మద్యం కుంభకోణంలో...
- కవితకు సిబిఐ నోటీసులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణంలో దర్యాప్తు సంస్థ నుంచి బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు మరోసారి పిలుపు అందింది. ఈనెల 26 (సోమవారం) తమ ముందు హాజరుకావాలని కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) సమన్లు జారీ చేసింది. ఢిల్లీ నుంచి నేరుగా హైదరాబాద్ లోని ఆమె ఇంటి అడ్రస్ కు ఈ నోటీసులు అందినట్లు తెలిసింది. అలాగే మెయిల్ ద్వారా కూడా మరో సెట్ నోటీసులు అందించినట్లు సమాచారం. అయితే ఏ సెక్షన్ కింద కవితకు సిబిఐ నోటీసులు పంపిదనేది తెలియాల్సి ఉంది.

కాగా 2022, జూలై తరువాత మద్యం కుంభకోణం బహిర్గతం కాగా... దాదాపు ఐదు నెలల తరువాత డిసెంబర్ లో తొలిసారి సిబిఐ కవితకు నోటీసులు జారీ చేసింది. అనంతరం ఇప్పుడు దాదాపు మరో ఏడాది తరువాత తాజా సమన్లు ఇచ్చింది. అయితే సిబిఐ, ఎన్‌ఫోర్సమెంట్ డైరెక్టరేట్ (ఇడి) సంస్థలు ఈ కుంభకోణం విచారణ చేస్తున్న సంగతి విదితమే.

బెంగాల్‌లో మితిమీరుతున్న తృణమూల్ ఆగడాలు

- ఎప్పుడు ఏం జరుగుతుందో తెలీదు
- బృందా కరత్ వద్ద సందేశ్‌ఖాలి బాధితుల మొర



సందేశ్‌ఖాలి బాధితులతో మాట్లాడుతున్న బృందా కరత్

కొల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్ ఆగడాలు మితిమీరిపోతున్నాయి. గూండాలే రాజ్యమేలుతున్నారా అన్నంతగా పరిస్థితులు దిగజారిపోయాయి. సందేశ్‌ఖాలి ప్రాంతంలో ఇటీవల చోటుచేసుకున్న ఘటనలు ఇందుకు తాజా ఉదాహరణ. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ నేతృత్వంలోని బృందం బుధవారం బాధితులను పరామర్శించి భరోసా కల్పించింది. ఈ సందర్భంగా బాధిత ప్రజలు సిపిఎం బృందంతో తమ ఆందోళనను వ్యక్తం చేశారు. 'తృణమూల్ కాంగ్రెస్ గూండాలకు వ్యతిరేకంగా పెదవి విప్పితే రాష్ట్ర ప్రభుత్వం మాపై కన్నెర్ర చేస్తోంది. మాకు తీవ్ర స్థాయిలో బెదిరింపులు వస్తున్నాయి. మాకు ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియడం లేదు. కానీ మేము కోరుకుంటున్నది ఒక్కటే. రౌడీ షీటర్లు అయిన తృణమూల్ నేతలు ఎస్‌కే షాజహాన్, ఉత్తమ్ సర్దార్, షిబు హజ్రాలకు బెయిల్ రాకూడదు' అని తపయ్ సర్దార్ అనే మహిళ రోదిస్తూ సిపిఎం బృందానికి తన గోడు వెళ్లబోసుకుంది. ఈ బృందంలో బృందాకరత్‌తో పాటు ఐద్వా రాష్ట్ర కార్యదర్శి కనికిన ఘోష్, రాష్ట్ర అధ్యక్షురాలు జహనారా ఖాన్, మాజీ మంత్రి రేఖా గోస్వామి తదితరులున్నారు. నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయంటూ పోలీసులు తొలుత ఐద్వా బృందాన్ని నిలువరించారు. అయితే సందేశ్‌ఖాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేధాజ్ఞలు విధించాలన్న నిర్ణయాన్ని కలకత్తా హైకోర్టు ఇప్పటికే కొట్టివేసింది. ధమ్‌ఖాలీ ఫెర్రీ ఘాట్ వద్ద రెండు గంటల పాటు వేచిచూసిన తర్వాత ఐద్వా బృందాన్ని పోలీసులు అనుమతించారు. పర్యటన అనంతరం బృందా కరత్ మాట్లాడుతూ బాధిత మహిళలు తాము ఎదుర్కొన్న వేధింపులను వివరించారని చెప్పారు.

తృణమూల్ మూకలు తన కుమార్తెను అపహరించారని, ఆరు రోజులైనా ఆమె జాడ తెలియడం లేదని అపర్ణా దాస్ తెలిపారు. కాముకులకు మరణశిక్ష విధించాలని తాము కోరుకుంటున్నామని పలువురు మహిళలు ఐద్వా బృందానికి తెలియజేశారు. లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వ హయాంలో తమకు భూ పట్టాలు ఇచ్చారని, అయితే ఇప్పుడు తృణమూల్ గూండాలు భయోత్పాతాన్ని సృష్టించి తమ భూములను కబ్జా చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నోరు విప్పితే చంపేస్తామని బెదిరించారని చెప్పారు. వేధింపుల విషయంలో యూపీ పోలీసులకు, బెంగాల్ పోలీసులకు తేడా లేదని ఈ సందర్భంగా బృందా కరత్ వ్యాఖ్యానించారు. దోషులను వెంటనే అరెస్ట్ చేసి, వారిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

ఉత్తర 24 పరగణాల జిల్లాలోని సందేశ్‌ఖానీ ప్రాంతం గత నెల రోజులుగా అట్టుడికిపోతోంది. రాష్ట్రంలో చోటుచేసుకున్న రేషన్ కుంభకోణంపై విచారణ జరపడానికి వచ్చిన ఈడీ అధికారులపై తృణమూల్ మూకలు దాడి చేసి తీవ్రంగా కొట్టిన విషయం తెలిసిందే. అప్పటి నుండి ఆ ప్రాంతంలో ఉద్రిక్తత కొనసాగుతోంది.

కొందరు స్థానిక తృణమూల్ నాయకులు కండబలంతో తమను లైంగికంగా వేధిస్తున్నారంటూ ఆ ప్రాంతానికి చెందిన మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక తృణమూల్ నాయకుడు షాజహాన్ షేక్‌ను అరెస్ట్ చేసేందుకు ఈడీ అధికారులు వెళ్లగా వారిని తీవ్రంగా కొట్టి హింసించారంటూ మీడియాలో వార్తలు వచ్చాయి. ఆ తర్వాత మహిళలు తృణమూల్ నేతల అరాచకంపై గళం విప్పడం ప్రారంభించారు. మరోవైపు వేధింపులకు పాల్పడిన వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామస్తులు వారి దుకాణాలపై దాడి చేసి ధ్వంసం చేశారు. కాగా సందేశ్‌ఖాలి సందర్శించిన రాష్ట్ర గవర్నర్ సివి ఆనంద బోస్ కూడా బాధితులతో ముచ్చటించారు.

బిజెపి ఎంపీల కార్యాలయాలు, నివాసాల వద్ద ఎస్‌కెఎం ఆందోళన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



హర్యానాలోని పానీపత్ సిటీ బిజెపి ఎంపి ప్రమోద్‌కుమార్ విజ్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

కేంద్ర ప్రభుత్వం 2020లో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బుధవారం బిజెపి, దాని నేతృత్వంలోని ఎన్‌డిఎ భాగస్వామ్య పార్టీలకు చెందిన ఎంపిలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ఆధ్వర్యంలో రైతులు ఆందోళనలు చేపట్టారు. ఉత్తరప్రదేశ్, హిమాచల్, హర్యానా, పంజాబ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో బిజెపి ఎంపీల కార్యాలయాలు, నివాసాల వద్ద చేపట్టిన ఆందోళనల్లో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పలుచోట్ల బిజెపి నేతల దిష్టి బొమ్మలను దగ్ధం చేశారు. అన్ని పంటలకు చట్టపరమైన కనీస మద్దతు ధర డిమాండ్‌పై రైతుల ఆందోళన తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో గురువారం ఢిల్లీలో జరగనున్న సంయుక్త కిసాన్ మోర్చా సమావేశం కీలక నిర్ణయాలు తీసుకోనుంది. 2020లో చారిత్రాత్మక రైతుల పోరాటానికి నాయకత్వం వహించిన ఎస్‌కెఎం, ప్రస్తుత రైతుల ఆందోళనలపై సమీక్షించి తదుపరి ఉద్యమ కార్యచరణను రూపొందించనుంది. దేశవ్యాప్తంగా రైతులంతా ఐక్య వేదికగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని ఎస్‌కెఎం పేర్కొంది. హర్యానా-పంజాబ్ సరిహద్దులో రైతులపై పోలీసుల దాడి, కనౌరిలో యువ రైతు హత్యపై ఎస్‌కెఎం తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. పోలీసు చర్యలను ఖండించింది. దేశవ్యాప్తంగా ఆందోళనకు పిలుపు ఇచ్చింది.

'మోడీ రామరాజ్యం'లో అణగారిన ప్రజలకు ఉద్యోగాల్లేవు !

- రాహుల్ విమర్శ

కాన్పూర్ : జనాభాలో 90 శాతంగా వున్న దళితులు, ఇతర వెనుకబడిన వర్గాలకు తగినన్ని ఉద్యోగాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సృష్టించడం లేదని కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ బుధవారం విమర్శించారు. రామరాజ్యంగా చెప్పుకునే మోడీ ప్రభుత్వ హయాంలోనే వారి పట్ల వివక్ష కనబడుతోందన్నారు. 'ఇదేమీ రామరాజ్యం? వెనుకబడిన వర్గాలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు వీరికెవరికీ ఉద్యోగాల్లేవు.' అని ఆయన భారత్ జోడో న్యాయ యాత్ర సందర్భంగా జరిగిన బహిరంగ సభలో విమర్శించారు. 'దేశంలో 50శాతం జనాభా వెనుకబడిన వర్గాలు. 15 శాతం దళితులు, 8 శాతం గిరిజనులు, 15 శాతం మైనారిటీలు. మీరెంత అరిచి గీ పెట్టినా మీకు ఈ దేశంలో ఉపాధి దొరకదు. మీకు ఉద్యోగాలు రావాలని మోడీ కోరుకోవడం లేదు.' అని రాహుల్ విమర్శించారు. మీడియాలో కానీ, బడా పరిశ్రమల్లో కానీ వెనుకబడిన వర్గాలవారెవరూ లేరని, అధికార యంత్రాంగంలోనూ అదే పరిస్థితి నెలకొందన్నారు. ఇటీవల జరిగిన రాముని ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో ఎంతమంది దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల వారు వున్నారు. గిరిజనురాలైన రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆహ్వానించలేదు. దళితుడైన మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ కోవిండ్‌ను లోపలకు అనుమతించలేదని రాహుల్ గుర్తు చేశారు.

కదం తొక్కిన స్పానిష్ రైతులు

- మాడ్రిడ్‌లో ట్రాక్టర్లతో పరేడ్



మాడ్రిడ్: వ్యవసాయ రంగంలో యూరోపియన్ యూనియన్ చేపట్టిన వినాశకర విధానాలకు వ్యతిరేకంగా స్పెయిన్‌లో రైతులు గత కొన్ని రోజులుగా సాగిస్తున్న పోరాటం బుధవారం పతాకస్థాయికి చేరుకుంది. వివిధ రైతుల సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఫిబ్రవరి21న రాజధాని మాడ్రిడ్‌ను రైతులు ముట్టడించారు. దేశ నలుమూలల నుంచి కాలి నడకన, ట్రాక్టర్ల ద్వారా బుధవారం చేరుకున్న రైతులు రాజధాని మాడ్రిడ్‌లోని సెంట్రల్ ఇండిపెండెన్స్ స్క్వేర్ నుంచి వ్యవసాయ మంత్రిత్వ శాఖ కార్యాలయం వరకు భారీ పరేడ్ నిర్వహించారు. ఐదు వరుసల్లో ట్రాక్టర్లు ఈ పరేడ్‌లో పాల్గొన్నాయి. పసుపు రంగు దుస్తులు ధరించిన ఆందోళనకారులు స్పానిష్ పతాకాలు చేబూని, ఆవు గంటలను మోగించారు. రాజధాని వీధులన్నీ ఆందోళనకారులతో నిండిపోయాయి. ప్రభుత్వం అడుగడుగునా ఆంక్షలు విధించింది. రాజధానిలోకి 500 ట్రాక్టర్లను మాత్రమే అనుమతిస్తామని చెప్పింది. రాజధాని శివార్లలోనే చాలా ట్రాక్టర్లను పోలీసులు నిలిపేశారు. దీంతో రైతులు కాలినడకన రాజధానిలో ప్రవేశించారు. బార్సిలోనా, జరాగోజా, కెటాలినా తదితర ప్రాంతాల నుంచి వేలాది ట్రాక్టర్లతో రైతులు తరలివచ్చారు. వీరిని పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. విపరీతంగా పెరిగిపోయిన వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులను తగ్గించాలని, పర్యావరణ అనుకూల విధానాల పేరుతో పురుగు మందులు, ఇతర రసాయనిక ఎరువుల వాడకంపై పెట్టిన ఆంక్షలు సడలించాలని, తీవ్ర కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్న రైతాంగానికి పరిహారం చెల్లించాలని వారు నినదించారు. వ్యవసాయ రంగానికి సాయం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, రైతులకు ప్రోత్సాహక ధరలు కావాలని ద్రాక్ష రైతు లూసియా రిసెనో డిమాండ్ చేశారు. గతంలో ఎంత ఖర్చు పెట్టానో ఇప్పుడూ అంతే పెడుతున్నా అందులో సగం మొత్తం కూడా ఇప్పుడు రావడంల లేదని ఆమె వాపోయారు. తమ సమస్యలను పరిష్కరించాలని ఎంతో కాలంగా కోరుతున్నా ప్రభుత్వం పెడచెవిన పెట్టడంతో రైతు సంఘాలు ఈ నిరసనలకు పిలుపునిచ్చాయి. ఉద్యమిస్తున్న రైతు సంఘాల ప్రతినిధి బృందాన్ని ప్రభుత్వం చర్చలకు పిలిచింది. ఇదే తరహా ఆందోళనలు గ్రీస్, ఫ్రాన్స్, పోలండ్ వంటి ఇతర యూరపు దేశాల్లో ఇటీవల తలెత్తిన సంగతి తెలిసిందే.



అక్రమం, రాజకీయ దురుద్దేశపూరితం

- అసాంజె అప్పగింత ప్రయత్నాలపై లండన్ హైకోర్టులో లీగల్ టీమ్ వాదనలు

లండన్ : వికీలీక్స్ వ్యవస్థాపకుడు, జర్నలిస్ట్ జూలియన్ అసాంజెను అమెరికాకు అప్పగించడానికి జరుగుతున్న యత్నాలు అక్రమమని, రాజకీయ దురుద్దేశంతో కూడినవని లండన్ హైకోర్టులో విచారణ సందర్భంగా అసాంజె తరపు లీగల్ టీమ్ వ్యాఖ్యానించింది. ఈ కేసులో తుది విచారణ మంగళవారం ఆరంభమైంది. అయితే ఆరోగ్యం సహకరించకపోవడంతో అసాంజె కోర్టుకు హాజరు కాలేకపోయారు. కనీసం వీడియో లింక్ ద్వారా కూడా పాల్గొనలేకపోయారు. ఆయన ఆరోగ్యంపై సన్నిహితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసాంజెను అమెరికాకు అప్పగించడానికి అధికారికంగా ఆమోదించిన బ్రిటన్ మాజీ హోం మంత్రి ప్రీతి పటేల్ అమెరికాలో ఆయనకు మరణశిక్ష విధించబోరని హామీ ఇవ్వడంలో విఫలమయ్యారని అసాంజె తరపున న్యాయస్థానంలో లీగల్ టీమ్ లీడర్ ఎడ్వర్డ్ ఫిట్జ్‌గెరాల్డ్ వాదించారు.

బ్రిటన్, అమెరికా మధ్య వున్న ఖైదీల అప్పగింత ఒప్పందం నిబంధనల మేరకు రాజకీయ కారణాలతో అప్పగింత అవకాశాలను ఆయన తోసిపుచ్చారు. శతాబ్దాల తరబడి అమల్లో వున్న చట్టపరమైన రక్షణలపైనే ఈ అప్పగింత ఆధారపడి వుందన్నారు. తనను అప్పగించవద్దంటూ అసాంజె పెట్టుకున్న పిటిషన్‌పై లండన్‌లోని రాయల్ కోర్ట్స్ ఆఫ్ జస్టిస్‌లో రెండు రోజుల విచారణ మంగళవారం ఆరంభమైంది. ఈ పిటిషన్‌పై విచారణలో ఆయనకు అనుకూలంగా తీర్పు రాకపోతే అమెరికాలో గూఢచర్యం చట్టం కింద అసాంజె 17 అభియోగాలను, కంప్యూటర్ హ్యాకింగ్ అభియోగాన్ని ఎదుర్కొనాల్సి వుంటుంది. 175ఏళ్ళ పాటు జైలు శిక్ష విధించే అవకాశాలు కూడా వున్నాయి. ఈ వారంలో విచారణ పూర్తయితే ఈ ఏడాది చివరిలో పూర్తి స్థాయి అప్పీల్‌పై విచారణ జరుగుతుంది.

గాజాలో కాల్పుల విరమణకు లేబర్ పార్టీ సానుకూలత

- కాల్పుల విరమణకు అంగీకరించకుంటే ఎన్నికల్లో తిరస్కరిస్తామన్న నినాదాలు, నిరసనల ఫలితం

లండన్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ ఊచకోతను అధికార కన్సర్వేటివ్స్‌తో కలసి గుడ్డిగా వెనకేసుకొచ్చిన స్టార్మర్ నేతృత్వంలోని బ్రిటన్ లేబర్ పార్టీ తన వైఖరిని ఇప్పుడు సవరించుకుంది. గాజాలో 'మానవతా కాల్పుల విరమణ' తక్షణమే పాటించాలని కోరింది. గాజాలో కాల్పుల విరమణకు సంబంధించిన తీర్మానం పార్లమెంటులో చర్చకు రావడానికి ముందే ఈ మేరకు ఒక సవరణను లేబర్ పార్టీ ప్రతిపాదించింది. జెరిమి కార్బిన్ వంటి లెఫ్ట్ అనుకూల నేతలు, ఎంపీలు కొందరు లేబర్ పార్టీ వైఖరిని తీవ్రంగా విమర్శించారు. అయినా స్టార్మర్ మొండిగా ఇజ్రాయిల్ అనుకూల వైఖరిని కొనసాగిస్తూ వచ్చారు. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాల్పుల విరమణకు మద్దతు ఇవ్వని పార్టీలను వచ్చే ఎన్నికల్లో ఓడిస్తాం అంటూ అతి పెద్ద నిరసన ర్యాలీ ఇటీవల లండన్‌లో జరిగిన నేపథ్యంలో లేబరు పార్టీ తన వైఖరిని మార్చుకోక తప్పలేదు. అలాగే పార్టీలోపల నుంచి కూడా పాలస్తీనాకు సంఘీభావం వ్యక్తమవుతోంది. ఇజ్రాయిల్ తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించాలని, అన్ని పక్షాలు పోరాటాన్ని ఆపు చేయాలని కోరుతున్న తీర్మానానికి బ్రిటన్ ప్రతినిధుల సభలో లేబర్ పార్టీ మద్దతు పలకనుంది. ఇంతకుముందు గాజా కాల్పుల విరమణపై జరిగిన ఓటింగ్‌కు లేబర్ ఎంపీలు నాలుగోవంతు మంది కన్నా ఎక్కువమందే గైర్హాజరయ్యారు. దీంతో వారికి వారి నియోజకవర్గాల్లోని ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. వారిలో కొందరికి ఎన్నికల్లో పరాజయం భయం కూడా పట్టుకుంది. కాగా ఆ సవరణను 'అస్పష్టమైన, అసందిగ్ధమైన పదాలు' గా వామపక్ష ఎంపి దియానె అబోట్ వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్‌తో పొత్తు కొనసాగుతుంది

- రాహుల్‌తో విభేదాలు లేవు
- సమాజ్‌వాదీ నేత అఖిలేష్ యాదవ్



లక్నో : రాబోయే లోక్‌సభ ఎన్నికల కోసం ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంటామని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ స్పష్టం చేశారు. పొత్తుపై కాంగ్రెస్‌తో విభేదాలు తలెత్తాయంటూ వచ్చిన వార్తలను తోసిపుచ్చారు. అంతా బాగానే ఉన్నదని, బాగానే ముగుస్తుందని ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీతో ఎలాంటి విభేదాలు లేవని అన్నారు. పొత్తుకు సంబంధించి అన్ని విషయాలూ త్వరలోనే స్పష్టమవుతాయని ఆయన చెప్పారు. సీట్ల సర్దుబాటుపై ఒప్పందం కుదిరితేనే రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్రలో అఖిలేష్ భాగస్వామి అవుతారంటూ సమాజ్‌వాదీ పార్టీ కొద్ది రోజుల క్రితం ప్రకటించిన విషయం తెలిసిందే.

అమేథీలో సోమవారం జరిగిన రాహుల్ యాత్రకు అఖిలేష్ హాజరు కాలేదు. ఆ తర్వాత సమాజ్‌వాదీ పార్టీ ఏకపక్షంగా మరో 11 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. రాష్ట్రంలో 80 లోక్‌సభ స్థానాలు ఉండగా ఇప్పటి వరకూ ఆ పార్టీ 31 మంది అభ్యర్థులను ఖరారు చేసింది. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు ఒప్పందం కుదిరిందని, దీని ప్రకారం కాంగ్రెస్ పార్టీ 17-19 స్థానాల్లో పోటీ చేస్తుందని వార్తలు వస్తున్నాయి. కాంగ్రెస్ పోటీ పడే స్థానాల్లో వారణాసి, రాయబరేలి, అమేథి, బారాబంకి, ఝాన్సీ, ఘజియాబాద్ ఉన్నాయి. కాగా రెండు పార్టీలు త్వరలోనే విలేకరుల సమావేశాన్ని ఏర్పాటుచేసి పొత్తుపై ప్రకటన చేసే అవకాశం ఉంది. అఖిలేష్‌తో ప్రియాంక మాట్లాడారని, దీంతో రెండు పార్టీల మధ్య ప్రతిష్టంభన తొలగిపోయిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

మొరాదాబాద్ సీటుపై తొలుత పట్టుబట్టిన కాంగ్రెస్ ఆ తర్వాత దానిని వదులుకొని సీతాపూర్ స్థానాన్ని కోరింది. వారణాసి స్థానానికి సమాజ్‌వాదీ పార్టీ ఇప్పటికే అభ్యర్థిని ప్రకటించగా ఆ స్థానాన్ని తనకు వదిలేయాలని కాంగ్రెస్ కోరుతోంది.

న్యాయ కోవిదుడు ఫాలి నారిమన్ కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

ఫేడ్స్, ది స్టేట్ ఆఫ్ ది నేషన్ వాటిలో కొన్ని. ఆయనకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు రోహింగ్టన్ నారిమన్ సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి.

మయన్మార్‌లోని రంగూన్‌లో 1929 జనవరి 10న ఫాలి నారిమన్ జన్మించారు. సిమ్లా, ముంబయిలో విద్యాభ్యాసం చేశారు. 1955లో బాప్సీని వివాహం చేసుకున్నారు. నారిమన్ అనేక ప్రతిష్టాత్మక కేసుల్లో వాదించారు. భోపాల్ గ్యాస్ దుర్ఘటన కేసులో యూనియన్ కార్బైడ్ తరపున వాదించారు. ఆ తర్వాత తప్పు తెలుసుకొని బాధితులు, కంపెనీ మధ్య నష్టపరిహారం విషయంలో ఒప్పందం కుదిరేలా చూశారు. ఆర్టికల్ 370పై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆయన తప్పుపట్టారు.

ప్రధాని మోడీ ప్రభృతుల సంతాపం

నారిమన్ మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి ప్రభృతులు సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అత్యుత్తమ న్యాయకోవిదుల్లో నారిమన్ ఒకరని ప్రధాని మోడీ కొనియాడారు. సామాన్యులకు న్యాయం అందించడానికి ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని ప్రశంసించారు. నారిమన్ మేధో సంపద అపారమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. పార్లమెంట్‌లో సహచరుడుగా నారిమన్ తనకు మంచి మిత్రుడని, మంచి హాస్య చతురత కలిగిన గొప్ప న్యాయకోవిదుడని ఏచూరి కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియచేశారు.

రాజ్యాంగం పవిత్రతను కాపాడే విషయంలో అనేక మంది న్యాయ నిపుణులకు నారిమన్ స్ఫూర్తినిచ్చారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. నారిమన్ మరణం న్యాయ వ్యవస్థకు తీరని లోటని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. నారిమన్ మరణంతో ఓ యుగం ముగిసిందని సుప్రీంకోర్టు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వ్యాఖ్యానించారు. దేశం గొప్ప న్యాయవాదిని కోల్పోయిందని సుప్రీంకోర్టుకే చెందిన మరో న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబాల్ చెప్పారు. సీనియర్ న్యాయవాదులు ఇందిరా జైసింగ్, ప్రశాంత్ భూషణ్ తదితరులు నారిమన్ మృతికి సంతాపం తెలియజేశారు.

రైతులపై ఘాతుకం

(మొదటి పేజీ తరువాయి)

బుల్డోజర్లు ఖాళీ చేయించకపోతే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఐదో దఫా చర్చలకు ప్రభుత్వం పిలుపు

ఐదో విడత చర్చలకు రైతులను పిలిచామని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి అర్జున్ ముండా చెప్పారు. కనీస మద్దతు ధర, పంట మార్పిడి, వ్యర్థాల దహనంపై రైతులతో చర్చకు సిద్ధమని అన్నారు. ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేస్తోందని రైతు సంఘాల నేతలు మండిపడ్డారు. తమ డిమాండ్‌లకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించేవరకు ఉద్యమం ఆపేది లేదని రైతులు చెప్పారు.

కనీస మద్దతు ధరకు (ఎంఎస్‌పి) చట్టబద్ధత కల్పిస్తే రైతులు ఆందోళన విరమిస్తారని పంజాబ్ కిసాన్ మజ్దూర్ ప్రధాన కార్యదర్శి శర్వన్ సింగ్ పాంథర్ బుధవారం పునరుద్ఘాటించారు. ఢిల్లీ ఛలోలో కేవలం రైతు నాయకులే ప్రదర్శనగా ఢిల్లీకి వస్తారని, దీనికి ప్రభుత్వం అనుమతించాలని ఆయన కోరారు. రైతుల సమస్యలపై శాంతియుతంగా పోరాటాన్ని ముందుకు తీసుకువెళ్లాలని యువతకు ఆయన విజ్ఞప్తి చేశారు.

సిపిఎం దిగ్భ్రాంతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలీసుల దాడిలో రైతు శుభ కరణ్‌సింగ్ మరణించడం పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రైతులపై పోలీసుల దాడిని సిపిఎం రాష్ట్ర కమిటీ తరుపున తీవ్రంగా ఖండించారు. సమస్యలు పరిష్కరించలేని కేంద్ర బిజెపి ప్రభుత్వం మద్దతు ధర అడిగిన రైతులపై దాడి చేసి చంపడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఈ ఘటనను ప్రజాస్వామ్యవాదులు, మేధావులు ఖండించాలని కోరారు. రైతులు చేస్తున్న పోరాటానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

మోడీ దుర్మార్గ వైఖరి : ఎస్‌కెఎం

రైతు ఉద్యమం పట్ల బిజెపి, ప్రధాని నరేంద్రమోడీ దుర్మార్గవైఖరి అనుసరిస్తున్నారనడానికి రైతు మరణం నిదర్శమని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, నాయకులు వై.కేశవరావు, కెవి ప్రసాదు పేర్కొన్నారు. ఇప్పటికే ఇద్దరు రైతులు గుండెఆగి మరణించారని, కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాష్ట్రంలో అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు తెలపాలని కోరారు.

రాష్ట్ర వ్యాప్త నిరసనలు : ఎపి రైతు సంఘం

శాంతియుత ప్రదర్శనపై దాడిచేసి రైతు మృతికి కారణమైన కేంద్రం తీరును ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తీవ్రంగా ఖండించింది. దీనికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకరరెడ్డి డిమాండు చేశారు. ఢిల్లీ ఉద్యమంపై బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను ఖండిస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేపట్టాలని కోరారు.

కౌలు రైతు సంఘం ఖండన

రైతు శుభకరణ్ సింగ్ మృతికి కారణమైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు డిమాండు చేశారు. బిజెపి తీరును ఖండించారు.

గిట్టుబాటు ధర కోరితే చంపేయడం అన్యాయం : ఐద్వా

పంటకు గిట్టుబాటు ధర కోరిన రైతును చంపడం అన్యాయమని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఐద్వా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బి.ప్రభావతి, డి.రమాదేవి తెలిపారు. మద్దతు ధర అడగడమే రైతు చేసిన తప్పా అని ప్రశ్నించారు. ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.






మీ కోసం

గోధుమరవ్వను బాగా వేయించి పెరుగులో అరగంట సేపు నానబెట్టుకోవాలి. ఈ మిశ్రమాన్ని దోసెల పిండిలా రుబ్బుకుని దోసెలు వేసుకుంటే మృదువుగా, రుచిగా ఉంటాయి.

జీవన సౌరభం

అన్నీ కోల్పోయినా.. ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకూడదు. అదొక్కటి ఉంటే చాలు పోగొట్టుకున్నవన్నీ తిరిగి దక్కించుకోగలం.

పన్నాగం- పరిష్కారం



నందన వనాన్ని నందనందనుడు పాలిస్తున్నాడు. ప్రజల సంక్షేమం గురించి అసలు పట్టించుకునేవాడు కాదు. ఒకసారి నందన వనానికి పెద్ద ముప్పు ఎదురైంది. రాజ్యంలో దొంగలు పడి ప్రజలు ఇళ్లలో దాచుకున్న డబ్బు, నగలను ఎత్తుకెళ్లిపోతున్నారు. దారి కాచి దోపిడీలు చేస్తున్నారు. రాజుగారి దగ్గరకి వెళ్లి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఆయన పట్టించుకోలేదు.

ఇలా ఉండగా రాజుగారి ఇంటికి ఒక రోజు బంధువులు వచ్చారు. వారికి ఎంతో మర్యాద చేసి, సాగనంపారు రాజ దంపతులు. అప్పటికే బాగా పొద్దుపోయింది. ఆ రాజ్యంలో జరుగుతున్న దొంగతనాల గురించి తెలిసిన వారంతా బిక్కు బిక్కుమంటూ నడుస్తున్నారు. ఈలోపు ముసుగు ధరించిన ఓ వ్యక్తి వారిని బెదిరించి నగలు, డబ్బు దోచుకెళ్లిపోయాడు. వెళుతూ వెళుతూ వాళ్లల్లో ఒక వ్యక్తికి రక్తం వచ్చేలా కత్తితో గాయం కూడా చేశాడు.

ఇదంతా రాజుగారికి తెలిసింది. తన బంధువులను ఇంతలా హింసించిన ఆ దొంగను పట్టుకొమ్మని మంత్రి మంగయ్యను ఆజ్ఞాపించాడు. శాంతి భద్రతలు క్షీణిస్తుంటే ఏం చేస్తున్నారని దూషించాడు. అప్పుడు మంగయ్య 'ప్రభూ..! ఈ ఒక్క రోజే కాదు. రాజ్యంలో చాలా రోజుల నుంచి శాంతి భద్రతలు లోపించాయి. మీ బంధువుల నగలు పోతేనే ఇలా కస్సుమంటున్నారు.. ప్రజల బంగారు ఆభరణాలను ప్రతి రోజూ దొంగలు దోచుకెళుతున్నారు. వారికి కంటి మీద కునుకు లేదు. చెప్పినా మీరు ఏ విధమైనా చర్యలు తీసుకోలేదు. ఎన్నో సార్లు మీకు విన్నవించుకున్నా నిర్లక్ష్యం చేశారు. ప్రజలు పడుతున్న బాధలు మీకు తెలియాలని నేనే ఈ పన్నాగం పన్ని మీ బంధువుల నగలు దోచుకెళ్లాను. ఇవిగో ఆ నగలు. ఇప్పటికైనా సమస్య మీ వరకు వచ్చింది. ఇక ఆలస్యం చేయకుండా ప్రజలను ఇబ్బంది పెడుతున్న దొంగలను పట్టుకోమని ఆదేశాలు ఇవ్వండి' అని నమస్కరించాడు మంత్రి. నందనందనుడికి జ్ఞానోదయమైంది. వెంటనే తప్పు తెలుసుకున్నాడు. భద్రతా శాఖ సాయంతో దొంగల బెడదను నివారించాడు.

- బోగా పురుషోత్తం, తుంబూరు.

తికమక


పిల్లలూ, ఇక్కడ కొన్ని తెలుగు అక్షరాలు తికమకగా ఇచ్చాం. వాటిని సరిచేసి రాస్తే అర్థవంతమైన పదాలు వస్తాయి. ట్రై చేయండి చూద్దాం.

బపంల ---	బిజిగజి----
కపల ---	ఖశిరం---
లచేవప ---	ఎంలుడ---
జభోనం ---	మింతిలంగ-----
డరవికా ---	లకాపనయా-----

నేను గీసిన బొమ్మ



నేను గీసిన బొమ్మ
వై.లాస్య, 5వ తరగతి,
ఎంపియుపి స్కూలు, డిసి పల్లి, నెల్లూరు.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆహా! ఏమి రుచి.. తినరా మైమరచి

రూ.20కే ప్లేట్‌మీల్స్... కేరాఫ్ 'మన భోజనశాల'



చక్కటి, చిక్కటి పోషకాలతో కూడిన ఆహార పదార్థాలు... కొవ్వులను పెంచని భోజనం.. షడ్రుచులను మైమరిపించేలా భోజనం.. కూరలు.. పచ్చళ్లు... అంతా ఆర్గానిక్ పద్ధతులతో పండించిన బియ్యం, కూరగాయలతో ఘుమఘులాడించే వంటలు... 'ఆహా! ఏమి రుచి..తినరా మైమరచి' అన్న పద్ధతుల్లో రుచికరమైన వంటకాలు 'మన భోజనశాల'లో ప్రత్యేకం. ఇక్కడ శుచి, శుభ్రతకు కూడా పెద్దపీట వేస్తారు. అంతా హై టెక్నాలజీతో, హైజెనిక్ ఫుడ్ ఇక్కడ ప్రత్యేకం. పోషకాలు ఎక్కడా వృథా పోనివ్వకుండా ఆహార పదార్థాల్లోనే ఉండేలా ఇక్కడ వంటకాల్లో మరో ప్రత్యేకత. వంట, తయారీ, కూరగాయలు కోయటం, తరగటం వంటి వాటికి యంత్రాలను ఉపయోగిస్తారు. విజయవాడ నగరానికి అనునిత్యం వివిధ పనులపై దూరప్రాంతాల నుంచి ప్రతిరోజూ సుమారు 2.50 లక్షల మంది వరకూ వచ్చి వెళుతుంటారు. ఇలాంటి వారిలో కొందరికైనా క్షుద్బాధను తీర్చటంలో విజయవాడలోని 'మన భోజనశాల' కృషి చేస్తోంది..

సాధారణంగా విజయవాడలో భోజనం చేయాలంటే హోటళ్లలో రూ.80 నుంచి నాణ్యతను బట్టి రూ.250 వరకూ ఉంది. ఈరోజుల్లో రూ.20కు ప్లేటు ఇడ్లీ కూడా రాని పరిస్థితి! టీ, కాఫీ కూడా రూ.20 పెడితే గాని దొరకటం కష్టంగా మారింది. భోజనానికి ఇంత డిమాండ్ ఉన్న పరిస్థితుల్లో విజయవాడకు చెందిన ఈశ్వర్ ఛారిటీస్ ఆధ్వర్యంలో నగరంలోని శిఖామణి సెంటరు (బ్లోసమ్ ఆసుపత్రిని ఆనుకుని, బందరు రోడ్డులో పశువుల ఆసుపత్రి సిగ్నల్‌కు ఎదురు రోడ్డులో) 'మన భోజనశాల'ను నిర్వహిస్తున్నారు. రూ.20కే ప్లేట్‌మీల్స్ (అయినా కడుపునిండా అన్నం పెడుతున్నారు) పెట్టే భోజనశాల ఉంది. ప్రతిరోజూ ఇక్కడికి వందలాది మంది వచ్చి ఎంచక్కా కడుపు నిండా భోజనం చేసి తమ పనులు హాయిగా చేసుకుంటున్నారు.

సేవాభావంతో...

ఉద్యోగం, వ్యాపారరంగంలో పనిచేసి ఆ తర్వాత తమకున్న సంపాదనలో ఎంతో కొంత సేవ చేయాలనే భావనతో ఇద్దరు స్నేహితులైన సాక్షి ఆదినారాయణ, ఆయన మిత్రుడు ఈశ్వరరావు 'ఈశ్వర్ ఛారిటీస్' ఏర్పాటు చేసి 'మన భోజనశాల'ను నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ 500 మంది వరకూ భోజనాన్ని రూ.20కే అందిస్తున్నారు. ఇక్కడ తయారు చేసే భోజనానికి ప్లేట్ ఒక్కింటికి రూ.60 వరకూ అవుతోంది. అయినా రూ.40ని నిర్వాహకులు భరిస్తూ రకరకాల ఐటమ్స్‌తో నాణ్యమైన, వేడివేడి భోజనాన్ని కడుపు నిండా పెడుతున్నారు. ఎవరూ అర్ధాకలి, ఆకలితో అలమటించకూడదనే లక్ష్యంతో అందిస్తున్నారు.

- యడవల్లి శ్రీనివాసరావు

మెనూ ఇలా...

సొంత భవనమే కావటంతో దానిలో సేవాభావంతో ఉన్న ఐదుగురు ఉద్యోగులను ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకూ కొనసాగుతుంది. ఉదయం 8 గంటల నుంచే పని ప్రారంభించి భోజనాన్ని తయారు చేస్తారు. భోజనంలో రెండు, మూడు రకాల కూరలు, ఒక కప్పు అన్నం (500 గ్రాములు), సాంబారు, మజ్జిగ ఇస్తారు. ఏదో ఒకటి రోటి పచ్చడి కూడా ఉంటుంది. మంచి రుచి కోసం వాము కలిపిన పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలు కూడా అందజేస్తారు.

యాజమాన్యానికి అభినందనలు



అడిగిన వారికి కాదనకుండా చక్కటి భోజనాన్ని తిన్నంత పెడుతున్నారు. ఇక్కడ సిబ్బంది చేసే సర్వీస్ కూడా చాలా చక్కగా ఉంది. శుభ్రత, పరిశుభ్రత చాలా బాగుంది. నాణ్యమైన బియ్యంతో వండిన అన్నం, వేడివేడిగా తాజా కూరగాయలతో చేసిన కూరలు, మజ్జిగా, పచ్చళ్లు అన్నీ చక్కగా ఉన్నాయి. నేను తృప్తిగా తినకలిగిన మోతాదులో తినేశా. తక్కువ ఖర్చుతో క్వాలిటీ ఫుడ్ ఇస్తున్న యాజమాన్యానికి ధన్యవాదాలు

- షేక్ మున్వర్ షరీఫ్, కంకిపాడు


ఆపన్నుల ఆకలి తీర్చటమే ధ్యేయం



కులం, మతం, రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేకుండా సేవాభావంతోనే మన భోజనశాలను ఏర్పాటుచేశాం. నా మిత్రుడు ఈశ్వరరావు, నేనూ కలిసి నిర్వహిస్తున్నాం. 2022 దసరాకు ప్రారంభించాం. నాటి నుంచి నేటి వరకూ రూ.20కే ప్లేట్‌మీల్స్‌ను అందిస్తున్నాం. అత్యంత క్వాలిటీ ఫుడ్‌ను అందించటమే మా లక్ష్యం. వీలైనంత మందికి నాణ్యమైన ఇంటి భోజనం అందించటమే మా లక్ష్యం. అందుకే రెండు మూడేళ్ల క్రితంనాటి పాత బియ్యాన్ని వాడుతున్నాం. తద్వారా అన్నం మంచి క్వాలిటీగా వస్తుంది. ప్రతిరోజూ 10 రకాల కూరగాయలను వినియోగిస్తున్నాం. వాటిలో 10 రకాల దినుసులను వాడుతుంటాం. కూరలు, చెట్నీలు, సాంబారు, రసం, మజ్జిగ ఇలా మేము ఇచ్చే అన్ని ఆహార పదార్థాలు అత్యంత క్వాలిటీతో ఉంటాయి.

– సాక్షి ఆదినారాయణ, మన భోజనశాల నిర్వాహకులు

పోషకాలతో కూడిన ఆహారం



హోటల్‌లో భోజనం తినాలంటే రూ.100 వరకూ చెల్లించాలి. అందులోనే మరింత నాణ్యమైన భోజనం కావాలంటే ఇంకా ఎక్కువ మొత్తం కావాలి. నిత్యం వివిధ పనులపై నగరానికి వచ్చే నా లాంటి వారు చాలామంది ఉంటారు. చాలా రద్దీ ప్రదేశంలో ఇలాంటి భోజనశాల ఉండటం పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు.

-మద్దాలి శ్రీనివాస్, కోలవెన్ను, కంకిపాడు మండలం, కృష్ణాజిల్లా

సేవల్లో ఆనందం..పొందుతున్నాం



ప్రతిరోజూ మావంతుగా సేవాభావంతో కొంతమందికైనా భోజనాన్ని పెట్టగలుగుతున్నాం. రేటు తక్కువైనా ఆహారం ఎక్కువగా అందించటంతోపాటు శుభ్రత విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటాం. వంట సామగ్రితోపాటు సర్వింగ్ ప్లేట్లు అన్నీ కూడా వేడినీటితో అత్యంత శుభ్రంగా ఎప్పటికప్పుడు కడిగిచ్చేస్తుంటాం. ఇంట్లో ఏ విధంగా వండుతామో అదే పద్ధతిలో ఇక్కడా వంటలు తయారు చేయిస్తున్నాం.

- సాక్షి మణి, ఆదినారాయణ సహచరి

ఫాల్కే అవార్డు ఎంతో ఇష్టం : షారూక్ ఖాన్



ఉత్తమ నటుడిగా దాదా సాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ అవార్డు రావటం ఎంతో సంతోషదాయకమని బాలీవుడ్ హీరో షారూక్‌ఖాన్ అన్నారు. దాదా సాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ 2024 అవార్డుల ప్రదానం మంగళవారం రాత్రి ముంబైలో ఘనంగా జరిగింది. దేశంలోని ప్రముఖ సినీనటులతోపాటు బాలీవుడ్ సినీ ప్రముఖులు కూడా సందడి చేశారు. జవాన్ సినిమాలో నటనకుగాను ఉత్తమ నటుడిగా షారూక్ ఖాన్, అదే సినిమాలో హీరోయిన్‌గా నటించిన నయనతార ఉత్తమ నటి అవార్డు, యానిమల్ సినిమా దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా ఉత్తమ దర్శకుడిగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా షారూక్‌ఖాన్ మాట్లాడుతూ 'ఈ అవార్డు కోసం ఎప్పటి నుంచో వేచి చూస్తున్నా. ఇన్నాళ్లకు వరించింది. చాలా సంతోషంగా ఉంది. ఈ అవార్డును నా సహ నటులకు అంకితం ఇస్తున్నా. దీనికి కారణమైన జవాన్ చిత్ర యూనిట్‌కు కృతజ్ఞతలు. ఈ వేదికపైన ప్రేక్షకులు, అభిమానులకు మాటిస్తున్నా. ఇకపై మంచి సినిమాలతో మరింతగా అందరినీ ఎంటర్‌టైన్ చేసేందుకు ప్రయత్నిస్తా' అంటూ పేర్కొన్నారు.

విజేతల వివరాలు ఇవే..

ఉత్తమ నటుడు : షారూక్‌ఖాన్ (జవాన్)
ఉత్తమ నటి : నయనతార (జవాన్)
ఉత్తమ నటి (క్రిటిక్స్) : రాణిముఖర్జీ (మిసెస్ ఛటర్జీ .. నార్వే)
ఉత్తమ దర్శకుడు : సందీప్‌రెడ్డి వంగా (యానిమల్)
ఉత్తమ నటుడు (క్రిటిక్స్) : విక్కీ కౌశల్ (సామ్ బహదూర్)
ఉత్తమ సంగీత దర్శకుడు : అనిరుధ్ రవిచందర్ (జవాన్)
ఉత్తమ నేపథ్య గాయకుడు : వరుణ్‌జైన్
ఉత్తమ నేపథ్య గాయని : శిల్పారావు
విలన్ పాత్రలో ఉత్తమనటుడు : బాబీ డియోల్ (యానిమల్)
టెలివిజన్ సిరీస్‌లో ఉత్తమ నటి : రూపాలీ గంగూలీ (అనుపమ)
టెలివిజన్ సిరీస్‌లో ఉత్తమ నటుడు : నీల్‌భట్ (ఘుమ్ హై కిసికే ప్యార్ మేయిన్)
టెలివిజన్ సిరీస్ ఆఫ్ ది ఇయర్ : ఘుమ్ హై కిసికే ప్యార్ మెయిన్
ఉత్తమ వెబ్ సిరీస్ : ఫర్జీ
వెబ్ సిరీస్‌లో ఉత్తమ నటి : కరిష్మా తన్నా (స్కూప్)
చలన చిత్ర పరిశ్రమకు అత్యుత్తమ సహకారం : మౌషుమి ఛటర్జీ
సంగీత పరిశ్రమకు అత్యుత్తమ సహకారం: యేసుదాస్



'కంగువ' డబ్బింగ్ మొదలైంది

సూర్య నటిస్తున్న 'కంగువ' చిత్రం డబ్బింగ్ పనులు మొదలైనట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ సందర్భంగా సూర్య డబ్బింగ్ చెబుతున్న ఒక ఫొటోని, డబ్బింగ్ వర్క్స్ జరుగుతున్న అద్నాన్ ఆర్ట్స్ స్టూడియోస్‌లో సూర్యతో డైరెక్టర్ శివ, ఇతర టెక్నీషియన్స్ ఉన్న మరో ఫొటోని మేకర్స్ విడుదల చేశారు. స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. దిశా పటానీ హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ సినిమాలో బాబీ డియోల్ కీలక పాత్ర చేస్తున్నారు. మొత్తం పది భాషల్లో ఈ సినిమా తెరకెక్కుతోంది. త్వరలోనే ఈ సినిమా థియేట్రికల్ రిలీజ్ డేట్‌ను మేకర్స్ ప్రకటించనున్నారు. త్రీడీలోనూ ఈ సినిమాను విడుదల చేయనున్నారు.

బాబాయ్ కోరితే ప్రచారం చేస్తా : వరుణ్ తేజ్



తన బాబాయ్ పవన్‌కళ్యాణ్ ఆదేశిస్తే రాష్ట్రంలో త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన పార్టీ తరపున ప్రచారం చేస్తానని హీరో వరుణ్‌తేజ్ వెల్లడించారు. ఆయన కీలక పాత్రలో శక్తి ప్రతాప్ సింగ్ హడా రూపొందించిన సినిమా 'ఆపరేషన్ వాలెంటైన్' మార్చి ఒకటో తేదీన విడుదల కానుంది. సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా చిత్రబృందం విజయవాడలో బుధవారం సందడి చేసింది. వరుణ్‌తేజ్ మాట్లాడుతూ 'గతంలోనూ నా తండ్రి నాగబాబు ప్రచారం చేసినప్పుడు కూడా నేనూ వెళ్లాను. బాబాయ్ పవన్ కళ్యాణ్ నమ్మే సిద్ధాంతాలు, నడిచే దారిపై నాకు నమ్మకం ఉంది. ఆ విషయంలో ఎప్పుడూ సపోర్టు చేస్తా. విజయవాడకు రావడం ఎంతో ఆనందంగా ఉంది. తెలుగులో ఎయిర్‌ఫోర్స్ నేపథ్యంగా ఇప్పటివరకూ ఎలాంటి సినిమా రాలేదు. ఆపరేషన్ వాలెంటైన్ ఆ లోటు తీరుస్తుంది. దేశభక్తి నేపథ్యంగా సాగే కథ ఇది. మార్చి 1న ప్రేక్షకుల ముందుకు రానుంది. కొన్ని సినిమాలు ప్లాన్ చేస్తే జరగవు. ఇది అలాంటిదే. 'కంచె' తర్వాత ఇలాంటి సినిమా రావటం అదృష్టంగా భావిస్తున్నా. పుల్వామా ఘటనల నేపథ్యంలో దీనిని తెరకెక్కించారు. 2019 ఫిబ్రవరి 14న పుల్వామా ప్రాంతంలో భారత జవాన్లపై దాడి జరిగింది. బ్లాక్ డేగా నిలిచింది. అదే రోజు వాలెంటైన్ డే కావటంతో సినిమాకు 'ఆపరేషన్ వాలెంటైన్' పేరు పెట్టాం. యుద్ధ విమానాల నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు విశేషంగా అలరిస్తాయి. వీఎఫ్‌ఎక్స్ సాయంతో అత్యుత్తమంగా వాటిని తీర్చిదిద్దారు. ఈ మూవీ యువతరానికి స్ఫూర్తిగా నిలుస్తుంది' అని వివరించారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ ప్రతినిధులు, నటీనటులు తదితరులు పాల్గొన్నారు.

ధనుష్ 'రాయన్'

ధనుష్ స్వీయ దర్శకత్వంలో ఆయన 50వ సినిమా తెరకెక్కుతోంది. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను చిత్రబృందం ప్రకటించింది. ఈ చిత్రానికి 'రాయన్' అని టైటిల్ పెట్టారు. ఈ సందర్భంగా మూవీ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ ఫస్ట్ లుక్‌లో ధనుష్ మాంసం అమ్మే వ్యక్తి పాత్రలో కనిపించారు. సందీప్ కిషన్‌తో పాటు కాళిదాస్ జయరాం కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఎ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా తమిళం, తెలుగు, మలయాళ, కన్నడ భాషల్లో 2024లోనే విడుదల కానుంది.



మహిళల ఫుట్‌బాల్ జట్టు సంచలనం

- **యూరోపియన్ జట్టుపై తొలి విజయం**




అంకారా(టర్కీ): భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు సంచలనం నమోదు చేసింది. చరిత్రలో తొలిసారి ఓ యూరోపియన్ జట్టుపై విజయం సాధించింది. టర్కిస్ మహిళల టోర్నమెంట్‌లో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 4-3గోల్స్ తేడాతో ఎస్టోనియాపై విజయం సాధించింది. భారత్ తరపున మనీషా కళ్యాణ్ రెండు గోల్స్ చేయగా.. ఇందుమనతి, కతిరేసన్ ఒక్కో గోల్ కొట్టారు. మనీషా 17వ ని.లో బెలారస్ గోల్‌పోస్ట్‌లోకి దూసుకెళ్లి గోల్ చేయడంతో భారత్‌కు 1-0 ఆధిక్యత సాధించింది. ఆ తర్వాత 32వ ని.లో మరో గోల్ చేయడంతో తొలి అర్ధభాగం ముగిసేసరికి భారత్ 2-0గోల్స్ ఆధిక్యతలో నిలిచింది. ఆ తర్వాత ఇందుమతి(62వ), మనీషా (79వ ని)లో ఒక్కో గోల్ కొట్టగా.. ప్యారీ క్సాక్సా(79వ ని.)లో ఒక గోల్ చేయడంతో భారత్ 4-1గోల్స్ ఆధిక్యతలో నిలిచింది.

88వ ని.లో వ్లాడా కుబస్సోవా, 90వ ని.లో లియిస్ లిల్లేమే ఒక్కో గోల్ చేయడంలో భారత్ ఆధిక్యత 4-3గోల్స్‌కు తగ్గింది. చివర్లో భారత డిఫెండర్లు అడ్డుగోడలా నిలవడంతో భారత్‌కు యూరోపియన్ జట్టుపై తొలి విజయం ఖాయమైంది. ఇంతకు ముందు భారత మహిళలజట్టు యూరోపియన్ జట్లయిన బెలారస్, ఉక్రెయిన్, రొమేనియాలతో తలపడినా ఆ మ్యాచుల్లో పరాజయాన్ని చవిచూసింది.

పురుషుల జట్టు ఒలింపిక్స్ ఆశలు ఆవిరి

- ప్రి క్వార్టర్స్‌లో కొరియా చేతిలో ఓటమి
- ప్రపంచ టిటి టీమ్ ఛాంపియన్‌షిప్



సాథియాన్

బుసాన్: పారిస్ ఒలింపిక్స్‌కు బెర్త్ దక్కించుకోవాలంటే తప్పక నెగ్గాల్సిన మ్యాచ్‌లో భారత పురుషుల టిటి జట్టు పరాజయాన్ని చవిచూసింది. ప్రపంచ టీమ్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా బుధవారం జరిగిన ప్రి క్వార్టర్‌ఫైనల్లో పురుషుల జట్టు 3-0తో కొరియా రిపబ్లిక్ చేతిలో ఓటమిపాలైంది. తొలి సింగిల్స్‌లో హర్మీత్ దేశాయ్ 10-21, 11-13, 7-11తో జంగ్-వూజిన్ చేతిలో ఓటమిపాలవ్వగా.. రెండో సింగిల్స్‌లో శరత్ కమల్ 9-11, 5-11, 8-11, 4-11తో లిమ్ జొంగ్‌హూన్ చేతిలో ఓడారు. నిర్ణయాత్మక మూడో మ్యాచ్‌లోనూ స్టార్ జి సాథియాన్ 5-11, 8-11, 2-11తో లీగ్-సంగ్-సు చేతిలో పరాజయాన్ని చవిచూశాడు. అంతకుముందు జరిగిన రౌండ్-32 తొలి సింగిల్స్‌లో హర్మీత్ దేశాయ్ 11-5, 11-1, 11-6తో తిమోర్తీ ఛాయ్, రెండో సింగిల్స్‌లో జ్ఞానకేశ్వరన్ సాథియాన్ 11-3, 11-7, 11-6తో ఆల్‌ఫ్రెడ్ డెలా పెనా, మూడో సింగిల్స్‌లో మనుష్ 11-4, 11-8, 11-6తో మ్యాక్స్‌వెల్‌ను ఓడించాడు.

భారత మహిళా, పురుషుల జట్లు ప్రవేశించాయి. పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌లే లక్ష్యంగా బరిలోకి దిగిన భారత టిటి జట్లు బుధవారం జరిగిన నాకౌట్ పోటీల్లో విజయం సాధించాయి. రౌండ్-32 నాకౌట్ పోటీలో మహిళల జట్టు 3-0తో ఇటలీని, పురుషుల జట్టు కూడా 3-0తోనూ న్యూజిలాండ్‌ను చిత్తుచేశాయి. మహిళల బృందం తొలి సింగిల్స్‌లో స్టార్ క్రీడాకారిణి ఆకుల శ్రీజ 12-10, 11-6, 11-7తో కేవలం 20 నిమిషాల్లోనే నికోలెటా స్టెఫనోవాను చిత్తుచేసింది. రెండో సింగిల్స్‌లో మనిక బత్రా విజయం సాధించి భారత్ ఆధిక్యతను 2-0కు చేర్చింది. మనిక ఆ మ్యాచ్‌ను 12-10, 11-6, 11-5తో కేవలం 23 నిమిషాల్లోనే ముగించింది. తొలి రెండు మ్యాచుల్లో నెగ్గిన భారత్... ఇటలీపై 2-0 ఆధిక్యతను సాధించింది. మూడో సింగిల్స్‌లో అహిక ముఖర్జీ 15-13, 11-9, 13-15, 11-8తో మౌన్‌ఫర్డినిని చిత్తుచేయడంతో భారత్ 3-0తో మ్యాచ్‌ను ముగించింది. 17వ ర్యాంకర్‌గా బరిలోకి మహిళల జట్టు ప్రి క్వార్టర్స్‌లో 4వ సీడ్ చైనీస్ తైపీతో తలపడనుంది. ప్రి క్వార్టర్స్‌లో భారత మహిళలజట్టు చైనీస్ తైపీని చిత్తుచేస్తే పారిస్ ఒలింపిక్స్ బెర్త్ దక్కినట్లే. ఇక పురుషుల జట్టు రౌండ్-32లో కజకిస్తాన్‌తో తలపడనుంది.

జైస్వాల్ కెరీర్ బెస్ట్ ర్యాంక్

ఐసిసి టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదల



దుబాయ్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో ద్విశతకాలతో చెలరేగుతున్న యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్.. టెస్ట్ ర్యాంకింగ్స్‌లోనూ సత్తా చాటాడు. అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) తాజా టెస్ట్ బ్యాటర్స్ జాబితాలో జైస్వాల్ కెరీర్ బెస్ట్ ర్యాంకు 15కు ఎగబాకాడు. ఈ క్రమంలో ఏకంగా14వ స్థానాలు మెరుగుపరుచుకొన్నాడు. రాజ్‌కోట్ టెస్టుకు ముందు 29వ ర్యాంకులో ఉన్న జైస్వాల్ ప్రస్తుతం 699 పాయింట్లతో చేరాడు. కాగా ఐసీసీ టెస్టు బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో భారత్ నుంచి విరాట్ కోహ్లీ ఒక్కడే టాప్-10లో ఉన్నాడు. కోహ్లీ 752 పాయింట్లతో ఏడో స్థానంలో ఉన్నాడు. టీమిండియా సారథి రోహిత్ శర్మ ఒక స్థానం ఎగబాకి 12వ ర్యాంకులో ఉన్నాడు. ఈ జాబితాలో కేన్ విలియమ్సన్(న్యూజిలాండ్) అగ్రస్థానంలో ఉన్నాడు. టెస్టు బౌలర్ల జాబితాలో టీమిండియా జస్ప్రిత్ బుమ్రా.. అగ్రస్థానాన్ని నిలబెట్టుకోగా, రవిచంద్రన్ అశ్విన్.. రెండో స్థానానికి చేరాడు.

యుఎఇ హెడ్ కోచ్‌గా లాల్‌చంద్ రాజ్‌పుత్



ముంబయి: భారత మాజీ క్రికెటర్ లాల్‌చంద్ రాజ్‌పుత్ యుఎఇ పురుషుల క్రికెట్‌జట్టు హెడ్ కోచ్‌గా ఎన్నికయ్యారు. యుఎఇ హెడ్‌కోచ్‌గా రాజ్‌పుత్ మూడేళ్లు కొనసాగనున్నారు. 1980వ దశకంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన 62ఏళ్ల రాజ్‌పుత్.. 2016-17లో ఆఫ్ఘనిస్తాన్‌కు కోచ్‌గా పనిచేసిన అనుభవముంది. ఐసిసి క్రికెట్ వరల్డ్‌కప్ లీగ్-2, వన్డే ట్రై సిరీస్‌లతో పాల్గొనే యుఏఇ జట్టుతో కలిసి రాజ్‌పుత్ బాధ్యతలు స్వీకరించనున్నాడు.

ట్రై సిరీస్‌లో యుఏఇ జట్టుతోపాటు స్కాట్లాండ్, కెనడా జట్లు ఆడనుండగా.. ఈ టోర్నమెంట్‌కు యుఏఇ ఆతిథ్యమిస్తోంది. ఫిబ్రవరి 28నుంచి ఈ టోర్నమెంట్ ప్రారంభం కానుంది. 2018-19లో జింబాబ్వే జట్టుకు రాజ్‌పుత్ కోచ్‌గా ఉన్నప్పుడు పురుషుల జట్టు 2022 టి20 ప్రపంచకప్‌కు అర్హత సాధించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68